అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 28-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 270 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50





నిరసనలు, ఆందోళనల నడుమ సర్వే!

- రెండో రోజూ కొనసాగిన మూసీ మార్కింగ్ ప్రక్రియ
- 'డబుల్' ఇండ్లు వద్దంటూ పలు ప్రాంతాల్లో మూసీ నివాసితుల ఆందోళన బాట
- అధికారులతో వాగ్వాదం.. వెనుదిరిగిన అధికారులు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు.. ప్లకార్డుల ప్రదర్శనలు
- 'డబుల్' ఇండ్లకు వెళ్లేవారి పిల్లలను స్కూల్లో చేర్పించేందుకు అధికారుల చర్యలు
- మూసీ నివాసితుల ముసుగులో పార్టీల 'రాజకీయం'



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న ఇండ్లకు రెడ్‌మార్క్ వేస్తున్న ప్రక్రియ రెండో రోజూ ఉద్రిక్తతల నడుమ సాగింది. కొన్నిచోట్ల కొంత అంతరాయం, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా అధికారులు మాత్రం వారి పని వారు చేసుకుంటూ ముందుకు వెళ్లారు. దాంతో నిర్వాసితులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన బాట పట్టారు. 'ఎంతో కష్టపడి కట్టుకున్న ఇండ్లు వదిలి.. డబుల్ ఇండ్లకు ఎట్లా పోవలే' అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగి.. మార్కింగ్ ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చైతన్యపురి పరిధిలోని వినాయక్‌నగర్, సత్యనగర్, వెంకటసాయి నగర్, మారుతీ నగర్, ఫణిగిరి నగర్ తదితర ప్రాంతాల్లో మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. నివాసితులకు, రాజకీయ నాయకులు తోడవడంతో ఆందోళన మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. రాజేంద్రనగర్ మండలంలో రివర్ బెడ్‌లో అధికారులు ఐడెంటిఫికేషన్ మార్క్ వేయడానికి రాగా.. రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనలు చేశారు. దాంతో పోలీసు బందోబస్తు మధ్య ఇండ్లకు స్టాంప్‌లు వేశారు. నాంపల్లి మండల పరిధిలో ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే, పురానాపూల్ దర్వాజా, కాశీబుగ్గ టెంపుల్ వద్ద మూసీ నివాసితులు ఆందోళనలకు దిగారు. అధికారులు సముదాయించినా రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. జియాగూడ పరిధిలోని మూసీ రివర్ బెడ్‌లో మార్కింగ్ చేస్తుండగా సుమారు వంద మందికిపైగా బాధితులు పటేల్ హోటల్ వద్ద ఆందోళన చేపట్టారు. దాంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొనగా.. పోలీసులు వచ్చి ఆందోళనకారులకు సర్దిచెప్పారు.

ప్రభుత్వ ఖర్చులతోనే తరలింపు

సిటీలోని పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళనలు జరుగుతుంటే.. ఇంకోవైపు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నవారిని అధికారులు ప్రభుత్వ ఖర్చులతో తరలిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లాలో మరో 14 కుటుంబాలను తరలించారు. రాజేంద్రనగర్ పరిధిలో మరో 4 కుటుంబాలను అధికారులు డబుల్ ఇండ్లకు తరలించారు. కాగా, వనస్థలిపురంలో 97, ప్రతాపసింగారంలో 40, తిమ్మాయిగూడలో వంద డబుల్ ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, మూసీ నివాసితులు తాము కోరుకున్న చోట ఇండ్లు ఇస్తామని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి తెలిపారు.

విద్యాసంవత్సరానికి ఇబ్బందులు లేకుండా...

మూసీ రివర్ బెడ్ ప్రాంతవాసులను డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు తరలివెళ్లాలని అధికారులు నివాసితులకు సూచిస్తున్న నేపథ్యంలో చాలా మంది తమ పిల్లల చదువులకు అడ్డంకులు అవుతాయని ఆందోళనకు గురవుతున్నారు. స్కూళ్లు ప్రారంభమై, అడ్మిషన్ల గడువు ముగిశాక మధ్యంతరంగా వెళ్లమంటే ఎలా అని ప్రశ్నించారు. దాంతో అధికారులు, జీహెచ్‌ఎంసీ హౌసింగ్ స్టాఫ్ తగు చర్యలు తీసుకుంటున్నారు. వారుండే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో అధికారులతో మాట్లాడి అడ్మిషన్లు ఇప్పిస్తున్నారు. ఇలా గురువారం భవానినగర్ నుంచి వనస్థలిపురం వెళ్లిన కొంతమంది నివాసితుల పిల్లల చదువుపై స్థానిక ఎడ్యుకేషన్ ఆఫీసర్లతో మాట్లాడి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఇలానే మున్ముందు వచ్చే వారికి కూడా ఇబ్బంది లేకుండా చూస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

నివాసితులకు రెచ్చగొడుతున్న రాజకీయ పార్టీలు..

చాలా చోట్ల మూసీ నివాసితులు 'డబుల్' ఇండ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ స్థానిక బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు వారిని రెచ్చగొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మొదట్లో డబుల్ ఇండ్లకు వెళ్తామని చెప్పినవారిని బెదిరించడం, వెళ్లడానికి సిద్ధంగా ఉన్నవారిని అడ్డుకోవడం లాంటివి నాయకులు చేస్తున్నారని సమాచారం. ఉప్పల్ మండల రెవెన్యూ పరిధిలోని వినాయకనగర్ కాలనీ, ఫణిగిరి కాలనీ, సత్యనగర్ కాలనీ, మారుతి నగర్ కాలనీల్లో గుర్తించిన ఇండ్లకు మార్కింగ్ వేసే క్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉదయం అధికారులు మూసీ రివర్ బెడ్ వద్దకు వచ్చే సమయానికి బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు అక్కడికి చేరుకుని మార్కింగ్ చేస్తున్న అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. బీజేపీ నాయకులు అక్కడే బైటాయించి నిరసన తెలిపారు. సత్యనగర్ కాలనీలో కొంతమందిని ఎంఆర్వో సిబ్బంది డీసీఎంలలో తరలించే ప్రయత్నం చేయగా బీజేపీ కార్పొరేటర్లు వారిని అడ్డుకొని అధికారులతో వాదనకు దిగారు. మీరు వారిని బలవంతంగా ఎలా తరలిస్తారంటూ అక్కడున్న ఓ తహసీల్దార్‌తో గొడవ పెట్టుకున్నారు. ఎవ్వరు చెప్పినా వెళ్లొద్దంటూ వారికి అడ్డుపడ్డారు. అలాగే సిటీలోని చాలా చోట్ల జరిగే ఆందోళనల వెనుక ఈ రెండు పార్టీలే ఉండి, నివాసితులను రెచ్చగొడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

గొప్ప ప్రజాసేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఆయన జయంతి సందర్భంగా : అదనపు డీజీ మహేశ్ భగవత్ నివాళి



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భారత స్వాతంత్ర్యోద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో ప్రజల కోసం అనుక్షణం పరితపించిన గొప్ప ప్రజాసేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్ అన్నారు. బాపూజీ జయంతిని పురస్కరించుకొని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. 1942 భారత స్వాతంత్ర్యోద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజలను సమీకరించి జరిపిన పోరాటాన్ని ఎవ్వరూ మరవలేరని అన్నారు. జైలు జీవితం గడిపి స్వాతంత్ర్యం సిద్ధించాక తెలంగాణ ఉద్యమంలో సైతం ఆయన కీలక పాత్రను పోషించారని తెలిపారు. ముఖ్యంగా, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలుకొని ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించే వరకు ఆయన అలుపెరగని పోరాటాన్ని సాగించారని ఆయన కొనియాడారు. బాపూజీ జీవన మార్గం నేటి తరానికి ఎంతో అనుసరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కార్యాలయానికి చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులర్పించారు.

30న 'చలో లేబర్ కమిషనరేట్'లో కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొనాలి

- టీయూఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

30న చలో లేబర్ కమిషనరేట్ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొనాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్ఇయూ) కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండి.ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్ట్ వర్కర్లు, నాన్ పర్మినెంట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, కనీస వేతనం రూ.26 వేలు, కార్మిక చట్టాల అమలు కోసం చలో కమిషనరేట్ పేరుతో హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. వైద్యారోగ్యశాఖలోని అన్ని రకాల ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఉన్న 17 వేల మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ఏఎన్ఎంల నియామకాలు చేపట్టి అందులో రెండో ఏఎన్ఎం, అర్బన్ ఏఎన్ఎం, ఈసీఏఎన్ఎం తదితరులను పర్మినెంట్ చేయాలనీ, 104 ఉద్యోగులకు ఆర్థికశాఖ నుంచి కంటిన్యూయేషన్ ఉత్తర్వులు ఇప్పించాలనీ, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ నియామకాల నోటిఫికేషన్లలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు ఇతర చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగనున్న చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ అక్రమాలపై చర్యలెందుకు తీసుకోలేదు?



నవతెలంగాణ-హైదరాబాద్

జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ మేనేజింగ్ కమిటీ అక్రమాల రిపోర్టు అందినా ఎందుకు చర్యలు తీసుకోలేదని కో-ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ ఎం.హరితను హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఆదేశించినా చర్యలు తీసుకోకపోతే ధిక్కరణ చర్యగా పరిగణించి జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించింది. జూబ్లీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై తాము దాఖలు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయడంలో కమిషనర్ ఫర్ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. ఆ నివేదికపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశిస్తూ, విచారణ అక్టోబర్ 18కి వాయిదా వేసింది.

గ్రూప్ 1పై విచారణ 30కి వాయిదా

గ్రూప్-1పై విచారణను హైకోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. పరీక్షకు మళ్లీ నోటిఫికేషన్ తిరిగి జారీ చేసే అధికారం టీఎస్‌పీఎస్సీకి (తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) లేదంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు షురూ అయ్యాయి. ప్రభుత్వ అనుమ తితోనే టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టాలని, నేరుగా చర్యలు తీసుకునే అధికారం లేదని పిటిష నర్లు వాదించారు. గత నోటిఫికేషన్ మేరకు నిర్వహించిన పరీక్షలో తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రిలిమ్స్ మాత్రమే రద్దు చేసిన హైకోర్టు తిరిగి పరీక్ష నిర్వహిం చాలని చెప్పిందన్నారు. ఇందుకు విరుద్ధంగా టీఎస్‌పీఎస్సీ నోటి ఫికేషన్‌ను కూడా రద్దు చేసిం దన్నారు. విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు.

పువ్వాడ పిటిషన్ కొట్టివేత

2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనీ, మద్యం, క్రికెట్ కిట్‌లు పంపిణీ చేస్తున్నారని నాటి ఎన్నికల అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలి పీఎస్‌లో కేసు నమోదైంది. దీనిని రద్దు చేయాలన్న పువ్వాడ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

అనుదినం... జనపక్షం www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 28-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 270 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50



రూపాయి పతనం

డాలర్‌తో మారకం రూ. 84.70 పైసలు

మార్కెట్లూ డీలా

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ ఒత్తిడికి గురి అవుతోంది. శుక్రవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ నాలుగు పైసలు పతనమై రూ.84.70 స్థాయికి దిగజారింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భారత మార్కెట్లలో నష్టాలు, అమెరికన్ కరెన్సీకి పెరిగిన డిమాండ్ తదితర పరిణామాలు రూపాయి విలువ తగ్గుదలకు కారణమయ్యాయి. భారతీయ ఈక్విటీ మార్కెట్ల పతనం, విదేశీ నిధులు తరలిపోవడం ప్రభావం చూపాయని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు. వారాంతంలో ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 83.64 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ...15లో

మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకం

చారిత్రక కట్టడాలు పరిరక్షిస్తాం



విద్యార్థులకు ఉచితంగా తెలంగాణ దర్శిని

పురాతన భవనాల్ని పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకోవాలి : సీఐఐ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మూసీ ప్రక్షాళనను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడి పరివాహక ప్రాంతాల్లోని చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అదే సందర్భంలో హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే పురాతన కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) రాష్ట్ర విభాగం శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర పర్యాటకశాఖతో ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామనీ, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీహాల్‌కు చారిత్రక ప్రాధాన్యత ఉన్నదనీ, ఆ భవనాన్ని ప్రత్యేక టెక్నాలజీతో నిర్మించారనీ, భవిష్యత్ తరాల కోసం దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సీఐఐ ...7లో



కొండా లక్ష్మణ్‌కు సీఎం నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బాపూజీ సేవల్ని ఆయన గుర్తుచేసుకున్నారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి కూడా నివాళులు అర్పించారు.



మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు

ఐదు చోట్ల సోదాలు

కస్టమ్స్ చెల్లించకుండా ఖరీదైన వాచ్‌లు తెచ్చారనే ఆరోపణలపై కేసు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసం, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం మెరుపుదాడులు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ...15లో

హడావుడి ఎందుకు?

హైడ్రాపై రాష్ట్ర సర్కారును ప్రశ్నించిన హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నోడల్ ఏజెన్సీ మాత్రమేననీ, దానికి ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని హైకోర్టు రాష్ట్రాన్ని ఆదేశించింది. కూల్చివేతల విషయంలో నోడల్ ఏజెన్సీ ఎందుకు ఇంత హడావుడి, దూకుడు నిర్ణయాలు తీసుకుంటున్నదని ప్రశ్నించింది. శనివారం నోటీసు ఇచ్చి ఆదివారం కూల్చేస్తారా? కోర్టు పనిదినాల వరకు ఒకరోజు కూడా ఆగలేరా? అని నిలదీసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామపంచాయతీ సర్వేనంబర్ 165, 166లోని 270 గజాల స్థలంలోని ఐదు అంతస్తుల భవనాన్ని కూల్చివేయడాన్ని రఫీ, గణేశ్ నిర్మాణ ...7లో

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో భేటీ

ఏచూరికి ఘన నివాళి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్)లో శుక్రవారం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సమావేశం ఘనంగా నివాళి అర్పించింది. ఇది సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి లేకుండా జరిగే మొదటి సమావేశం కానుంది. ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే కేంద్ర కమిటీకి ఈ సమావేశంలో ప్రతిపాదనలు చర్చించనున్నారు. దేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న పరిణామాలపై చర్చ జరుగనుంది. ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, మాణిక్ సర్కార్, పినరయి విజయన్, బృందాకరత్, బివి రాఘవులు, సూర్యకాంత్ మిశ్రా, సుభాషిణి అలీ, ఎండీ సలీం, ఎంఎ బేబి, తపన్ సేన్, జి. రామకృష్ణ, ఎ.విజయరాఘవన్, నిలోత్పల్ బసు, అశోక్ ధావలే, రామచంద్ర డోమ్, గోవిందన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి లేని లోటు తీర్చలేనిది

కుటుంబానికి స్టాలిన్ పరామర్శ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కుటుంబాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పరామర్శించారు. శుక్రవారం నాడిక్కడ వసంత్ కుంజ్‌లో సీతారాం ఏచూరి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను కలుసుకుని ...15లో

ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రవీంద్రభారతిలో 109వ జయంతి వేడుకలు

బాపూజీ ఆశయాలైన రైతన్న-నేతన్న సిద్ధాంతంతో రాష్ట్రప్రభుత్వం ముందుకు : మంత్రులు

నవతెలంగాణ-కల్చరల్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్(ఐఐహెచ్‌టీ)కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమాన్ని.. బాపూజీ ఆహ్వాన కమిటీ, రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, రాష్ట్ర పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్క హాజరై.. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ బాపూజీ కొండా లక్ష్మణ్ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప పోరాట యోధుడని, ఆయన జీవితమంతా ప్రజల కోసమే అంకితం చేశారని తెలిపారు. ఆయనకు ఎన్నో పదవులు వచ్చాయని, అయినా మొదటితరం తెలంగాణ ఉద్యమంలో పదవులను కూడా త్యాగం చేశారని గుర్తుచేశారు. బాపూజీ ఆశయాలైన రైతన్న-నేతన్న సిద్ధాంతంతో రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నేతన్నలకు రుణమాఫీ చేయడంతో వృత్తి, జాతికి గౌరవం ఇచ్చేలా తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. బాపూజీ మహోన్నతమైన వ్యక్తి అని, పట్టుదలకు, నిజాయితీకి, పోరాటానికి మారు పేరని ...15లో

విద్యావిధాన పత్రం ప్రకటించాలి

ప్రయివేటీకరణపై ప్రభుత్వ వైఖరేంటి?



విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి : ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జనలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

విద్యావ్యవస్థలో మార్పులు తేవాలి

ప్రభుత్వ బడులు పెంచాలి : ఎస్ఎఫ్ఐ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యావిధాన పత్రం ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి మహాగర్జన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ మెస్ చార్జీలను పెంచుతూ జీవో జారీ చేస్తామన్న సర్కారు ఆ హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ప్రయివేటీకరణ పెరిగితే విద్యలో నాణ్యత లోపించి కేవలం పట్టాలు మాత్రమే వస్తాయని తెలిపారు. ఉద్యోగం, ఉపాధి, సొంతంగా ఆలోచించే శక్తి లేక యువత నిర్వీర్యమవుతుందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో విద్యారంగాన్ని ధ్వంసం చేసిందనీ, ప్రయివేటీకరణ వైపే నిలిచిందని విమర్శించారు. విద్యా ...6లో

పోలీసుల ఓవరాక్షన్..బలవంతపు అరెస్టులు



ధర్నా అనంతరం పలువురు విద్యార్థులు సచివాలయం వెళ్లి విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించేందుకు బయలుదేరగా పోలీసులు రంగంలోకి దిగి వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. దీంతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు పోలీసులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కొద్ది మంది ...6లో

తెలంగాణకు రెండు పర్యాటక అవార్డులు

స్పిరిచ్యువల్, వెల్నెస్‌లో సోమశిల, క్రాఫ్ట్స్‌లో నిర్మల్‌కు పురస్కారాలు

వివరాలు 7లో..

బంజారా హిల్స్‌లో డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ

పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్‌లో నిందితుల అరెస్ట్

వివరాలు 15లో..

శ్రమదోపిడీ సహించం

28న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు



30న చలో లేబర్ కమిషనరేట్

బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాల్లో తేడా లేదు

నాన్‌పర్మినెంట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

కనీస వేతనాలు పెంచాలి

కార్మిక చట్టాలు అమలు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర నేతల డిమాండ్

వివరాలు 15లో..

ఓపీ డబుల్..ఐపీ హౌస్ ఫుల్

ఉస్మానియా ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ రోగులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఓపీ, ఐపీ పేషెంట్లతో హాస్పిటల్ నిత్యం రద్దీతో కనిపిస్తోంది. ఒక్క బుధవారం మినహా మిగతా రోజుల్లో రోగులు ఎక్కువగా వస్తుండటంతో చికిత్సకు గంటల సమయం వేచి చూడాల్సి వస్తోంది. ఓవైపు సరిపడా మందులు, వైద్యుల్లేక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు హాస్పిటల్‌కు వచ్చే రోగులకు సరిపడా పడకలు లేకపోవడంతో నేలపైనే వైద్యం అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. వారం రోజులుగా ఓపీకి వచ్చే రోగుల సంఖ్య డబుల్ అయితే.. ఐపీలో నిత్యం 150 నుంచి 200 మంది వరకు ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు.

ఇన్, ఔట్ పేషెంట్లతో కిటకిట

రోజురోజుకూ పెరుగుతున్న రోగుల రద్దీ

మందులు, వైద్యులు, నర్సుల కొరత



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్దదైన ఉస్మానియా హాస్పిటల్‌లోని ఇన్, ఔట్ పేషెంట్ల విభాగాలు రోగులతో హౌస్‌ఫుల్ అయ్యాయి. సాధారణ రోజుల్లో హాస్పిటల్‌కు ప్రతిరోజూ 2వేల వరకు ఓపీ ఉంటే, ప్రస్తుతం 3 నుంచి 4వేల వరకు ఉంటుంది. ఇక సీజనల్ జ్వరాలు, గుండె సమస్యలు, బీపీ, షుగర్, కిడ్నీ, లివర్ సమస్యలు, మూత్ర పిండాల సమస్యలు, ఇతర వ్యాధులు, ప్రమాదాలతో వస్తున్న బాధితులతో ఇన్ పేషెంట్ విభాగం కిటకిటలాడుతోంది. నగర శివారుతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు, వారి వెంట వచ్చిన కుటుంబీకులు, పరామర్శించేందుకు వచ్చే సందర్శకులతో ఉస్మానియాలోని ఓపీ, కులీకుతుబ్ షాహీ భవనాల్లోని వార్డులు రద్దీగా మారాయి. సరిపడా పడకల్లేకపోవడంతో నేలపైనే రోగులు చికిత్స పొందుతున్నారు. 1,168 పడకల సామర్థ్యమున్న ఈ హాస్పిటల్‌లో ప్రస్తుతం 1600 వరకు రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ రోగులు అడ్మిట్ కాలేదని హాస్పిటల్ వర్గాలు చెబుతున్నాయి. ఓపీ భవనం మొదటి అంతస్తులోని వార్డులు కూడా నిండిపోవడంతో కొంత మందికి నేలపైనే వైద్యం అందిస్తున్నారు. పాత భవనం మూసేయడంతో రోగులకు సరైనన్ని పడకలు లేవు. సోమవారం 170, మంగళవారం 190 మంది రికార్డు స్థాయిలో ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ కాగా.. బుధ, గురువారం, శుక్రవారం సైతం 100కు పైగా చేరారు.

వేధిస్తున్న మందులు, వైద్యుల కొరత

ఉస్మానియా హాస్పిటల్‌ను మందులు, వైద్యులు, నర్సుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఓపీ భవనంలోని పరీక్షా కేంద్రాల్లో రక్త నమూనాలు సేకరించేందుకు, ఇతర పరీక్షలు చేసేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. పెద్ద సంఖ్యలో రోగులు వస్తుండటంతో వారిని తరలించేందుకు సిబ్బంది సరిపోవవడం లేదు. రోగులను వార్డుల్లోకి తరలించేందుకు ...15లో

నవతెలంగాణ

గెలుస్తానన్న నమ్మకం లేనివాడు ఓడిపోతాననే అనుమానం ఉన్నవాడు కచ్చితంగా పరాజయం పాలవుతాడు - నెపోలియన్

శనివారం 28 సెప్టెంబరు 2024
www.navatelangana.com

లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి

సంపాదకీయం

లెబనాన్‌పై వైమానిక, క్షిపణిదాడులు జరుపుతున్న ఇజ్రాయిల్ వాటిని మరింత తీవ్రం గావించేందుకు భూతల దాడులకు సిద్ధమౌతున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. మధ్య ప్రాచ్యంలో పరిమిత యుద్ధం కోసం తహతహలాడుతున్న ఈ ఉన్మాది చర్యలను యావత్ ప్రపంచమూ ఖండించాలి. దాని ప్రతికూల ప్రభావం ఆ ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదు. ఇటీవల అది జరిపిన పేజర్లు, వాకీటాకీల పేల్చివేత దాడులతో లెబనాన్‌లో ప్రబల శక్తిగా ఉన్న హిజబుల్లా సాయుధ సంస్థకు తీవ్ర ఎదురుదెబ్బలతో పాటు కొంతమంది ప్రముఖ నేతలను కూడా అది కోల్పోయింది.దానికి ప్రతీకారంగా శక్తివంతమైన ఖాదర్-1 క్షిపణితో తొలిసారిగా ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్ నగరం మీద దాడిచేసింది. అది ఖండాంతర క్షిపణి కాకున్నా ఆ లక్షణాలు కలిగిన శక్తివంతమైన ఆయుధంగా చెబుతున్నారు. ప్రమాద ఘంటికలను మోగించటంతో పది లక్షల మంది నగర పౌరులు రక్షణ కోసం కలుగుల్లోకి పరుగులు తీశారని వార్తలు, దాన్ని తిప్పికొట్టామని నెతన్యాహు యంత్రాంగం చెబుతున్నప్పటికీ ఉత్తర ఇజ్రాయిల్ ప్రాంతంలో ఇరవైలక్షల మంది పౌరులు ప్రాణాలు అరచేత పట్టుకొని ఎప్పుడేం జరుగుతుందో అన్న భయంతో ఉన్నారని, స్కూళ్లను మూసివేశారని వార్తలు వచ్చాయి.

> ఇప్పటికే ఇజ్రాయిల్ అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను తోసిరాజని తెగబడుతోంది. అంతర్జాతీయ కోర్టు తీర్పులను ఖాతరు చేయటం లేదు. దాని మీద ఆంక్షల విధించేందుకు భద్రతా మండలిలో వచ్చిన తీర్మానాలన్నింటినీ అమెరికా వీటోతో అడ్డుకొని కాపు కాస్తోంది. మరి కొద్ది రోజుల్లో గాజా మారణకాండకు ఏడాది నిండనుంది. కొద్ది రోజుల్లోనే హమాస్ సాయుధులను మట్టుపెడతామని చెప్పిన ఇజ్రాయిల్‌కు అది సాధ్యం కాలేదు.



ఇప్పటి వరకు హిజబుల్లా గరిష్టంగా ఇరవై కిలోమీటర్లవరకు ప్రయాణించే క్షిపణులతోనే దాడులు జరిపింది. మూడువందల కిలోమీటర్లు, అంతకు మించి దూరం, భారీ మొత్తాలలో పేలుడు పదార్థాలను మోసుకు పోగల క్షిపణులు దానికి ఇరాన్ సరఫరా చేసిందన్న వార్తలు, వాటిని ప్రయోగిస్తే ఏం జరుగుతుందనేది చర్చగా ఉంది. ఒకవేళ అదే జరిగితే దానికి ఇజ్రాయిల్, గాజా, వెస్ట్‌బాంక్ ప్రాంతాలలో అది జరుపుతున్న మారణకాండకు నిస్సిగ్గుగా మద్దతు ఇస్తున్న దేశాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇరాన్‌ను రెచ్చగొట్టేందుకు ఇజ్రాయిల్ చేస్తున్న ప్రముఖుల హత్యలు, దాడులు తెలిసిందే. మధ్యధరా, ఎర్ర సముద్రాల్లో అమెరికా, బ్రిటన్ యుద్ధ నౌకలు దానికి కాపుగా సిద్ధంగా ఉన్నాయి. ఎంతగా రెచ్చగొట్టినా పశ్చిమ దేశాలలో వలలో పడకుండా ఇరాన్ నాయకత్వం సంయమనం పాటిస్తోంది. సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. ఎంత కాలం అలా ఉండగలదనేది ప్రశ్న. అదేమీ మరొక దేశాన్ని ఆక్రమించుకొనేందుకు చూడటం లేదు. ఇజ్రాయిల్ దురాక్రమణలో ఉన్న పాలస్తీనా విముక్తి పొందాలని, అక్కడి పౌరులపై జరుపుతున్న మారణకాండను ఆపాలని మాత్రమే కోరుతోంది. దాని విముక్తికోసం అన్ని విధాలుగా సాయపడుతోంది.

గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు నిరసనగా ఎమెన్‌లోని హౌతీ సాయుధులు జరుపున్న దాడుల కారణంగా మధ్య ధరా -ఎర్ర సముద్రాలను కలుపుతూ తవ్విని సూయజ్ కాలువ ద్వారా అరేబియా సముద్రంలోకి ప్రవేశించే నౌకల రవాణాకు ఆటంకం కొనసాగుతోంది. నౌకలు ఆఫ్రికాను చుట్టి రావటం ఎంతో ఖర్చుతో కూడు కోవటమేగాక అధిక సమయం కూడా పడుతోంది. దీనివలన పడే భారాలను జనాలు మోయాల్సి వస్తోంది.గాజాలో జరుపుతున్న మారణకాండను ఇంతవరకు పశ్చిమదేశాలు నివారించలేకపోయాయి. మరోవైపు లెబనాన్‌లోకి చొచ్చుకుపోయేందుకు ఇజ్రాయిల్ పూనుకుంది. అక్కడ ఉన్న హిజబుల్లా స్థావరాలన్నిం టినీ ధ్వంసచేస్తానంటోంది. ఈ తరుణంలో హిజబుల్లాతో 21రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ అంటూ అమెరికా, ఫ్రాన్స్ ఒక ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. పాలస్తీనాపై శాశ్వత కాల్పుల విరమణ సంగతి తేల్చని ఈ దేశాలు ఇప్పుడు ఎందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు? లెబనాన్ ఆక్రమణకు సర్వసన్నద్ధాలు చేసుకొనేందుకు, అవసరమైన ఆయుధాలను సమకూర్చు కొనేందుకు దానికి అవకాశం కల్పించే దుష్ట ఆలోచన కూడా లేదని ఎలా చెప్పగలం.

ఇప్పటికే ఇజ్రాయిల్ అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను తోసిరాజని తెగబడుతోంది. అంతర్జాతీయ కోర్టు తీర్పులను ఖాతరు చేయటం లేదు. దాని మీద ఆంక్షల విధించేందుకు భద్రతా మండలిలో వచ్చిన తీర్మానాలన్నింటినీ అమెరికా వీటోతో అడ్డుకొని కాపు కాస్తోంది. మరి కొద్ది రోజుల్లో గాజా మారణకాండకు ఏడాది నిండనుంది. కొద్ది రోజుల్లోనే హమాస్ సాయుధులను మట్టుపెడతామని చెప్పిన ఇజ్రాయిల్‌కు అది సాధ్యం కాలేదు. అలాంటిది హమాస్ కంటే ఎన్నోరెట్లు బలం కలిగిన హిజబుల్లాను లొంగదీసుకోవటానికి పూనుకోవటం దుస్సాహసానికి పాల్పడటమే అని అనేకమంది విశ్లేషకులు హెచ్చరిస్తున్నప్పటికీ ముందుకు పోతున్నారు. తన రక్షణ కోసం అవసరమంటూ గతంలో దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించుకొని విధిలేక వెనక్కు వచ్చిన ఇజ్రాయిల్ పాఠాలు నేర్చుకున్నట్లు లేదు.యూదు దురహంకారులు మధ్య ప్రాచ్యాన్ని మంటల్లోకి నెడుతున్నారు. వారికి అమెరికా, ఇతర పశ్చిమదేశాలు వంతపాడటం గర్హనీయం.

భగత్‌సింగ్ ఆశయం సోషలిజం




ఎస్.వినయకుమార్
9989718311

షహీద్ భగత్‌సింగ్‌పై వచ్చిన రచనలు, సినిమాలు చాలావరకు ఆ త్యాగశీలి రాజకీయ సిద్ధాంతాలను పట్టించు కోవు. ఆయన కమ్యూనిస్టు అన్న వాస్తవాన్ని దాచేస్తాయి. దేశానికి స్వాతంత్ర్యం వస్తే చాలని భగత్‌సింగ్ భావించలేదు. తెల్లదొరలు పోయి నల్ల దొరలు గద్దెలెక్కితే ప్రయోజనం ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. రష్యాలో మాదిరిగా భారతదేశంలో కూడా సోషలిస్టు రాజ్యం, సమ సమాజం ఏర్పడాలని భావించారు. జైలుకు వెళ్లడానికి ముందు, జైల్లో ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తూ ఆయన విస్తృతంగా మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. మారుపేర్లతో పత్రికలకు రహస్యంగా వ్యాసాలు రాసి పంపారు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, ట్రాట్స్కీల రచనలే కాదు. అనార్కిస్టుల, నిహిలిస్టుల రచనలను, యూరోపులోని ఉద్యమాలను అధ్యయనం చేశారు. రవీంద్ర నాథ్ టాగోర్, మాక్సింగోర్కీ, లియో టాల్‌స్టాయి, బెర్ట్రండ్ రసెల్, థామస్ పెయిన్, బుఖారిన్ వంటి ప్రపంచస్థాయి చింతానాపరుల రచనల నుండి కూడా ఆయన ముఖ్యమైన అంశాలను తన జైలు నోటుబుక్‌లో రాసుకున్నారు. మిర్జా గాలిబ్ నుండి మొదలెట్టి విలియం వర్డ్స్ వర్త్ వరకు అంతర్జాతీయ స్థాయి కవుల కవిత్వాన్ని చదివి తన ముఖ్యమైన అంశాలను జైలునోటు బుక్‌లో రాసుకొన్నారు.

తన వ్యాసాల్లో ఆయన మతతత్వ ప్రమాదం గురించి దూరదృష్టితో ఖచ్చితమైన హెచ్చరిక చేశారు. మతవాదుల పట్ల ఉదాసీనత ప్రమాదకరమని బోధించారు. ఆ రోజు ఆ వాదన చేస్తున్న వారి వెనక యువకులు లేరు కదా అన్న ధీమాతో ఉండరాదని చెప్పారు. తనకు గురుతుల్యుడు, పితృసమానులైన లాలా లజపత్ రాయ్ హిందూ మహాసభకు అనుకూలంగా మారినప్పుడు ఆయన ఘాటుగా విమర్శించారు. భగత్‌సింగ్ కార్యకలాపాల పై లాలా కూడా విరుచుకుపడ్డారు. 'నన్ను లెనిన్‌లా మార్చడానికి భగత్‌సింగ్ ప్రయత్నిస్తున్నాడని, అతను రష్యన్ ఏజెంట్ అని' నిందించారు. అయినప్పటికీ లాలాను బ్రిటిష్ పోలీసులు తీవ్రంగా కొట్టి ఆయన మృతికి కారకులైనవాడిని భగత్‌సింగ్ సహించలేదు. బ్రిటిష్ పోలీస్ అధికారిని కాల్చిచంపారు. మతతత్వం పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాల పట్ల అసమ్మతి వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలను ఆయన తీవ్రంగా ఖండించారు. మతం దోపిడీ దారుల చేతుల్లోని ఒక సాధనమన్నారు. మతం వల్ల ఆకలిమంట ఆగిపోదు అంటూ హూరెస్ గ్రీలీ చెప్పిన మాటలను భగత్‌సింగ్ తన జైలు నోటుబుక్‌లో రాసుకున్నాడు.

స్వాతంత్ర్య పోరాటం కోసం తన జీవితాన్ని అర్పించిన మరో యోధుడు చంద్రశేఖర్ ఆజాద్. ఆయన 1924లో హిందుస్తాన్ రిపబ్లిక్ అసోషియేషన్‌ను స్థాపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి దేశం కోసం ప్రాణాలివ్వడానికి, తీసుకోవడానికి సిద్ధపడిన యువకులను సమీకరించారు. ఆ రోజుల్లో లాహోర్ కళాశాలలో ఒక అధ్యాపకుడు ఉండేవాడు. ఆయనే భగత్‌సింగ్‌కు మార్క్సిస్టు సాహిత్యాన్ని పరిచయం చేశారు. ఆ తర్వాత భగత్‌సింగ్‌ను ఆజాద్ దగ్గరికి పంపారు. ఆజాద్ ఆదేశాలపై భగత్‌సింగ్ కొన్ని ప్రత్యక్ష చర్యల్లో పాల్గొన్నారు. ఆజాద్‌ను ఇతర కామ్రేడ్స్‌ను ఒప్పించి 1928లో హిందుస్తాన్ రిపబ్లిక్ అసోషియేషన్ పేరును హిందుస్తాన్ సోష లిస్టు రిపబ్లిక్ అసోసియేషన్ (హెచ్ఆర్ఎస్ఏ)గా మార్చారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సోషలిస్టు సమాజ స్థాపన అసోషియేషన్ లక్ష్యంగా ప్రకటించారు.



అంటరానితనంపై కూడా ఘాటైన వ్యాసాలు రాశారు. మదన్ మోహన్ మాలవ్య లాలాలజపతి రాయ్ అలాగే కొందరు నాయకులు మొల్లాలు దళితులతో పూలదండలు వేసుకోవాల్సి వస్తే ఇంటికెళ్లక వేసుకొన్న బట్టలు విప్పకుండానే బిందెలతో నెత్తిమీద నీళ్లు గుమ్మరించుకోకుండా ఇంట్లోకి వెళ్లరని విమర్శించారు. "మన వంటి దేశం మరెక్కడా లేదు. ఇక్కడ ఆరు కోట్ల మంది (ఆనాటి జనాభా లెక్కల ప్రకారం) ప్రజలు అంటరానివారట. వారిని ముట్టుకుంటే చాలు పైకులాలవారు మైలబడి పోతారాట. వారు గుడుల్లోకి వస్తే దేవుళ్లకు కోపం వస్తుందట. మనది ఆధ్యాత్మిక దేశమని గొప్పగా చెప్పుకుంటాం. కాని మనుషులంతా ఒక్కటే అని చెప్పలేం. విదేశాల్లో భారతీయుల పట్ల వివక్ష చూపుతారని బాధపడ్తుంటాం. కాని మన దేశంలో మాత్రం పౌరులందరికీ సమాన హక్కులివ్వం. అలాంటప్పుడు విదేశాల్లో మనల్ని తక్కువ చేసి చూస్తున్నారని ఎలా ఫిర్యాదు చేయగలం? అని ప్రశ్నించారు.

ఆయన నాస్తికుడు కూడా. నాస్తికత్వంపై కూడా వ్యాసాలు రాశారు. విస్తృత అధ్యయనం, పరిశీలన ఆయనను నాస్తికుడిగా, కమ్యూనిస్టుగా భారతీయ సామాజిక వ్యవస్థపై పోరాడే యోధుడిగా మార్చాయి. పది హేడేండ్ల వయస్సు నుండే ఆయన వ్యాసాలు రాయడం మొదలుపెట్టారు. జైల్లో ఉరికంబానికి ఎక్కాల్సిన రోజు చేరువవుతున్నా ఆ విషయం లెక్కచేయకుండా చివరిక్షణం వరకు అధ్యయనం, రచన కొనసాగించారు. ఉరికంబం దగ్గరికి తీసుకెళ్లడానికి పోలీసు వచ్చినప్పుడు ఆయన లెనిన్ రచన స్టేట్ అండ్ రెవల్యూషన్ చదువుతున్నారు.

టెర్రరిజాన్ని ఆయన సమర్థించలేదు. "విప్లవం అంటే బాంబులు, తుపాకుల సంస్కృతి కాదు. విప్లవం అంటే మా అర్థం పరిస్థితుల్లో మార్పు తేవడం. అది ఒక న్యాయమైన ప్రణాళికపై ఆధారపడి జరగాలి" అంటూ భగత్‌సింగ్ వివరించారు. తన ప్రారంభదినాల్లో హింసపట్ల, టెర్రరిజం పట్ల విశ్వాసం ఉన్నా అధ్యయనం పరిశీలనల వల్ల శాస్త్రీయ అలోచన వైపు వచ్చారు. "బహుశా విప్లవకారునిగా జీవితం ప్రారంభించిన తొలిరోజులను మినహాయిస్తే ఎన్నడూ నేను టెర్రరి స్టును కాను. టెర్రరిస్టు చర్యల వల్ల మనం ఏది సాధించలేమని నాకు దృఢమైన నమ్మకం ఏర్పడింది' అని పేర్కొన్నారు. యువతను, కార్మికు లను రైతులను పెద్ద ఎత్తున సమీకరించి పోరాడటం ఎంత ముఖ్యమో అర్థం చేసుకొన్నారు. కార్మికులను స్వాతంత్ర్యోద్యమంలోకి సమీకరిం చరాదన్న గాంధీజీ ఆలోచనను భగత్‌సింగ్ తూర్పార బట్టారు.

విశ్వమానవ సౌభ్రాతృత్వం ఏర్పడాలని కోరుకుంటూ 1924లోనే ఆయన ఒక ప్రామాణిక వ్యాసం ప్రచురించారు. అప్పటికి ఆయన వయస్సు 17ఏళ్లు మాత్రమే. ఆ వ్యాసంలో మానవులందరూ ఒకటే. మనుషుల్లో పరాయివాడు అనే మాట ఉండని సమాజం కావాలన్నాడు. ఆ భావనలోనే భగత్‌సింగ్ గొప్పతనమేమిటో తెలుస్తుంది. ఇరుగు పొరుగును కూడా పరాయివారిగా చూపెట్టే పనిలో నిమగ్నమై ఉన్న నేటి రాజకీయ వాదులు భగత్ ఆశయాలకు పూర్తిగా వ్యతిరేకులు నలుపు - తెలుపు, నాగరికులు - అనాగరికులు, పాలకులు - పాలితులు, ధనిక - పేద, సవర్ణుడు - అంటరాని వాడు వంటి పదాలు ఉనికిలో ఉండరాదన్నారు భగత్‌సింగ్. "సమానత్వం సమానవాటా కోసం మనం ఆందోళన చేయాలి. అలాంటి ప్రపంచ ఏర్పాటును వ్యతిరేకించే వారిని శిక్షించాలి." అని ఘంటాపథంగా చెప్పారు.

లాహోర్‌లో 1926లో నౌజవాన్ భారత సభ స్థాపన ద్వారా భగత్‌సింగ్ తన ఆలోచనలకు నిర్మాణ రూపం ఇచ్చారు. రహస్య విప్లవకారులకు ఆనాడు అదొక బహిరంగ వేదిక. సంకుచిత మతరాజకీయాల ప్రభావం సభ పై పడకుండా ఆయన జాగ్రత్త పడ్డాడు. 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పడింది. ముస్లిం మతతత్వం కూడా ఆ సమయంలో విస్తరిస్తోంది. బ్రిటిష్ ఎత్తుగడల వల్ల ఆనాడు ప్రజల్లో మత ప్రాతిపదికన లోతైన చీలిక ఏర్పడుతోంది. ఆర్ఎస్ఎస్, ముస్లిం సంస్థల ధోరణి ఆ పరిస్థితికి అనుకూలంగా ఉండింది. ఆ నేపథ్యంలో నౌజవాన్ భారత్ సభ ప్రణాళికలో భగత్ సింగ్ 'మతపర మూఢాచారాలు, మతోన్మాదం మనకు అడ్డు గోడలుగా నిరూపణ అయ్యాయి. కనుక మనం ఆ మత భావనలను వదిలిపెట్టాలి. స్వేచ్ఛాయుత ఆలోచనలకు అడ్డుపడేదల్లా నశించాల్సిందే' అని పేర్కొన్నారు. ఆనాటి పత్రికల పాత్రను కూడా భగత్‌సింగ్ దుయ్యబట్టారు. జర్నలిస్టులు ఆ కర్తవ్యాలను ఎలా ఉల్లంఘిస్తున్నారో ఎత్తి చూపారు. "పత్రికల నిజమైన కర్తవ్యం ప్రజలను చైతన్య పరచడం వారి ఆలోచనలను పరిశుభ్రం చేయడం. ప్రజలను, దేశాన్నీ సంకుచిత వాదనల నుండి పత్రికలు కాపాడాలి. ఉమ్మడి జాతీయతను సృష్టించాలి. కాని దానికి బదులు అవి అజ్ఞానంతో ఒంటెత్తువాదాన్ని, దురభిమానాలను బోధించడమే తమ కర్తవ్యం అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రజల మెదళ్లను మతతత్వంతో నింపుతూ అవి మన సమ్మిళిత సంస్కృతిని, ఉమ్మడి వారసత్వాన్ని విధ్వంసం చేస్తున్నాయి" అని మండిపడ్డారు.

> టెర్రరిజాన్ని ఆయన సమర్థించలేదు. "విప్లవం అంటే బాంబులు, తుపాకుల సంస్కృతి కాదు. విప్లవం అంటే మా అర్థం పరిస్థితుల్లో మార్పు తేవడం. అది ఒక న్యాయమైన ప్రణాళికపై ఆధారపడి జరగాలి" అంటూ భగత్‌సింగ్ వివరించారు. తన ప్రారంభదినాల్లో హింసపట్ల, టెర్రరిజం పట్ల విశ్వాసం ఉన్నా అధ్యయనం పరిశీలనల వల్ల శాస్త్రీయ అలోచన వైపు వచ్చారు. "బహుశా విప్లవకారునిగా జీవితం ప్రారంభించిన తొలిరోజులను మినహాయిస్తే ఎన్నడూ నేను టెర్రరిస్టును కాను. టెర్రరిస్టు చర్యల వల్ల మనం ఏది సాధించలేమని నాకు దృఢమైన నమ్మకం ఏర్పడింది' అని పేర్కొన్నారు. యువతను, కార్మికులను రైతులను పెద్ద ఎత్తున సమీకరించి పోరాడటం ఎంత ముఖ్యమో అర్థం చేసుకొన్నారు. కార్మికులను స్వాతంత్ర్యోద్యమంలోకి సమీకరించరాదన్న గాంధీజీ ఆలోచనను భగత్‌సింగ్ తూర్పార బట్టారు.

బ్రిటిష్ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రజావ్యతిరేక బిల్లులను ప్రవేశపెట్టే రోజును ఎంచుకొని 1929 ఏప్రిల్ 8న పార్లమెంట్లోకి భగత్‌సింగ్ పొగ బాంబులు విసిరారు. ఆ రోజును ఎంచుకోవడంలోనూ హెచ్ఆర్ఎస్ఏ సైద్ధాంతిక నిబద్ధత మనకు కనిపిస్తుంది. వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలను అణచడానికే బ్రిటిష్ ప్రభుత్వం వాణిజ్య వివాదాల బిల్లును, ప్రజా భద్రత పేర మరి కొన్ని బిల్లులను తీసుకొచ్చింది. వాటిని ప్రవేశ పెడుతుండగా భటుకేశ్వర్ దత్‌తో కలిసి భగత్‌సింగ్ పార్లమెంట్‌లోకి పొగబాంబులు విసిరారు.ఆ చర్య పై భగత్ సింగ్ ఇలా చెప్పారు. "బ్రిటిష్ సామ్రాజ్యవాదంలో న్యాయానికి చోటు లేదు. బానిసలకు ఊపిరి తీసు కొనే స్వేచ్ఛను కూడా వారివ్వరు. ప్రజలను అణిచేయాలని, దోచుకోవాలని, హతమార్చాలని చూస్తుంటారు. అంతకంతకు అణిచివేత చట్టాలను తెస్తారు. ప్రజల అసమ్మతి గళాలను విన్పించనివ్వరు. ఈ స్థితిలో త్యాగం మాత్రమే మనల్ని ఈ అణచివేత నుండి రక్షించగలదు. మనం మన అసెంబ్లీలోని భారతీయ, విదేశీ సభ్యుల కళ్ల తెరిపిద్దాం." అని అన్నారు.

"వేళ్లమీద లెక్కబెట్టగల కొందరు దోపిడీదార్లు తమ స్వార్థం కోసం ఇక్కడి ప్రజలను దోచుకుంటున్నారు. ఆ దోపిడీ ముగిసే దాకా భారత దేశంలో పోరాటం దీర్ఘకాలం సాగాలి. వారు బ్రిటిష్ పెట్టుబడిదారులా? లేక భారతీయులు కూడా వారితో షరీకై ఉన్నారా? లేక దోపిడీ దార్లంతా భారతీయులేనా? అన్న ప్రశ్నలతో మనకు సంబంధం లేదు. దోపిడీ ఎక్కువున్నా పోరాడాల్సిందే అంటూ ఆనాటి భారతీయ పెట్టుబడిదార్ల దోపిడీకి వ్యతిరేకంగా కూడా పోరాడాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.

భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న నేడు పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్ సమీపంలోని ఒక గ్రామంలో జన్మించారు. 1930 మార్చి 23న భగత్‌సింగ్‌ను ఆయన సహచరులు సుఖదేవ్, రాజ్‌గురులతో పాటు బ్రిటిష్ వలస ప్రభుత్వం ఉరితీసి హత్య చేసింది. ఆయనను ఉరితీశారని తెలిసిన వెంటనే ఆ సేతు హిమాచలం అట్టుడికి పోయింది, ఎర్రబడింది. లాహోర్‌కు ఎంతో దూరంలో ఉన్న మద్రాసులోనూ ప్రజలు కోపావేశాలతో తమంతట తాముగా ఇళ్ల నుండి బయటకు వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. ఆ విప్లవకారుడు ఇరవైయేండ్లే బతికినా తన రచనలతో, తన ఆచరణతో త్యాగంతో ఎంతో వారసత్వ సంపదను భావితరాలకు వదలి వెళ్లారు.

(నేడు భగత్‌సింగ్ 117వ జయంతి)

అందరూ మెచ్చిన ఏచూరి



టి.కె.రాజ్యలక్ష్మి


భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యులు 72 ఏండ్ల సీతారాం ఏచూరి తీవ్ర శ్వాస సంబంధ వ్యాధితో పోరాడి, సెప్టెంబర్ 12న తుదిశ్వాస విడిచాడు. రాజకీయ రంగ ప్రముఖులు, ఆయన కార్మిక వర్గానికి, రాజ్యాంగానికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి కట్టుబడి ఉన్న తీరును గుర్తుచేసుకుంటూ తమ విచారాన్ని వ్యక్తం చేస్తూ, సంతాపాన్ని ప్రకటించారు. తన స్నేహితులచేత 'సీత' అని పిలవబడే సీతారామ్ 1970వ దశకంలో వామపక్ష కోట బురుజు లాంటి జవహర్ లాల్ నెహ్రూ యూని వర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థిగా రాజకీయాల్లో తనదైన ముద్రవేశాడు. 1977-1978 మధ్య కాలంలో ఆయన మూడు పర్యాయాలు జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఎమర్జెన్సీ అనంతర పోరాటాలు, ఆటంకాల వల్ల తన పదవీ కాలంలో విరామం ఏర్పడింది కాబట్టి ఆయన, తరువాత ఆ కాలాన్ని తన సహజమైన రీతిలో హాస్యంతో చమత్కారాన్ని జోడించి వర్ణించేవాడు. ఆ కాలంలో ఆయన కూడా కొద్ది కాలంపాటు నిర్బంధంలో ఉన్నాడు. తరువాత 1980 వ దశకంలో ఆయన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)కి అఖిల భారత అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు.

ఒక పార్లమెంట్ సభ్యునిగా తన పాత్రను పోషించినందుకు, మతతత్వానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భిన్న రాజకీయ శక్తుల్ని ఒకే తాటిపై తెచ్చినందుకు అందరూ ఏచూరిని గుర్తుంచుకొని, స్తుతిస్తారు. ఆచరణాత్మక కమ్యూనిస్టుగా బహుముఖాలు గల తన ప్రయాణంలో ఇవి కొన్ని మాత్రమే.ఆయన జేఎన్‌యూలో ఉన్న సంవత్సరాలలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటాన్ని రూపొందించిన రాజకీయ వెల్లువ, సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్‌లో కృష్ణా భరద్వాజ్, ఇతరులతో కలిసి ఆయన అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి తోడ్పడింది. అది ఆయన రాజకీయ దృష్టికోణం అభివృద్ధికి అవసరమైన నేపథ్యాన్ని ఏర్పరిచింది. ఆయన భారతీయ వ్యవసా యంపై పరి శోధన ప్రారంభించాడు, కానీ పూర్తి చేయలేదు. అయితే ఆయన పరిశోధన తొలి దశల ప్రాతి పదికపై రాసిన పత్రం 1976లో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ పత్రికలో ప్రచురితమైంది.

ప్రజ్ఞా పాటవాల సీతారాం

ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుండి చెన్నయ్ (అప్పుడు మద్రాస్) వచ్చిన కుటుంబంలో పుట్టాడు. ఆయన పెరిగింది, పాఠశాల విద్యనభ్యసించింది హైదరాబాద్‌లో. ఫలితంగా ఆయనకు హిందీ, ఇంగ్లీష్ రెండు భాషలు బాగా తెలుసు. ఆయన ఉన్నత విద్య కోసం ఢిల్లీ చేరి, సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో పట్టభద్రుడయ్యాడు. ఏచూరి సీబీఎస్ఈ పరీక్షల్లో భారతదేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంతో విశిష్టమైన అకడమిక్ రికార్డు దక్కింది. టెన్నిస్ కూడా ఆడే సీతారాం పాత హిందీ సినిమా పాటల్ని ఎక్కువగా ఇష్టపడేవాడు. వాటితో అప్పుడప్పుడు కూని రాగాలు తీసేవాడు. ఆయన అందర్నీ సమానంగా చూసేవాడు.

మరో సిద్ధాంత ఆచరణవాది, పార్టీ నాయకుడు ప్రకాష్ కారత్‌కు సీతారాం జూనియర్. ఎస్ఎఫ్ఐ నినాదమైన 'చదువు-పోరాడు','అందరికీ విద్య' అనే లక్ష్యం కోసం జీవించిన తరువాత తరాల వారికి వీరిరువురు తొలితరం మార్గదర్శకులు. దాని గురించి ఏచూరి చాలా ముందుగానే బాగా ఆలోచించాడు. చాలా సంక్లిష్ట భావాలు ప్రజల భాషలో అందించగలిగేవాడు. ఆయన సంక్లిష్టమైన సిద్ధాంతాల్ని ప్రజాక్షేత్రంలో ఉపయోగించేవాడు కాదు. అపరిచిత పదజాలంతో నిండిన భాషను సరళం చేయడం ద్వారా, వర్గ పోరాటాలతో ప్రజాసమస్యల్ని లేవనెత్తడం ద్వారా మాత్రమే వామపక్ష ఉద్యమం, వామపక్ష రాజకీయాలు ప్రజలకు చేరువ అవుతాయని ఆయనకు తెలిసింది. జగద్విదితమైన ఆయన మంచి, స్నేహ స్వభావాన్ని స్నేహితులు, ఆయనతో బాగా అనుబంధం ఉన్నవారు నెమరేసుకున్నారు. ఏచూరి అందరికీ తెలుసిన నాయకుడు, కానీ ప్రజల్ని రెచ్చగొట్టే ప్రజా నాయకుడు కాదు. ఆయన అర్థరహిత వాగాడంబర భాషను ఉపయోగించే వాడుకాదు. ఆయన ప్రసంగాలు సంభాషణా శైలిలో ఉండేవి.



> భిన్న ధ్రువాలుగా ఉండే రాజకీయ పార్టీల్ని పరస్పరం సంభాషించేట్లు చేసి, బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటులో అందర్నీ ఒకేతాటిపైకి తెచ్చిన ఏచూరి సామర్థ్యాన్ని అనేక మంది నివాళులు అర్పించే సందర్భంలో కొనియాడారు. ఆయన వ్యక్తిత్వం, ఆయన రాజకీయాలు వేరువేరు కాదు. ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన రాజకీయాలే అపరిమితంగా రూపుదిద్దాయి. సోషలిజం పట్ల, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ఎలాంటి పరిస్థితుల్లోనూ మారకుండా అలాగే ఉండిపోయింది. అందుకే ఆయన అందరికీ ఆదర్శంగా గుర్తుండి పోతాడు.

ఆయన వాదనల్లో ఉపయోగించే భాష అందరికీ అర్థం అయ్యే విధంగా ఉండేది.

సీతారాం రాజకీయ ప్రయాణం

విద్యార్థి నాయకుడిగా మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం, 1970 దశకం మధ్యలో సీపీఐ(ఎం)లో చేరి, పార్టీలో ఒక 'రెయిజింగ్ స్టార్' గా ఎదగడానికి దారితీసింది. 1980లలో ఎస్ఎఫ్ఐ పత్రిక 'స్టూడెంట్స్ స్ట్రగుల్' కు సంపాదకునిగా పనిచేశాడు. ఆయన పదవీ కాలంలో ఆ పత్రిక ఒక నూతన స్థాయికి చేరింది. తన సాహసకార్యంలో ఏచూరి ప్రముఖ నాటక కర్త, దర్శకుడు అయిన సఫ్దర్ హష్మి మద్దతును కూడా కూడగట్టాడు.

ఈ సమయంలోనే నాటి ప్రభుత్వ 'ఛాలెంజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ' డాక్యుమెంట్ బయటపడింది. నాడు 'నూతన విద్యా విధానం' పేరుతో దేశంలో విద్యా విధానం మార్పుకు అది నాందీ పలికింది. అదే చివరికి '1986 విద్యపై జాతీయ విధానం' గా మారింది. ఈ విధానం పై తీవ్ర విమర్శలు చేయడంలో,దానిని ప్రతిఘటిం చడంలో ఏచూరి ముందున్నాడు.

సీపీఐ(ఎం)లో చేరిన పది సంవత్సరాల తరువాత ఏచూరి, 1985లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యాడు. ఆ తర్వాత సంవత్సరాలు కమ్యూనిస్టులకంతా సంక్షోభం కాలం : మిఖాయిల్ గోర్బచెవ్ పురోగ మనం, సోవియట్‌లో ప్రవేశపెట్టబడిన గ్లాస్ నాస్త్, పెరిస్ట్రోయికా సంస్కరణలు, తియాన్మేన్ స్క్వేర్ సంఘటన, బెర్లిన్‌గోడ కూల్చివేత, చివరికి సోవియట్ యూనియన్‌లో, తూర్పు యూరప్‌లో సోషలిస్ట్ వ్యవస్థ పతనం లాంటి సంక్షోభాలు. వామపక్షాలు ప్రపంచ వ్యాప్తంగా, ఆంతరం గికంగా తీవ్రదాడికి గురయ్యాయి. ఈ సంఘటనల నుండి ఒక్క సారిగా ఉత్పన్నమైన భావజాల పరమైన సవాళ్లు, చర్చల్లో ఏచూరి దృఢంగా నిలబడ్డాడు.

తప్పిదాలు జరిగి ఉండవచ్చు కానీ సోషలిజానికే భవిష్యత్తు ఉంది. ఆయన ఎప్పుడూ ఈ పరిణామాలను మార్క్సిస్ట్ చట్రంలోనే విశ్లేషించి, ఈ ప్రశ్నలపై సీపీఐ(ఎం) దృక్పథాన్ని రూపొందించడంలో భాగస్వామి అయ్యాడు. దేశంలో భిన్న మతాల, భిన్న భావాల మిశ్రమాన్ని సోదాహరణంగా నిరూపించేందుకు, ఏచూరి పార్లమెంట్ ప్రసంగాల్లో తరచుగా 'ఇండియా' అనే 'భారత్' లాంటి ప్రస్తావనలు ఉండేవి. ఈ వక్కాణింపు బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి 2014లో అధికారం చేపట్టిన తరువాత మాత్రమే బాగా పెరిగింది. మైనార్టీలపై దాడులు సాధారణమయ్యాయి. ఆయన చదువుకున్న జేఎన్‌యూని ప్రస్తుత పాలకవర్గం అన్యాయంగా లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు పార్లమెంటులో దానిని రక్షించే ప్రయత్నం చేశాడు. విద్యాసంస్థలపై దాడి జరిగినప్పుడు, రాజ్యాంగాన్ని బలహీనపర్చినపుడు, దళితులు, మైనారిటీల హక్కుల రక్షణ కోసం, ఉన్నత విద్యాసంస్థల స్వతంత్రతను రక్షించే సందర్భంలో కూడా ఆయన అదే రీతిలో స్పందించి నొక్కి చెప్పేవాడు. అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలు రెండూ బూర్జువా పార్టీలైనప్పటికీ, బీజేపీ నుండే ప్రమాదం ఎక్కువగా ఉంటుందనే వాస్తవాన్ని కూడా ఆయన గ్రహించాడు. మారిన పరిస్థితులు, ప్రాథమిక భావజాలం విషయంలో రాజీపడకుండా వ్యూహాత్మక కూటములను నిర్మించే అవసరాన్ని వేగిరపరిచాయనే భావన పెరిగింది.

2014 తరువాత పార్లమెంట్‌లో తమ ప్రభావం తగ్గినప్పటికీ, సీపీఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష పార్టీలు ఇప్పటికీ అదుపు చేయగలిగే నైతిక బలాన్ని కలిగి ఉన్నాయి. ఒక లౌకిక మూడో ఫ్రంట్‌ను నిర్మిస్తేనే సరిపోలేదు. నయా ఉదారవాద సంస్కరణల ప్రారంభం నుండి అసమానతల్ని పెంచిన ఆర్థిక విధానాలకొక ప్రత్యామ్నాయం కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. రాజకీయ పార్టీల మధ్య వర్గ వైరుధ్యాలు న్నప్పటికీ ఇదెలా సాధ్యమైందంటే, ఏచూరి బిగుతైన తాడు (టైట్‌రోప్)పై అవలీలగా నడవడం నేర్చుకున్నాడు కాబట్టే సాధ్యమైంది. మొదటి యూపీఏ ప్రభుత్వం చేపట్టిన కొన్ని విధానాలు, చర్యల్లో, కనీస ఉమ్మడి కార్య క్రమం ఏర్పాటులో వామపక్షాల ముద్ర ఉన్న విషయం రహస్యమేమీ కాదు. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పడిన 'ఇండియా' బ్లాక్‌లో, దాని సంబంధిత పార్టీల పెరుగుదలలో కూడా ఈ ముద్ర కొనసాగింది.

భిన్న ధ్రువాలుగా ఉండే రాజకీయ పార్టీల్ని పరస్పరం సంభాషించేట్లు చేసి, బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటులో అందర్నీ ఒకేతాటిపైకి తెచ్చిన ఏచూరి సామర్థ్యాన్ని అనేక మంది నివాళులు అర్పించే సందర్భంలో కొనియాడారు. ఆయన వ్యక్తిత్వం, ఆయన రాజకీయాలు వేరువేరు కాదు. ఆయన వ్యక్తిత్వాన్ని ఆయన రాజకీ యాలే అపరిమితంగా రూపుదిద్దాయి. సోషలిజం పట్ల, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ఎలాంటి పరిస్థితు ల్లోనూ మారకుండా అలాగే ఉండిపో యింది. అందుకే ఆయన అందరికీ ఆదర్శంగా గుర్తుండి పోతాడు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

తప్పెవరిది...శిక్షెవరికి?

వాతావరణ మార్పుల కారణంగా సంభవించే 'మేఘ విస్ఫోటనం' (క్లౌడ్ బరస్ట్) వలన తక్కువ సమయంలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు ధాటికి కాలనీలను వరదలు ముంచెత్తుతున్నాయి.ఇది విపత్తులకు దారితీస్తున్నది. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి, వరదలకు కారణమవుతున్న నిర్మాణాల తొలగింపు, కనుమరుగవుతున్న చెరువుల పరిరక్షణ చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'హైడ్రా' ఆలోచన సరైనదే. కానీ దాన్ని అమలు చేస్తున్న తీరు అసమంజసంగా ఉంది. ఎందుకంటే హైడ్రా చర్యలు సామాన్య ప్రజలపై పడుతున్నది. ఎందుకంటే ఇండ్లు, స్థలాలు కొనే సామాన్య ప్రజలకు ఎన్కంబరెన్స్ సర్టిఫికేట్(ఈసీ), డబుల్ రిజిస్ట్రేషన్, లింక్ డాక్యుమెంట్స్ మాత్రమే తెలుసు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ వంటి అంశాల గురించి తెలియవు. చెరువులను ఇండ్ల స్థలాలుగా మార్చిన వ్యాపారులకు, వీటిని ఆమోదించిన అధికారులకు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల గురించి అవగాహన ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ సమయంలో సామాన్య ప్రజలకు ఈ విషయాలను తెలియజేయరు. ప్రభుత్వం తమ ఇంటిని లేదా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన తరువాత ప్రజలు తమ ఇంటికి ఇక ఎటువంటి ధోకా లేదని భావిస్తారు.ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చిన నిర్మాణాలను సైతం ఇప్పుడు ప్రభుత్వమే అక్రమ కట్టడాలని కూల్చి వేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.చెరువులను ఆక్రమించి, అధికారుల సహకారంతో ఇండ్ల స్థలాలుగా మార్చి తప్పొకరు చేస్తే, ఆ ఫలితం మాత్రం అనుభవిస్తున్నది సామాన్యులు. ఎన్నో కష్టనష్టాలకోర్చి, కుటుంబాన్ని పోషించుకుంటూ, పిల్లల భవిష్యత్తు కోసం కష్టార్జితంతో సొంతింటి కలను నెరవేర్చుకున్నవారి జీవితాలను హైడ్రా ఛిదిమేస్తున్నది. అక్రమ నిర్మాణాలంటూ పేదల ఇండ్లను కూల్చేస్తున్నది. దీంతో నిరాశ్రయులు అయిన కుటుంబాల్లో నైరాశ్యం అలుముకుంటోంది. ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమవడంతో విద్యార్థుల చదువు, భవిష్యత్తు ఇంటి శిథిలాల కింద నలిగిపోతోంది. హైదరాబాద్‌కు 'లేక్ సిటీ' అని పేరు. నగరంలో చాలా వరకు చెరువులు కనుమరుగైపోయి, కాలనీలుగా ఏర్పడ్డాయి. ఉపాధి నిమిత్తం జిల్లాల నుండి హైదరాబాద్‌కు వచ్చి ఇండ్లు కొనుక్కున్న వారికి, వారి ఇంటి కింద ఒకప్పుడు ఏ చెరువు ఉన్నదో తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఇండ్లను ఏక్షణాన శిథిలావస్థలో చూడాల్సి వస్తుందో అనే భయం సామాన్యుల్లో నేడు ఏర్పడింది. ఇప్పుడు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పేరుతో ఇండ్లను కూల్చుతూ పోతే ప్రజలు కలలుకంటున్న 'బంగారు తెలంగాణ' కాస్త 'శిథిల తెలంగాణ'గా మిగిలిపోతుంది. ఇండ్లను కూల్చటము కన్నా ఇండ్ల నిర్మాణము వలన కలిగే వరదలు వంటి విపత్తులను నివారించటానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. వాటి ఖర్చును ఇంటి యజమానులు లేదా కాలనీ వాసుల నుండి వసూలు చేసినట్లయితే కొంత ప్రయోజన కరంగా ఉంటుంది.చెరువుల దురాక్రమణ ఎంత ప్రమాద కరమో, మంచినీటి చెరువులలో వ్యర్థాలను వదిలి కలుషితమైన దుర్గంధ చెరువులుగా మార్చడం కూడా అంతటి వినాశనం. హైదరాబాద్‌లో ఒక్కప్పటి మంచినీటి చెరువులు ప్రస్తుతము దుర్గంధ స్థావ రాలుగా మారిపోయాయి. వీటి వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. 'చెరువుల పరిరక్షణ' పేరిట ఇండ్లను కూల్చడం మాత్రమే పరిష్కారం మార్గం కాదు, వాటిని కాలుష్య రహిత మంచినీటి చెరువులుగా కొనసాగించడానికి ఒక నిర్దిష్టమయిన కార్యక్రమాన్ని రూపొందించడం మంచిది. చెరువుల పరిరక్షణ కార్యక్రమము విజయవంతమ వుతంది గనుక ఈ సమస్య ను బహుముఖ కోణంలో ఆలోచించి సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా, సామాజిక సమస్యలు తలెత్తకుండా ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తే ప్రకృతి విపత్తుల నుండి నగరాన్ని కాపాడిన వారవుతారు, అలాగే ప్రజలూ బాగుపడ తారు. ఇండ్లు కోల్పోయి రోడ్లపై పడ్డ బాధితుల పట్ల సర్కార్ చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. వారికి ప్రత్యామ్నా యంగా ఇండ్లు నిర్మించివ్వాలి. ఎందుకంటే, ఆక్రమణ అని తెలియక ఇండ్లు నిర్మించుకున్న సామాన్యులే ఎక్కువ నష్టపోతున్న విషయం గ్రహించాలి.

- శ్రీదరాల రాము,
9441184667

కృష్ణ, గోదావరి ప్రాంతాల్లో

టూరిస్ట్ స్పాట్ల అభివృద్ధి

- ఇందుకు ప్రత్యేక ప్రణాళిక చారిత్రక, ఆధ్యాత్మిక, పురావస్తు ప్రాంతాల గుర్తింపు పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు
- నిథమ్‌లో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణ, గోదావరి ప్రాంతాల్లో టూరిస్టు స్పాట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో నిర్వహించిన వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో సుందరమైన ప్రదేశాలు, పుష్కలమైన సహజ వనరులున్నాయని పేర్కొన్నారు. టూరిజానికి అనువుగా ఉండే సాగర్, సోమశీల తదితర ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రోప్‌వేలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మెడికల్ టూరిజం, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం సహా వివిధ టూరిజం రంగాలపై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యాల ద్వారా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పర్యాటకాభివృద్ధితో ఆదాయం పెరగడంతోపాటు యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, విద్యార్థులు, యువత తెలంగాణ పర్యాటక ప్రదేశాలను సందర్శించి, టూరిజం ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

పలువురికి అవార్డుల ప్రదానం

పర్యాటక రంగంలో విశేష కృషి చేసిన పలువురికి మంత్రి జూపల్లి అవార్డులను ప్రదానం చేశారు. తెలంగాణ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందున్న మహబూబ్‌నగర్, వరంగల్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లు, అతిథ్య రంగంలో నాణ్యమైన సేవలందిస్తున్న హెటల్ నిర్వాహకులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన శివప్రియం, కాకతీయం, కూచిపూడి, పేరిణి నృత్య రూపాలు ,ఆకట్టుకున్నాయి. దేశభక్తి, తెలంగాణ ప్రగతి, పర్యాటక ప్రదేశాలను తెలియజేస్తూ ఆలపించిన ప్రత్యేక గీతాలు, నాటికలు, పాటలకు అనుగుణంగా కళాకారులు చేసిన నృత్యాలు చూపరులను ఆనందడోలికల్లో ముంచాయి.


ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎమ్‌డీ. ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

తెలంగాణ దర్శిని ప్రారంభం

టూరిజం ప్రమోషన్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దర్శినిని విడుదల చేసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థులకు కేటగిరీలుగా ఉచిత టూర్ ప్రోగ్రాంను ప్రకటించారు.

క్యాటగిరీలు

7-8 సంవత్సరాల వయస్సు	2-4 తరగతుల విద్యార్థులు (డే ట్రిప్)
9-12 సంవత్సరాల వయస్సు	5-8 తరగతుల విద్యార్థులు
13-17 సంవత్సరాల వయస్సు	9 నుంచి ఇంటర్ విద్యార్థులు



పెరుగుతున్న క్యాన్సర్ రోగులు

ప్రతి రోజు 150 నుంచి 160 కొత్త కేసులు

- పరిమితంగా ప్రభుత్వ సేవలు
- జిల్లాలకు విస్తరించాలని సర్కారు నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్యకు అనుగుణంగా చికిత్స సౌకర్యాలను జిల్లాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో క్యాన్సర్ రీజనల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఇందులో భాగంగా తొలి దశలో కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కరీంనగర్‌లో సెంటర్లను నెలకొల్పాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో సెంటర్‌ను సుమారు రూ.50 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించనున్నారు. ఆ తర్వాత రెండో దశలో మిగిలిన జిల్లా కేంద్రాల్లో సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, స్క్రీనింగ్ చేయడం, ఆయా జిల్లాల్లో ఉన్న క్యాన్సర్ పేషెంట్లకు ఎంఎన్‌జే హాస్పిటల్ డాక్టర్లు సూచించిన ట్రీట్‌మెంట్‌ను అందించడం వంటివి ఈ సెంటర్ల ప్రథమ లక్ష్యం. ఇందుకోసం ఆయా సెంటర్లలో ఆంకాలజిస్టులను, రేడియాలజిస్టులను నియమించడంతో పాటు, జిల్లా హాస్పిటళ్లలో పని చేసే డాక్టర్లు, సిబ్బందికి శిక్షణనిస్తారు. అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తారు. అలాగే, వరంగల్‌లో ఇప్పటికే ఉన్న రీజనల్ క్యాన్సర్ సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే తరహాలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్‌సీఆర్పీ) అంచనా ప్రకారం మన రాష్ట్రంలో ప్రతిరోజు సగటున 150 నుంచి 160 మంది కేన్సర్ బారినపడుతున్నారు. ఈ సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నది. రాష్ట్రంలో 2016 సంవత్స రంలో కొత్తగా 43,129 కేసులు నమోదు కాగా, ఆ సంఖ్య 2018 నాటికి 52,000లకు పెరిగింది. రాష్ట్రంలో 2030 నాటికి ప్రతి సంవత్సరం 65,000 మందికి క్యాన్సర్ డయాగ్నసిస్ అయ్యే అవకాశం ఉందని ఐసీఎంఆర్ అంచనా వేసింది. మన రాష్ట్రంలో దాదాపు 60 శాతం క్యాన్సర్లకు జీవనశైలిలో వచ్చిన మార్పులు, కాలుష్యమే కారణమని డాక్టర్లు చెబుతున్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల మందికి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రే దిక్కు. ప్రస్తుతం ఎంఎన్‌జేలో 750 బెడ్లు ఉన్నా, పేషెంట్ల రద్దీకి అవి సరిపోవడం లేదు. దీంతో డే కేర్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. కీమోథెరపీ చేసిన పేషెంట్లను ఒకట్రెండు గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచి, అదే రోజు సాయంత్రాని కల్లా డిశ్చార్జ్ చేస్తున్నారు. తెలంగాణతోపాటు సరిహద్దు రాష్ట్రాలైన ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి కూడా ఇక్కడికి పేషెంట్లు వస్తున్నారు. రోజూ 650 నుంచి 700 వరకూ ఓపీ కేసులు నమోదవుతున్నాయి. వరంగల్‌లో రీజనల్ కేన్సర్ హాస్పిటల్ ఉన్నప్పటికీ, అక్కడ పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. క్యాన్సర్ పేషెంట్లలో 70 శాతం మందికి కీమోథెరపీ అవసరమవు తుంది. పేషెంట్ పరిస్థితిని బట్టి మూడు వారాలకు ఒకసారి కీమోథెరపీ చేయాల్సి ఉంటుందని ఆంకాల జిస్టులు చెబుతున్నారు. దీంతో కనీసం నెలకు ఒక్కసారైనా పేషెంట్లు హాస్పిటల్‌కు రావాల్సి ఉంటుంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ఇటీవలే ఈ అంశంపై అధికారు లతో సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయా లని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో 5 రీజనల్ సెంటర్లకు అధికారులు ప్రతిపాదనలు పంపించినట్టు సమాచారం.

తెలంగాణ భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అందరూ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో, ముల్కీ ఉద్యమంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో, తెలంగాణ 1969 నాటి తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. తాను నమ్మిన విశ్వాసంతో తెలంగాణ సాధన కోసం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ బడుగు, బలహీన వర్గాల చైతన్యానికి, ఆత్మగౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై

లోకాయుక్త కేసు నమోదు

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర అవినీతి నిరోధక సంఘం లోకాయుక్త కేసు నమోదు చేసింది. ముడా భూకేటాయింపుల కుంభకోణంలో సిద్ధరామయ్యను ఏ1 నిందితుడిగా, ఆయన భార్య పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున్ స్వామిని ఏ3గా, భూమి అమ్మిన దేవరాజ్‌ను ఏ4గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కోట్ల విలువైన భూమిని దేవరాజ్ నుంచి మల్లికార్జున్ స్వామి కొనుగోలు చేశాడు. ఆ భూమిని అక్క పార్వతికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కాగా, మైసూరు అభివద్ధి సంస్థ పార్వతి నుంచి 3.16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నది. ఎక్కువ విలువైన ప్లాట్లను పరిహారంగా ఆమెకు ఇచ్చింది. అయితే చట్టవిరుద్ధమైన భూ పరిహార ఒప్పందం వల్ల సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య సుమారు రూ.4,000 కోట్ల మేర లబ్ది పొందినట్టు ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది.

ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేసేందుకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆగస్టులో అనుమతిచ్చారు. సెప్టెంబర్ ప్రారంభంలో గవర్నర్ అనుమతిని కర్ణాటక హైకోర్టు సమర్థించింది. మరోవైపు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కష్ణ దాఖలు చేసిన ఫిర్యాదుపై మైసూరులోని లోకాయుక్త స్పందించింది. ఈ భూ స్కామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య బావమరిదితో పాటు మరో వ్యక్తిపై లోకాయుక్త పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

రాజకీయంగా నాపై తొలి కేసు నమోదు అయినా రాజీనామా చేయను: సిద్ధరామయ్య

ముడా భూ కేటాయింపుల కుంభకోణంలో లోకాయుక్త కేసు నమోదుపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. తనపై మొదటిసారి రాజకీయ కేసు నమోదైనట్టు తెలిపారు. అయినా తాను సీఎం పదవికి రాజీనామా చేయనని స్పష్టం చేశారు. ' నేనే తప్పు చేయలేదు. నాపై రాజకీయ కేసు నమోదు ఇదే తొలిసారి. ఇది రాజకీయ కేసు, దయచేసి అండర్‌లైన్ చేయండి' అని ఆయన మీడియాతో అన్నారు. అయితే తాను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేస్తున్న నిరసనలపై మీడియా అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానమిచ్చారు. 'నేనెందుకు రాజీనామా చేయాలి? ఎవరైనా తప్పు చేస్తే రాజీనామా చేయాలి, తప్పు చేయలేదని చెబుతున్నప్పుడు, రాజీనామా చేసే ప్రశ్న ఎక్కడ ఉంది?' అని అన్నారు. ప్రతిపక్షాలు తనను చూసి భయపడుతున్నాయని, అందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని సిద్ధరామయ్య విమర్శించారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయాన్ని కూడా కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కాగా, సీబీఐ పక్షపాతంగా వ్యవహరిస్తోందని కర్ణాటక ప్రభుత్వం మండిపడింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని కేసుల దర్యాప్తు కోసం సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని గురువారం ఉపసంహరించింది.

లెబనాన్‌పై దాడులు ఉధృతం

హిజ్బుల్లా డ్రోన్ యూనిట్ చీఫ్ మృతి • గత 24గంటల్లో 92మంది మరణం

30వేల మందికి పైగా వలసలు



బీరుట్ : హిజ్బుల్లా లక్ష్యాలే ప్రధానంగా ఇజ్రాయిల్ ఆర్మీ విరుచుకు పడు తోంది. గత24 గంటల్లో లెబనాన్ వ్యాప్తంగా ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 92మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో పలు పట్టణాలపై జరిగిన దాడుల్లో 40మంది మరణించగా, తూర్పు ప్రాంతంలో రెండు చోట్ల కొనసాగిన దాడుల్లో 48మంది మరణించారు. మొత్తంగా 153మంది గాయపడ్డారు. కాగా, ఈ దాడుల్లో హిజ్బుల్లా డ్రోన్ యూనిట్ చీఫ్ చనిపోయాడని ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. బీరుట్‌లోని దక్షిణ శివార్లలో జరిపిన దాడుల్లో తాము పెట్టుకున్న లక్ష్యం నెరవేరిందని తెలిపింది. హిజ్బుల్లా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. జన సాంద్రత అధికంగా కలిగిన ప్రాంతాల్లో హిజ్బుల్లా కమాండర్లను లక్ష్యంగా చేసుకుని ఇలా దాడి చేయడం ఈ వారంలో ఇది నాల్గవసారి. 10 అంతస్తుల నివాస భవంతిపై మూడు క్షిపణులతో ఆర్మీ దాడి చేసిందని లెబనాన్ అధికార వార్తా సంస్థ తెలిపింది. హిజ్బుల్లా లాంచర్లను కూడా ధ్వంసం చేశామని పేర్కొంది.

హిజ్బుల్లాతో కాల్పుల విరమణ కుదుర్చుకోవాలని వస్తున్న విజ్ఞప్తులను ఇజ్రాయిల్ తోసిపుచ్చింది. వరుసగా బాంబు దాడులతో బీభత్సాన్ని సృష్టిస్తోంది. గత సోమవారం నుండి ఇప్పటివరకు లెబనాన్‌లో 700మందికి పైగా ఈ దాడుల్లో మరణించారు. దశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని రీతిలో లెబనాన్ రక్తపాతాన్ని చవిచూస్తోందని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వ యకర్త ఇమ్రాన్ రిజా వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులు ఇంకా క్షీణించే ప్రమాద ముందని హెచ్చరించారు.

ఇదొక ఉపద్ర వంలా లెబనాన్ ప్రజల మీద పడిందని పేర్కొన్నారు. రోజు రోజుకు పరిస్థితులు అదుపు తప్పుతుండడంతో సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ లెబనాన్‌ను వీడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గత 72గంటల్లో సిరియాకు 30వేల మందికి పైగా వలస వెళ్లారని ఐక్యరాజ్య సమితి వర్గాలు తెలిపాయి. 446 స్కూళ్ళు, యూని వర్శిటీలు, ఇతర సంస్థలు నిరాశ్రయులకు ఆశ్రయాలిచ్చే కేంద్రాలుగా మారాయన్నారు. లెబనాన్‌లో భూతల దాడులకు సిద్ధమ య్యేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. లెబనాన్ సరిహద్దు పొడవునా ఇజ్రాయిల్ బలగాలు మోహరించబడ్డాయి.

విద్యార్థులకు 'విదేశీ' కష్టాలు

తగిన ఆర్థిక సాయం చేయని నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ తక్కువ స్టైఫండ్‌తో స్టూడెంట్స్‌కు ఇక్కట్లు

కనీసం కూడుకు, గుడ్డకూ సరిపోని వైనం

- విద్యపై శ్రద్ధ పెట్టలేకపోతున్న దుస్థితి
- భారత్ కంటే ఎక్కువ ఆర్థిక సాయాన్నందిస్తున్న ఇతర చిన్న దేశాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భారత విద్యార్థుల అసంతృప్తి



న్యూఢిల్లీ : ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకమైన నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ భారత్‌లోని అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించటం కోసం ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. అయితే, అక్కడకు వెళ్లిన తర్వాత భారతీయ విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. వారికి తక్కువ స్టైఫండ్ మాత్రమే అందుతున్నది. దీంతో లభించే ఆ కొద్దిపాటి మొత్తం వారి తిండికి, బట్టకు కూడా సరిపోవటం లేదని వారు వాపోతున్నారు. ఉన్నత విద్య కోసం స్కాలర్‌షిప్ సాయంతో విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు కనీస ప్రాథమిక అవసరాలు కూడా తీరకపోవటంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. పలు అణగారిన వర్గాల నుంచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల సాధికారత కోసం ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. గతేడాది సంబంధిత మంత్రిత్వ శాఖ 125 మందికి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను అందించింది. ఇందులో 115 మంది విద్యార్థులు ఎస్సీలు, ఆరుగురు డీనోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార జాతుల విద్యార్థులు, నలుగురు భూమిలేని వ్యవసాయ కార్మికులు, సాంప్రదాయ చేతివృత్తులవారి పిల్లలు ఉన్నారు.

అయితే, విదేశాల్లో విద్యనభ్యసించటానికి స్కాలర్‌షిప్‌నకు వారు ఎంపికైనా.. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే కావటంతో ట్యూషన్ ఫీజులు, అక్కడ ఉండటానికి అయ్యే ఖర్చులను భరించలేని దుస్థితి వారికి ఏర్పడింది. ఎందుకంటే ప్రభుత్వం నుంచి అందే స్కాలర్‌షిప్ వారి కనీస అవసరాలనూ తీర్చలేదు. దీంతో ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో విదేశాలకు వెళ్లిన విద్యార్థులు ప్రతి పైసానూ లెక్కబెట్టుకొని, పొదుపు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కనీసం దగ్గు, జలుబు, జ్వరం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా.. మందులు, వైద్యుల వద్దకు వెళ్లటానికి డబ్బులు సరిపడా లేకపోవటంతో వ్యాధి తగ్గేవరకు వేచి చూస్తామని కొందరు విద్యార్థులు తమ ఆందోళనను వెలిబుచ్చారు. ఇక ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం కూడా ఎప్పుడందుతుందో అన్నదానిపై ఒక స్పష్టత ఉండదు. దీంతో విదేశాల్లో ఉండే విద్యార్థులు ఆర్థిక సాయం కోసం సంబంధిత మంత్రిత్వ శాఖను ఈమెయిల్స్, ఫోన్‌కాల్స్ ద్వారా సంప్రదించినా తగిన స్పందన లభించకపోవటం గమనార్హం.

భారత్ కంటే చిన్న దేశాలు కూడా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించటానికి తమ విద్యార్థుల కోసం పెద్ద మొత్తంలో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయనీ, ఈ విషయంలో ఇండోనేషియా వంటి దేశాలు ముందున్నాయని రాజు కెంద్రే వివరించారు. ఇండోనేషియా నుంచి వచ్చిన విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం నుంచి తగిన మొత్తంలో ఆర్థిక సాయం అందటంతో వారు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కేవలం చదువు పైనే శ్రద్ధ పెడుతూ తమ కోర్సులను పూర్తి చేస్తున్నారని కొందరు భారతీయ విద్యార్థులు తమ బాధలను వెళ్లగక్కుతున్నారు.

స్కాలర్‌షిప్ పథకం పట్ల విద్యార్థులకు అసంతృప్తి

ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకం విద్యార్థులను అసంతృప్తికి గురి చేస్తున్నదనీ, వారిని మానసికంగా గాయపరుస్తున్నదని కొందరు విద్యార్థులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది విద్యార్థులను వేధింపులకు గురి చేసే పథకమని ఆరోపిస్తున్నారు. ఫలితంగా తాము విద్యపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని అంటున్నారు. అనేక ఇతర ప్రపంచ స్కాలర్‌షిప్‌లు ఏటికేడు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరుగుతున్నప్పటికీ.. భారత్‌లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు తగిన స్టైఫండ్ లను అందించటంలో విఫలమవుతున్నాయని ఏకలవ్య ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజు కెంద్రే అన్నారు. స్కాలర్‌షిప్ ద్వారా అందే ఆర్థిక సాయం సరిపడకపోవటంతో విద్యార్థులు తమ అవసరాలు తీరటం కోసం పార్ట్-టైమ్ జాబ్‌లు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

నీట్ కౌన్సెలింగ్ స్థానికత వ్యవహారంలో

సుప్రీం విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ కౌన్సెలింగ్ స్థానికత వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌పై విచారణను సర్వోన్నత న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది. వైద్య, విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జీవో 33ని తీసుకువచ్చింది. ఇందులో నీట్‌కు ముందు నాలుగేండ్లు లోకల్‌గా చదవాలని, లేదా ఉండాలని నిబంధన 3 (ఏ) కింద చేర్చింది. అయితే ఈ నిబంధనను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ అభిరామ్‌తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు విద్యార్థులకు సానుకూలంగా తీర్పును వెలువరించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ... తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత విచారణ సందర్భంగా ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో వీరు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించడంతో పాటు, హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు సీజేఐతో కూడిన ధర్మాసనం మధ్యంతర స్టే ఇచ్చింది. అలాగే ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది.

అయితే శుక్రవారం మరోసారి ఈ పిటిషన్ సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థుల తరపున ప్రతివాదుల తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకు మాత్రమే కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించడం సరికాదన్నారు. దీని వల్ల అప్లై చేసుకోలేని ఇతర విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాదించారు. గత ఆదేశాలను విద్యార్థులందరికీ అమలు చేయాలని కోరారు. ఈ వాదనలపై స్పందించిన సీజేఐ చంద్రచూడ్, గత తీర్పును సవరించా లంటే ఆ ధర్మాసనంలోని ముగ్గురు న్యాయమూర్తులు ఉండాలని అన్నారు. ప్రస్తుతం న్యాయమూర్తి జస్టిస్ జె.బి పార్దివాలా లేనందున, సోమవారం ఈ కేసు విచారణ చేపడతామని పేర్కొంటూ విచారణను వాయిదా వేశారు.

మహిళల శక్తివంతానికి ప్రభుత్వం కృషి

- ఆ ఓరియంటేషన్‌తో కాంగ్రెస్ సర్కారు పనిచేస్తోంది
- సరస్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలను శక్తివంతంగా తయారు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లోగల పీపుల్స్ ప్లాజాలో పలు రాష్ట్రాల గ్రామీణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా ఓరియంటేషన్‌తో కాంగ్రెస్ సర్కారు పనిచేస్తోందని చెప్పారు. ఆ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. వారి కన్నీళ్లు, కష్టాలు తుడిచి, కోటీశ్వర్లను చేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీ స్ఫూర్తితో ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో వివిధ పథకాలను తీసుకొచ్చామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుందనీ, రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తుందనీ, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను మహిళా సంఘాలకి అప్పగించామన్నారు. స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్ల రుణాలిచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహించేలా మహిళా శక్తి కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు శిల్పారామంలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రెటరీ లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పలు బ్యాంకుల ఉన్నతాదికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆమోదం తర్వాతే మూసీ ప్రక్షాళన చేపట్టాలి

- బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ పరివాహక ప్రాంత ప్రజల ఆమోదం తర్వాతనే మూసీ ప్రక్షాళన చేపట్టాలని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలవంతం చేస్తామంటే హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుందని హెచ్చరించారు. మూసీపై ఆదిత్య సంస్థ నిర్మాణాలు చేస్తుంటే, వాటిని ఆపకుండా, పేదలు. సామాన్యులు ఉండే హైదర్‌షాకోట్ విలేజ్‌లో అధికారులు ఇండ్లకు మార్కింగ్ చేస్తున్నారని విమర్శించారు. 2400 కిలోమీటర్ల పొడవున్న నమామి గంగ ప్రాజెక్టుకు రూ.40 వేల కోట్లయితే, గండిపేట నుంచి నాగోల్ వరకు 55 కిలోమీటర్ల మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్ల వ్యయం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

3,4 తేదీల్లో తెలుగు వర్సిటీ ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తుందని ఆ వర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ శిల్పం, చిత్రలేఖనం, ఎంపీఏ నృత్యం, ఎంపీఏ జానపదం ప్రాయోగిక పరీక్షలను, ఎంఏ చరిత్ర, సంస్కృతి, పర్యాటకం కోర్సులకు, పీజీ డిప్లొమా యోగా, డిప్లొమా లలిత సంగీతం ప్రాయోగిక పరీక్షను, సర్టిఫికెట్ కోర్సులు యానిమేషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీల ప్రవేశ పరీక్ష వచ్చేనెల మూడున బాచుపల్లి ప్రాంగణంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వరంగల్‌లో నిర్వహించే ఎంఏ తెలుగు కోర్సుకు అక్కడి ప్రాంగణంలోనూ నిర్వహిస్తామని వివరించారు. వచ్చేనెల నాలుగన హైదరాబాద్‌లో ఎంఏ జోతిష్యం, ఎంఏ కమ్యూనికేషన్ జర్నలిజం, ఎంఏ తెలుగు కోర్సుల ప్రవేశ పరీక్షను బాచుపల్లి ప్రాంగణంలో నిర్వహిస్తామని తెలిపారు. బీఎఫ్ఏ ప్రాయోగిక పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు డ్రాయింగ్ బోర్డు, పెన్సిళ్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. శనివారం నుంచి తెలుగు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.pstu.cet.org ద్వారా హాల్ టికెట్లను పొందాలని విద్యార్థులకు సూచించారు.

'గీతం' హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలోని హాస్టల్‌లో ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. తోటి విద్యార్థులు, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన నాగల్లి వర్ష (19) గీతం యూనివర్సిటీలో బీటెక్ (సీఎస్ఈ) ద్వితీయ సంవత్సరం చదువుకుంటూ బాలికల హాస్టల్‌లో ఉంటుంది. కాగా శుక్రవారం ఉదయం 8 గంటలకే కాలేజీకి వచ్చిన ఆమె.. 10 గంటల సమయంలో తిరిగి హాస్టల్‌కు వెళ్లింది. అనంతరం మరోసారి యూనివర్సిటీకి వెళ్లి మళ్లీ హాస్టల్‌కి చేరుకుని తన గదిలో బెడ్ షీట్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. హాస్టల్‌కి వచ్చిన తన రూమ్ మెంట్ జరిగిన సంఘటనను చూసి భయపడి యూనివర్సిటీ యజమాన్యానికి చెప్పింది.

దాంతో వారు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి వివరాలు సేకరించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. కాగా, ఘటనాస్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదని, కుటుంబసభ్యులు వచ్చిన తర్వాతనే ఆత్మహత్యకు గల కారణాలు తెలుస్తాయని సీఐ తెలిపారు.

విష జ్వరంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్

నవతెలంగాణ-ఏటూరునాగారం(ఐటీడీఏ)

ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి విష జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. కన్నాయిగూడెం మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన కోరం చరణ్.. ములుగు మండలం ఇంచర్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. కాగా విద్యార్థి కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా.. పట్టించుకోని పాఠశాల నిర్వాహకులు.. ఆలస్యంగా విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే విద్యార్థిని హాస్పిటల్‌కి తీసుకెళుతుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. దాంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంతోనే విద్యార్థి చనిపోయాడని విద్యార్థి సంఘం జిల్లా నాయకులు దబ్బకట్ల శ్రీకాంత్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని ఏమాత్రం పట్టించుకోకుండా ఉపాధ్యాయులు వారి ఇష్టానుసారంగా వ్యవహరించారని, ఐడీటీఏ పీఓ విధుల్లో చేరి ఎనిమిది నెలలు కావస్తున్నా పాఠశాల స్థితిగతులపై ఏమాత్రం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పీఓ స్పందించి నిర్లక్ష్యపు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని, ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రతి క్షణమూ విలువైనదే

- సీపీఆర్ సకాలంలో చేస్తే మరణాలను ఆపొచ్చు : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గుండెపోటు వచ్చిన సమయంలో ప్రతి క్షణమూ విలువైనదనీ, సకాలంలో సీపీఆర్ చేస్తే మరణాన్ని ఆపొచ్చని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ కార్యాలయ సిబ్బందికి కిమ్స్ ఆస్పత్రి బృందం నేతృత్వంలో సీపీఆర్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరై మాట్లాడారు. సీపీఆర్ శిక్షణ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. గుండెపోటు వచ్చిన సమయంలో, అత్యవసర పరిస్థితుల్లో ప్రతి సెకన్ కూడా లెక్కించబడుతుందనీ, తక్షణమే వారికి సీపీఆర్ అందిస్తే కార్డియాక్ అరెస్టు బాధితులు జీవించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. పౌరులందరికీ సీపీఆర్ శిక్షణను అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడంలో వైద్యులు చొరవ తీసుకోవాలని కోరారు. రాజ్‌భవన్‌లో శిక్షణా సెషన్‌ను నిర్వహించి, సిబ్బందికి, వారి కుటుంబాలకు అవగాహన కల్పించిన డాక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ హైగ్రీవ్‌రావు, కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహూ, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

గవర్నర్, సీఎస్‌ను కలిసిన జపాన్ కౌన్సిల్ ఆఫ్ జనరల్ తకాహషి మునియో

రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జపాన్ కౌన్సిల్ ఆఫ్ జనరల్ తకాహషి మునియో మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో మునియో భేటీ అయ్యారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లోగల ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 'స్వచ్ఛత కి భాగీదారి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవు తుందని తెలిపారు. ఇల్లు, బస్తీ, గ్రామం, రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా సురక్షితంగా ఉండాలని చెప్పారు. మన హక్కులతో పాటు బాధ్యతలు ఉంటాయనీ, స్వచ్ఛ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

- రెండో రోజు ముఖాముఖిలో 320 దరఖాస్తులు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ కార్డును అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అక్టోబర్ మొదటి వారంలో ఫ్యామిలీ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రేషన్ కార్డులు, ఇండ్ల కోసం పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు వినతిపత్రాల సమర్పించారు.దాదాపు మూడున్నర గంటల పాటు మంత్రి ప్రజల బాధలు విన్నారు. తన శాఖకు సంబంధించిన అర్జీలను వెంటనే పరిష్కరించారు. ఇతర శాఖలకు చెందిన వినతులను సంబంధిత మంత్రులకు పంపించారు. భూ వివాదాలు, జీవో 317 బాధితులు, మల్లన్నసాగర్ ముంపు బాధితులు, పెన్షన్, రేషన్ కార్డులు, డీకే టెక్నాలజీ, సహారా బాధితులు, కుటుంబ వివాదాలకు సంబంధించిన అంశాలపై వినతిపత్రాలు అందాయి. మహిళలు, గర్భిణీలు, వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్ తన నియోజకవర్గానికి చెందిన వారి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. వాటిలో రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను వివరించారు.. సహారా కంపెనీ బాధితులు కూడా తమ సమస్యలు పరిష్కరించాలని నాగర్‌కర్నూల్‌కు చెందిన నారాయణ తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని, తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పారు. కోర్టు వివాదం ముగిసిన తర్వాత బాధితులకు అనుకూలంగా తీర్పు వస్తే ప్రభుత్వపరంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్‌కు చెందిన ఆర్ భార్గవి భూ వివాదాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కోదాడ నియోజకవర్గంలోని భూవివాదం పరిష్కరించాలని మాజీ ఎంపీ వి హనుమంతరావు కోరారు. ఈ విషయమై సూర్యాపేట కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. బెల్లంపల్లికి చెందిన పార్వతి తన భర్త తిరుపతయ్య తనకు దూరంగా ఉంటున్నాడని, తమ సంసారాన్ని చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతరావు ఉన్నారు.

విద్యావిధాన పత్రం ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటీకరణపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ధనవంతులకే చదువు దక్కేలా బీజేపీ ప్రభుత్వం తెచ్చిన "జాతీయ విద్యా విధానం - 2020"ను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. యూనివర్సిటీ వీసీల నియామకాన్ని ఆలస్యం చేయడం మంచిది కాదని హితవు పలికారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఉచిత కోర్సులుగా మార్చాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు, మెస్ చార్జీలు రూ.5 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. యువ దంపతుల వలసలు గ్రామాల నుంచి పట్టణాలకు పెరిగాయనీ, దీంతో పాఠశాల విద్యనభ్యసించే విద్యార్థుల సంఖ్య అక్కడే ఎక్కువగా ఉందని తెలిపారు. దానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తేవాలనీ, ప్రభుత్వ బడుల సంఖ్యను పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. విద్య ప్రభుత్వరంగంలోనే ఉండాల న్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని సూచించారు. విద్యావ్యవస్థ పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలో 1.10 లక్షల మంది విద్యార్థులకు ఒక ఎంఈవో ఉంటే, భూపాలపల్లి పలిమేలు మండలంలో 800 మందికి ఒక ఎంఈవో ఉన్నారనీ, దీనికి హేతుబద్ధత ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 3,664కుపైగా యూపీఎస్ పాఠశాలలు విలీనం పేరుతో మూసేయాలని ప్రతిపాదనలు వచ్చాయనీ, దీనివలన పేద విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. ఈ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న పోరాటానికి ఆయన మద్దతు ప్రకటించారు.

పేరుకే ప్రజా ప్రభుత్వం :ఆర్.ఎల్.మూర్తి

ప్రజా ప్రభుత్వం పేరు మీద విద్యారంగాన్ని అమ్ముకునే కుట్ర జరుగుతున్నదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి విమర్శించారు. కాదంటే సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే సచివాలయం ముట్టడికి సిద్ధమని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకునిగా, ఎంపీగా విద్యార్థులకు భరోసా ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అదే విద్యార్థులకు ఇప్పుడు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు. 38 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారనీ, దొడ్డు బియ్యం, నాణ్యత లేని ఆహారం, విద్యార్థులకు వేధింపులు, కులం పేరుతో వివక్ష, తాగునీటి కోసం తిప్పలు పడుతుంటే ప్రజా ప్రభుత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. వెంటనే విద్యారంగంపై సమీక్షించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్ కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి తమ దగ్గరకు రావడం లేదనీ, తామే సీఎం దగ్గరికి వెళ్లి తేల్చుకుంటామని హెచ్చరించారు. బతుకమ్మ పండుగలోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అయిత విజయ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, శ్రీకాంత్ వర్మ, సంతోష్, శంకర్, ప్రశాంత్, వీరభద్రం, పూజా రాష్ట్ర సహాయ కార్యదర్శులు కిరణ్, మమత, అశోక్ రెడ్డి, శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసీ తెలంగాణవాసులకు అండగా ఉంటాం

సమస్యల పరిష్కారానికి ఇది దోహదం

- ఉత్తర తెలంగాణ ఎమ్మెల్యేలతో సలహా కమిటీ : మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రవాసీ తెలంగాణవాసులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమస్యలను పరిష్కారానికి ప్రవాసీ ప్రజావాణి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జోతిరావు పూలే ప్రజా భవన్‌లో ప్రవాసీ ప్రజావాణి (గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం) ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న షేక్ హుస్సేన్ కుటుంబం నుంచి మొదటి అభ్యర్థనను మంత్రి పొన్నం స్వీకరించారు. సమస్యలను వివరించేందుకు గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కుటుంబాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో చెప్పినట్టు నాలుగు అంశాలపై నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మొదటిది ప్రజా భవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని వివరించారు. గల్ఫ్ దేశాలకు తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున ఉపాధి కోసం వెళ్తారని అన్నారు. వారి సమస్యల పరిష్కాఎ రానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ప్రమాదంలో చనిపోయిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. వారి కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందుల్లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని అన్నారు. తన నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహిస్తే తొమ్మిది వేల మంది వచ్చారని వివరించారు. విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం వెళ్లే వారికి అక్కడి చట్టాల గురించి తెలియడం లేదన్నారు. వారికి అవగాహన కల్పించాలనీ, వాటిపై విస్తృత సమాచారం అందించాలని సూచించారు. ప్రజలను మోసం చేస్తూ విదేశాలకు పంపించి అక్కడ ఇబ్బందులు పడేలా చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంస్థలున్నాయనీ, అక్కడ శిక్షణ పొంది విదేశాలకు ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, పీసీసీ ఎన్నారై సెల్ చైర్మెన్ వినోద్ కుమార్, ప్రజావాణి నోడల్ అధికారులు, ఇతర ఎన్నారై విభాగం నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 365 దరఖాస్తులు

మహాత్మాజోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 365 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 105, విద్యుత్ శాఖకు సంబంధించి 58, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి 42, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 29, మైనార్టీ సంక్షేమ శాఖకు సంబంధించి 26, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 22, ఇతర శాఖలకు సంబంధించి 83 దరఖాస్తులు అందాయని ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించారని పేర్కొన్నారు.

పోలీసుల ఓవరాక్షన్.. బలవంతపు అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి బృందంగా వెళ్లి ప్రభుత్వానికి శాంతియుతంగా విన్నవిస్తామని చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. కేవలం ధర్నాకు మాత్రమే అనుమతి ఉందంటూ ఆపేశారు. దీంతో తామేమీ చలో సెక్రెటేరియట్ చేయబోవడం లేదంటూ మూర్తి పోలీసులకు తన అసంతృప్తిని తెలియజేసి వెనుతిరిగేలోపే మూర్తితోపాటు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర, జిల్లాల నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. పోలీసుల అక్రమ అరెస్టును నిరసిస్తూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. కొంత మందిని ఎత్తుకెళ్లిన పోలీసులు, మరి కొంత మందిని బలవంతంగా ఈడ్చుకెళ్లారు. దీంతో కొంత మందికి గాయలయ్యాయి.

30 నుంచి ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

- అక్టోబర్ 2 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 30న ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. వచ్చేనెల ఒకటిన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. అదేనెల ఒకటి, రెండు తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల నాలుగున సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అదేనెల నాలుగు, ఐదు తేదీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించడంతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. వచ్చేనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. వచ్చేనెల ఆరో తేదీన ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

మూసీ నిర్వాసితులతో డ్రామా రాజకీయాలు ఆపేయ్

- ఈటలపై చనగాని దయాకర్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సుందరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపడుతున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. నిర్వాసితులతో రాజకీయాలు చేయడం ఆపేయాలంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను హెచ్చరించారు. మూసీ నిర్వాసితులకు సీఎం అండగా ఉన్నారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్వాసితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించేందుకు ప్రక్రియ చేపడుతుందని గుర్తు చేశారు. మూసీ నిర్వాసితులతో ఈటల రాజేందర్ ధర్నా చేయడం సిగ్గు చేటన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవారికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. మూసీ అంటే మురికి కాదు మంచి నీరు అని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం మూసీ పరివాహక సంస్థను ఏర్పాటు చేసి ప్రక్షాళన పేరుతో దగా చేసిందని విమర్శించారు. ప్రకృతితో కూడిన హైద్రాబాద్ బ్రాండ్‌ను పెంచేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయని విమర్శించారు.బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఈటల రాజేందర్ దొంగ రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా పేద వాడి ఇల్లు కూల్చారా? ఈటల చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శిఖండి రాజకీయాలు బంద్ చేయాలని సవాల్ విసిరారు.

రెండు ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సులు ఢీ

- ఓ బస్సు డ్రైవర్ మృతి
- మరో బస్సు డ్రైవర్, 15 మంది విద్యార్థులకు గాయాలు





నవతెలంగాణ-నర్సాపూర్

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక బస్సు డ్రైవర్ మృతి చెందాడు. మరో బస్సు డ్రైవర్‌తో పాటు 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఓ బస్సు విద్యార్థులను తీసుకొని హైదరాబాద్ నుంచి కళాశాలకు వెళుతున్న క్రమంలో అదే కళాశాలకు చెందిన మరో బస్సు కళాశాల నుంచి నర్సాపూర్ పట్టణానికి వస్తున్నది. ఈ క్రమంలో మార్గమధ్యలోకి రాగానే నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిలో గల ఆనంద్ గార్డెన్ సమీపంలో కళాశాల వైపు వెళ్లే బస్సు డ్రైవర్ ఓ ఆటోను తప్పించబోయాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఖాళీ బస్సును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బీరంగూడకు చెందిన నాగరాజు (50) అనే బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఆస్పత్రి సమీపంలో మృతి చెందాడు. కొల్చారం గ్రామానికి చెందిన మరో డ్రైవర్ యాదగిరి బస్సు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయి కాళ్లకు తీవ్ర గాయాల య్యాయి. వీరితోపాటు బస్సులో కళాశాలకు వస్తున్న 15మంది విద్యార్థులకు గాయాల య్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఎమ్మెన్నార్ ఆస్పత్రికి తరలించారు.

సీఐ జాన్ రెడ్డి, ఎస్ఐ లింగం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంతో నర్సాపూర్- సంగారెడ్డి ప్రధాన రోడ్డు గుండా వెళ్లే భారీ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది.

'వండర్‌లా'లో రెండు కొత్త రైడ్‌లు

- ప్రారంభించిన సినీనటుడు నాగచైతన్య



నవతెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ అమ్యూజింగ్ పార్కు వండర్‌లా హైదరా బాద్‌లో రెండు కొత్త రైడ్‌లను ఏర్పాటు చేసింది. వీటిని శుక్రవారం సినీ హీరో నాగచైతన్య లాంఛనంగా ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికతో హైపర్‌వర్స్, జీ-ఫాల్ రైడ్‌లను అదనంగా జోడించామని వండర్‌లా హాలిడేస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె చిట్టిలపిల్లి తెలిపారు. హైదరాబాద్‌లో ఇలాంటి అమ్యూజింగ్ పార్కు ఉండటం సంతోషకరమని.. తనకు బాగా నచ్చిందని నాగ చైతన్య అన్నారు. "జీ-ఫాల్, ఒక ఎత్తైన ఫ్రీ-ఫాల్ రైడ్, 40 మీటర్ల ఎత్తులో ఉంటుంది. గుండ్రంగా చుట్టూ కూర్చున్న 12 మంది రైడర్‌లతో, ఇది ఉద్విగ్నమైన రీతిలో, అధిక థ్రిల్ పంచుతూ పడిపోతున్నట్టుగా ఉండి.. అడ్రినలిన్ ప్రేమికులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది. హైపర్‌వర్స్ అత్యాధునిక మెటావర్స్ 3డి థియేటర్ అనుభవాన్ని అందిస్తుంది. 8కె హై-రిజల్యూషన్ డిస్‌ప్లే, 360 డిగ్రీస్ సరౌండ్ సౌండ్, 270 డిగ్రీస్ లైట్, షాడో డిజైన్‌ను కలిగి ఉండి ఎగిరే దృశ్యాలలోకి అతిథులను తీసుకుని వెళ్తుంది." అని అరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ధీరన్ చౌదరి, హైదరాబాద్ పార్కు హెడ్ మధుసుధన్ గుత్తా తదితరులు పాల్గొన్నారు.



సీతారామా ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

- భూసేకరణలో అలసత్వం ప్రదర్శించొద్దు : అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆ ప్రాజెక్టు టన్నెల్, కాలువల నిర్మాణాల పనుల పురోగతిపై శుక్రవారం జలసౌధలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి నీటిపారుదల శాఖాధికారులతోఆయన సమీక్షను నిర్వహించారు. గతనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టుకు చెందిన పంప్‌హౌజ్‌లను ప్రారంభించిన విషయం విదితమే. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భూసేకరణ అంశంపై అలసత్వం చేయొద్దని కోరారు. అందుకు పాలనా పరమైన అనుమతులలో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

సాంకేతికాంశాల్లో అధికారులు పరస్పరం సమన్వ యం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత గడువులోగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారుడు అదిత్యా దాస్‌నాథ్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ లు అనిల్ కుమార్, నాగేందర్‌రావులతోపాటు సీతారామ ప్రాజెక్టు సీఈ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా సీఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్ థియేటర్‌లో అగ్ని ప్రమాదం

- నటుడు జూనియర్ ఎన్టీఆర్ కటౌట్ దగ్ధం



నవతెలంగాణ - ముషీరాబాద్

హైదరాబాద్ ముషీరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవరా సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా హీరో అభిమానులు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్‌లో భారీ ఎత్తున టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆ టపాకాయల నిప్పు రవ్వలు, థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన తారక్ భారీ కటౌట్‌పై పడటంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడి కటౌట్ మొత్తం దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో ఎవ్వరూ గాయపడలేదు. వెంటనే ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించడంతో సినిమా చూడటానికి వచ్చిన ప్రేక్షకులు కాసేపు భయాందోళనకు గురయ్యారు .

తెలంగాణకు రెండు పర్యాటక అవార్డులు

- స్పిరిచ్యువల్, వెల్నెస్‌లో సోమశిల, క్రాఫ్ట్‌లో నిర్మల్‌కు పురస్కారాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని రెండు పర్యాటక గ్రామాలకు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కాయి. 2024 సంవత్సరానికిగానూ కేంద్ర పర్యాటక శాఖ ఎనిమిది కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో "స్పిరిచ్యువల్ - వెల్నెస్" కేటగిరీలో నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిలకు, "క్రాఫ్ట్" కేటగిరీలో నిర్మల్‌కు పురస్కారాలు దక్కాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ అవార్డులను ప్రదానం చేశారు. నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, నిర్మల్ టాయ్స్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు ఎస్.పెంటయ్య, పర్యాటక శాఖ అధికారి టి.నర్సింహా అవార్డులను అందుకున్నారు.

మంత్రి జూపల్లి హర్షం

సోమశిల, నిర్మల్‌కు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మలకు, కొల్లాపూర్‌లోని సోమశిలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని అన్నారు. నిర్మల్ వాసులకు, సోమశిల గ్రామస్తులకు, కళాకారులకు, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి శుభాకాంక్షలు తెలిపారు.

అటవీశాఖ అధికారులపై దాడి

- గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స
- మంత్రి కొండా సురేఖ ఆరా
- మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం



నవతెలంగాణ-తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్ దామెరవాయి అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బందిపై గురువారం దాడి జరిగింది. ఈ ఘటనపై అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. ఈ దాడికి సంబంధించి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) డోబ్రియాల్ మంత్రికి ఫోన్‌లో వివరించారు. గురువారం రాత్రి దామెరవాయి అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు తొలగించి నేలను చదును చేస్తున్నారన్న సమాచారంతో.. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) వినోద్, బీట్ ఆఫీసర్లు శరత్‌చంద్ర, సుమన్, బేస్ క్యాంప్ సిబ్బంది ఒకరు జీపులో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీని స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ నేపథ్యంలో సిగ్నల్ లేని ప్రదేశంలో నిందితులు అటవీశాఖ అధికారులపై విచక్షణారహితంగా రాళ్లతో దాడి చేశారు. తర్వాత జేసీబీని తీసుకుని పారిపోయారు. తీవ్ర గాయాల పాలైన ఫారెస్ట్ అధికారులు వరంగల్ ములుగు రోడ్‌లోని గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వైద్యం పొందుతున్న అటవీ శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. గాయాలపాలైన అధికారులు.. స్థానిక వైల్డ్ లైఫ్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ కృష్ణవేణి, ఎఫ్ఎస్ఓ వినోద్ కుమార్, ఎఫ్‌బీవో శరత్‌చంద్ర, సుమన్, బేస్ క్యాంప్ సిబ్బంది ఎట్టి శ్రీను, డ్రైవర్ రాజేందర్ ఉన్నారు. దాడిలో ప్రభుత్వ జీపును ధ్వంసం చేసి చంపుతామని బెదిరించి విధులకు ఆటంకం కలిగించారని, వెంటనే వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి ఎఫ్ఆర్ఓ కృష్ణవేణి ఫిర్యాదు చేశారు. దాంతో నిందితులు గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, పాండవుల సాయి, నీరటి శ్రీకాంత్, మాదరి చంటి ఐదుగురి దుండగులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మూసీ ప్రక్షాళన ప్రతిష్టాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలని కోరారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఆ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నామని చెప్పారు. హైకోర్టు భవనాన్ని కూడా పరిరక్షించుకోవాల్సి ఉందనీ, రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం వంద ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలనీ, ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతున్నదని వివరించారు.

తెలంగాణ దర్శిని..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పిస్తూ తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు. దీనికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. విద్యార్థులకు చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి అవగాహన కల్పించాలనీ, దాన్ని ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తుందని చెప్పారు.

మెట్ల బావులు దత్తత...

నగరంలోని పురాతన మెట్లబావులను పునరుద్ధరించి, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు ఒప్పంద పత్రాలను అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణ కోసం ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్లబావిని, భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి మెట్లబావుల పునరుద్ధరణకోసం దత్తత తీసుకున్నాయి. అడిక్‌మెట్ మెట్లబావిని దొడ్ల డైరీ ఫామ్, ఫలక్‌నుమా మెట్లబావిని టీజీఎస్ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్లబావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించేందుకు అంగీకారం తెలిపాయి. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఒప్పంద పత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మెన్ సాయిప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ కోసం ఎమ్ఓయూ

కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించేందుకు వయాట్రిస్, హెచ్‌కెఎమ్ ఛారిటబుల్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ ఎమ్ఓయూపై ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస, కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్ మిషెల్ డొమినికా సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో 28వేల మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందుబాటులోకి తెచ్చేలా ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం అమలు కోసం వయాట్రిస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రూ.6.4 కోట్ల విరాళాన్ని అందించింది.

భద్రకాళి నవరాత్రుల్లో పాల్గొనండి

వరంగల్ భద్రకాళి అమ్మవారి నవరాత్రుళ్లలో పాల్గొనాలని ఆ దేవస్థానం చైర్మెన్ శేషు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారంనాడాయన దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) శేషుభారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనకు ఆహ్వానపత్రిక అందచేశారు.

రిలయన్స్ విరాళం రూ.20 కోట్లు

రిలయన్స్ ఫౌండేషన్ ముఖ్యమంత్రి సహాయనిధికి భారీ విరాళం అందచేసింది. నీతూ అంబానీ తరపున ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి రూ.20 కోట్ల చెక్కును అందచేశారు.

భారత్ బయోటెక్ రూ.కోటి

భారత్ బయోటెక్ సంస్థ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం అందజేసింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భారత్ బయోటెక్ కో-ఫౌండర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా కలిసి ఈ మేరకు చెక్‌ను అందచేశారు.

సీఎంను కలిసిన జపాన్ కాన్సులర్

జపాన్ కాన్సుల్ జనరల్ టకాహషి మునియో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జపాన్‌లో సీఎం పర్యటించిన విషయం తెలిసిందే. పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రంలోకి రానున్న కంపెనీల గురించి ఈ సందర్భంగా సీఎం ఆరా తీసారు.

సీఎంను కలిసిన ఒలింపియాడ్ చాంపియన్స్

'ఫైడ్' చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణపతకం సాధించిన తెలంగాణ ఆటగాళ్లు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. భారతదేశం తరపున మొదటిసారి స్వర్ణపతకాలను తెలంగాణ ఆటగాళ్లు అర్జున్ (హన్మకొండ), ద్రోణవల్లి హారిక(ఖమ్మం) సాధించారు. ఈ సందర్భంగా వీరికి ఒక్కొక్కరికి రూ.25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని సీఎం ప్రకటించారు.

కొత్త క్యాంపస్ ప్రారంభానికి రండి సీఎంకు హెచ్‌సీఎల్ ఆహ్వానం

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావాలని ఆ సంస్థ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారంనాడాయన సచివాలయంలో సీఎంను కలిసి, ఆహ్వానపత్రం అందచేశారు. ఈ క్యాంపస్‌లో అదనంగా ఐదు వేలమంది ఇంజనీర్లకు ఉద్యోగాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురూ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి కోరారు.



దసరాలోపు ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాల్సిందే..!

- లేదంటే రైతులతో కలిసి సచివాలయం ముట్టడిస్తాం : రైతు ధర్నాలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-నంగునూరు

దసరాలోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలని, లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క రైతుకూ రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులు ఏ విధంగా ఉండేవారు, కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉందనేది అందరికీ అర్థమవుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం కూలిపోయిందని అంటున్నారని, అది కూలిపోతే.. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్‌కు నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలవదని, కాళేశ్వరంలో 100 భాగాలు ఉంటాయని, ఒక్క భాగంలో 160 పిల్లర్లలో రెండు పిల్లర్లకి చిన్న పగుళ్లు వచ్చాయని, దానికే మొత్తం కూలిపోయిందని అబద్ధ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 భాగాల కాళేశ్వరంలో మూడు బ్యారేజీలు, 19 పంప్ హౌస్‌లు, 18 రిజర్వాయర్లు, సొరంగాలు, కాలువలు, పైపులైన్లు ఉన్నాయని చెప్పారు. తన ఎమ్మెల్యే పదవి కంటే రైతులకు రుణమాఫీ కావడమే తనకు ముఖ్యమని, పదవి కంటే అవ్వ తాతలకు రూ.5000 పెన్షన్ రావడం తనకు ఆనందమని అన్నారు. పంద్రాగస్టు వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని, మొదలు రూ.49 వేల కోట్లు మాఫీ చేస్తామన్నారని, తర్వాత రూ.31 వేల కోట్లు అన్నారని.. కానీ ఇప్పటివరకు చేసింది.. రూ.17వేల కోట్లేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేంతవరకు తాను నిద్రపోనని, సీఎంను నిద్రపోనివ్వనని హెచ్చరించారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, వేలేటి రాధా కృష్ణ శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కాలేజీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- రహస్యంగా విద్యార్థులకు చికిత్స
- మాదాపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి
- కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- అలాంటిదేమీ జరగలేదంటూ బుకాయించిన కాలేజీ యాజమాన్యం

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డివిజన్ అయ్యప్ప సొసైటీలోని చంద్రనాయక్ తండాలో శ్రీ చైతన్య అక్షర క్యాంపస్‌లో ఇంటర్ విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయింది. దాంతో కళాశాల యాజమాన్యం విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే క్యాంపస్‌లోనే రహస్యంగా వారికి చికిత్స అందించింది.

ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజులుగా క్యాంపస్‌లో సుమారు 150 మంది వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఇదే విషయాన్ని యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే క్యాంపస్‌లో విద్యార్థినులకు సరైన భోజనం కూడా పెట్టలేదు. దాంతో ఒకవైపు జ్వరం.. మరోవైపు సరిగ్గా తిండి లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన క్యాంపస్ యాజమాన్యం రహస్యంగా విద్యార్థినులకు క్యాంపస్‌లోనే చికిత్స అందిస్తోంది. మరీ సీరియస్‌గా ఉన్న వారిని.. తల్లిదండ్రులను రప్పించి ఇంటికి పంపిస్తున్నారు.



కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ చైతన్య నారాయణ లాంటి బడా కార్పొరేట్ కాలేజీలు ఫీజులు తీసుకోవడం మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల తిండి, చదువు మీద లేదని ఆరోపించారు. కొద్దిరోజులుగా పెద్ద మొత్తంలో ఈ క్యాంపస్‌లో ఉన్న విద్యార్థినులకు వైరల్ ఫీవర్ వస్తుందని, అయినా సరైన తిండి పెట్టలేదన్నారు. కాలేజీలో నాణ్యమైన ఆహారం అందించకపోవడంతో విద్యార్థినులు తరచుగా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలేజీకి రూ. 2లక్షల జరిమానా

శ్రీ చైతన్య కాలేజీపై.. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా 100మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో విషయం తెలుసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు క్యాంపస్‌ను సందర్శించారు. కాలేజీ, మెస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యానికి రూ. 2లక్షల చలాన్ విధించారు.

మూసీ పరివాహకం.. మూసారాంబాగ్ వద్ద కార్ఖానాల తొలగింపు ఆపాలి



- కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-అంబర్‌పేట

మూసారాంబాగ్ దగ్గర కార్ఖానాల తొలగింపు ఆపాలని, బాధితులకు తగిన నష్టపరిహారం, ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే కొనసాగించాలని కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతమైన మూసారాంబాగ్ వద్ద కార్ఖానాల వ్యాపారులకు మద్దతుగా అలీ కేఫ్ చౌరస్తా నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఆర్ఐ గీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూసారాంబాగ్ బ్రిడ్జి దుర్గానగర్ బస్తీ పక్కనున్న 80 కార్ఖానాలను తొలగిస్తామని రెవెన్యూ అధికారులు గోడలకు స్టిక్కర్ వేసి వెళ్లారని తెలిపారు.

ఈ చిన్న చిన్న కార్ఖానాల్లో వందలాదిమంది ఉపాధి పొందుతున్నారని, కార్ఖానాల యజమానులు భూమిని కొనుక్కొని, వాటిని ఏర్పాటు చేసుకొని అనేక ఏండ్లుగా వీటిని నడుపుకుంటున్నారని చెప్పారు. అయితే కనీసం ఎలాంటి చర్చ లేకుండా నష్టపరిహారం చెల్లించకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా అకస్మాత్తుగా కార్ఖానాలను కూల్చివేస్తామని అధికారులు బెదిరించడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్ఖానాలు కొనసాగుతున్న స్థలంపై హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ అధికారులు ఖాతరు చేయకుండా కూల్చివేతలకు పూనుకోవడం అన్యాయమని తెలిపారు. కూల్చివేతలు తక్షణమే ఆపాలని, కార్ఖానా యజమానులతో చర్చించి, తగిన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్, నాయకులు వంగు ఆంజనేయులు, లింగ రావు, రాములు, మహేష్ ముదిరాజ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

29న కులాంతర వివాహితుల రాష్ట్ర సదస్సు



- కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల మతాంతర వివాహం చేసుకున్న దంపతులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం రూ. పది లక్షలు ఇవ్వాలనీ, దంపతుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ సెప్టెంబర్ 29న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరగనున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించినట్టు తెలిపారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం కుల, మతాంతర వివాహం చేసుకున్న దంపతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కుల నిర్మూలనలో కులాంతర వివాహాలు మొదటి మెట్టు లాగా ఉపయోగపడతాయని తెలిపారు. కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలనీ, వారి రక్షణ కోసం ఉన్న అనేక జీవోలు అమలుకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన చేపడుతున్న సందర్భంలో కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారి గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సదస్సులో ముఖ్య అతిథిదిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి, మాజీ జస్టిస్ చంద్రకుమార్ ఇతర ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

మల్లన్న సాగర్ నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ

- సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- నిర్వాసితులతో కలిసి మంత్రులకు వినతిపత్రాలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఉన్న మల్లన్న సాగర్ నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి కోరారు. శుక్రవారం మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయం నిర్వాసితులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఇతర మంత్రులను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ఉన్న రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయాలతో గ్రామాలు, భూములు కోల్పోయిన వారికి అందాల్సిన పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రులు భరోసా ఇచ్చినట్టు తెలిపారు. మల్లన్న సాగర్‌లో భూములు కోల్పోయిన వారికి రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో శ్మశానవాటికల నిర్మాణాలకు కృషి చేస్తామని చెప్పారు. 60 ఏండ్లు పైబడిన మహిళలు, పురుషులకు ప్యాకేజీలు రానివారికి అందజేస్తామన్నారు. వ్యవసాయ భూములకు రావల్సిన పట్టా, పోరంబోకు భూములకు నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు.

పేదల ఇండ్లు కూల్చొద్దు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- 50ఏండ్ల నుంచి నివాసముంటున్న గృహాలు ఎలా కూలుస్తారంటూ బాధితుల ఆర్తనాదాలు




నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేర్లతో పేదల ఇండ్లను కూల్చొద్దని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని 42, 30, 43 వార్డులకు చెందిన పేద ప్రజలు వేలాది మంది శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు మాట్లాడుతూ.. యాభై ఏండ్ల నుంచి పేదలు.. సద్దల చెరువు పక్కన పక్కా ఇండ్లు కట్టుకొని జీవిస్తున్నారని, వారు ఇంటి పన్ను, నల్లా బిల్లులు చెల్లిస్తున్నారని, వారంతా కూలీ పని చేసుకుని జీవించే పేదలని తెలిపారు. కూలీ డబ్బులతో కుటుంబ పోషణ చేస్తున్నారని, అటువంటి పేదల ఇండ్ల వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పేరుతో అధికారులు సర్వేలు చేయడంతో పేదలు భయంతో వణికిపోతున్నారన్నారు. సద్దల చెరువు పక్కన మూడు ప్రభుత్వ పాఠశాలలు, పార్క్, కమ్యూనిటీ హాల్, హాస్టల్ భవనాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వార్డు కౌన్సిలర్లు, అఖిలపక్ష నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 42, 30 వార్డుల కౌన్సిలర్లు అంగిరేకుల రాజశ్రీ నాగార్జున, పల్స మహాలక్ష్మి మల్సూర్, 43 వ వార్డు కో ఆప్షన్ సభ్యులు బత్తుల జాన్సి రమేష్, నాయకులు మీర్ అక్బర్, కట్టు శంకర్, చంచల శేఖర్, గాలి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జనగామ జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జనగామ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారి అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఆర్అండ్‌బీ ఈఈ హుస్సేన్ తన కార్యాలయంలో రూ.14 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యపాల్ రెడ్డి అనే వ్యక్తి.. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల రహదారిలో పెట్రోల్ బంకు ప్రారంభించేందుకు ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించారు. దాంతో అనుమతి కోసం.. కార్యాలయ ఏపీఓ రాజేందర్‌కు రూ.2 వేలు, తనకు రూ.12 వేలు ఇవ్వాలని ఈఈ హుస్సేన్ డిమాండ్ చేశారు. దాంతో సత్యపాల్ రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను సంప్రదించారు. ఏసీబీ ఉమ్మడి జిల్లా అధికారి సాంబయ్య ప్రత్యేకంగా వ్యూహరచన చేసి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈఈ హుస్సేన్ తన కార్యాలయంలో రూ.14 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం ఏపీవో రాజేందర్‌ను వరంగల్ ఉమ్మడి జిల్లా ఏసీబీ అధికారి సాంబయ్య అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు విచారణ చేస్తున్నారు.

హడావుడి ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. ఈ నెల ఐదోతేదీ నాటి హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎందుకు కూల్చివేత చర్యలు తీసుకున్నారో ఈ నెల 30న జరిగే విచారణకు వ్యక్తిగతంగా (ఫిజికల్ లేదా ఆన్‌లైన్) హాజరుకావాలని హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్‌లను ఆదేశించారు. కేవలం 48 గంటల్లో బిల్డింగ్ ఖాళీ చేయాలంటే ఎలా? గడువు ఇవ్వాలి కదా? అని ప్రశ్నించారు. కూల్చివేత నోటీసులు ఇచ్చిన అమీన్‌పూర్ తహసీల్దార్, కూల్చివేత చర్యలు చేపట్టిన హైడ్రా కమిషనర్‌కు నోటీసులు ఇచ్చారు.

పాలస్తీనాను వీడి వెళ్ళేది లేదు

ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించండి

- ఐరాస నుంచి బహిష్కరించండి : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ స్పష్టీకరణ
- గాజా పునర్వ్యవస్థీకరణకు 12 సూత్రాల ప్రణాళిక



ఐక్యరాజ్య సమితి : "పాలస్తీనా మా మాతృభూమి, మేం ఆ ప్రాంతాన్ని వీడి వెళ్ళం. వెళ్ళాల్సిన వారు ఎవరైనా వున్నారు అంటే, వారు దురాక్రమణకు పాల్పడినవారే." అని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 79 వ వార్షిక సమావేశాల్లో ప్రసంగించారు. ఈ విషయంలో ఆయనకు పలు దేశాల నేతలు తమ మద్దతు పునరుద్ఘాటించారు. .

ఇజ్రాయిల్ పూర్తి స్థాయి యుద్ధానికి దిగుతూ పాలస్తీనియన్లను ఊచకోత కోస్తోందని ఆయన విమర్శించారు. గాజాలో అమాయకులైన పౌరులను చంపలేదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనడాన్ని ఆయన తోసిపుచ్చారు. అలా అయితే 15వేల మందికి పైగా చిన్నారులను పొట్టనబెట్టుకున్నారు, మరి వారెవరు? అని ప్రశ్నించారు.

"ఈ నేరాలు ఆపండి, ఇప్పుడే ఆపాలి. మహిళలను, చిన్నారులను చంపడాన్ని మానాలి. ఊచకోతకు స్వస్తి పలకాలి. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు పంపించడం ఆపాలి. ఇవన్నీ కొనసాగించడం ఇకపై కుదరదు. ఈనాడు మా ప్రజలకు జరుగుతున్నదానికి యావత్ ప్రపంచం బాధ్యత వహించాలి." అని అబ్బాస్ స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలని, ఐక్యరాజ్య సమితి నుండి బహిష్కరించాలని అబ్బాస్ అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. ఈ ప్రపంచ సంస్థలో భాగస్వామి కావడానికి ఇజ్రాయిల్‌కు అర్హత లేదని అన్నారు. ఈ అంశంపై యుఎన్‌జిఎకు పిటిషన్‌ను అందచేయనున్నట్లు చెప్పారు.

ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికా ఇప్పటికి మూడుసార్లు భద్రతా మండలిలో కాల్పుల విరమణ ముసాయిదా తీర్మానాలను అడ్డుకోవడం విచారకరమని అన్నారు. వీటో అధికారంతో తీర్మానాలను వీగిపోయేలా చేస్తూ, మరోపక్క ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ అమెరికా, ఇజ్రాయిల్ చర్యలను సమర్ధిస్తోందన్నారు.

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ప్రస్తుతం ఆరులక్షల మందికి పైగా సెటిలర్లు వున్నారన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు అమలు కావాలని కోరుతున్నామన్నారు.

12 సూత్రాలతో దార్శనికత

గాజాలో ఇజ్రాయిల్ దాడులనంతర పరిస్థితులను చక్కదిద్దడానికి అబ్బాస్ 12 సూత్రాలను ప్రతిపాదించారు.

గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, హింసకు పూర్తిగా స్వస్తి చెప్పడంతో పాటూ రెండు దేశాలు ఏర్పాటు పరిష్కారాన్ని అమలు చేసేందుకు ఏడాదిలోగా అంతర్జాతీయ శాంతి మహాసభను నిర్వహించాలని ప్రతిపాదించారు. అలాగే ఇరు దేశాల్లో ప్రజల రక్షణ కోసం అంతర్జాతీయ శాంతి పరిరక్షక బలగాలను ఏర్పాటు చేయాలన్నారు. తాము ప్రతిపాదించిన 12 సూత్రాలను అంతర్జాతీయ సమాజం సమీక్షించవచ్చని, అవసరమైతే సవరణలు చేయవచ్చని అబ్బాస్ సూచించారు.

పాలస్తీనాలో శాశ్వత శాంతిని పునరుద్ధరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గాంబియా అధ్యక్షుడు అడమా బారో కోరారు.

సమాజంతో రాజ్యాంగ సిద్ధాంత పరిణామం

సీజేఐ డి.వై చంద్రచూడ్



న్యూఢిల్లీ : రాజ్యాంగ సిద్ధాంతం సమాజంతో ఉద్భవించిందని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ అన్నారు. ప్రస్తుత కాలంతో సహా ఏ తరం కూడా పరిష్కా రాలపై గుత్తాధిపత్యాన్ని కలిగి ఉండదని చెప్పారు. ఎం.కె నంబ్యార్ స్మారక ఉపన్యాసం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ముందుచూపున్న మిస్టర్ ఎం.కె నంబ్యార్- అసలు ఉద్దేశ్యానికి మించిన రాజ్యాంగయాత్రలు' అనే అంశంపై సీజేఐ ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని నంబ్యార్ కుమారుడు, భారత మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కె.కె వేణుగోపాల్ నిర్వహించారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల సిట్టింగ్, మాజీ న్యాయమూర్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నంబ్యార్ వంటి న్యాయనిపుణుల గొప్పతనం రాజ్యాంగం నిర్మాతల అసలు ఉద్దేశ్యంతో స్థిరపడకుండా న్యాయశాస్త్ర పంక్తుల మధ్య చదవటం వారి అసాధా రణ ప్రతిభలో ఉన్నదని సీజేఐ అన్నారు. భారత రాజ్యాంగం 'సజీవ పత్రం'గా ఏండ్ల తరబడి వర్ధిల్లిందని ఆయన తెలిపారు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి యూకే మద్దతు



న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులోని శాశ్వత సభ్యత్వం కోసం ప్రధాని మోడీ దేశ విదేశాలు తిరుగుతూ.. ఆ దేశాల మద్దతును కూడగడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా యుకె కూడా భారత్‌ని ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యదేశంగా చేర్చుకోవడానికి మద్దతునిచ్చింది. తాజాగా న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. అందుకోసం భద్రతామండలిని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచుకోవాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని ఆయన అన్నారు.

అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మాక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్‌సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్‌సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే.

కాగా, ఇప్పటివరకు భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి

ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెగతెంపులు చేసుకోండి

ముస్లిం దేశాలను కోరిన ఇరాన్



టెహరాన్ : గాజా, లెబనాన్‌లపై విచక్షణారహితంగా దాడులకు దిగుతూ వేలాదిమంది అమాయకులను పొట్టన బెట్టుకుంటున్న ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని ముస్లిం దేశాలకు ఇరాన్ విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయిల్ రాయబారులను బహిష్కరించి, ఇజ్రాయిల్ దేశంపై ఆంక్షలు విధించాలని కోరింది. ఈ మేరకు ఇరాన్ రక్షణ మంత్రి బ్రిగేడియర్ జనరల్ అజీజ్ నజీర్‌జదాహ్ లెబనాన్ దాడుల్లో గాయపడిన వారిని పరామర్శించినపుడు ఈ వ్యాఖ్యలు చేశారు. లెబనాన్‌లో దాడుల్లో తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం టెహరాన్ తరలించారు. కేవలం ఇజ్రాయిల్ చేస్తున్న నేరాలను నిరసిస్తే సరిపోదు, ఈ ఊచకోతను ఆపేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలంటే మరిన్ని చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఆ దేశంతో రాజకీయ సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని, రాయబారులను బహిష్కరించాలని, పరస్పర ఆర్థిక లావాదేవీలను ఆపాలని కోరారు. బాంబు దాడులతో, మూకుమ్మడి హత్యలతో ప్రతిఘటనా శక్తిని అణచివేయలేరని వ్యాఖ్యానించారు. అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో ఇజ్రాయిల్ యూదు ప్రభుత్వం ఇటువంటి అమానుష చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇటీవల లెబనాన్‌లో పేజర్, ఎలక్ట్రానిక్ పరికరాల దాడులను ప్రస్తావిస్తూ, ఇలాంటి పద్ధతుల వల్ల దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయన్నారు. కమ్యూనికేషన్‌కు ప్రాథమికంగా అవసరమైన ఇటువంటి పరికరాలను బాంబులుగా మార్చి దాడులకు దిగడాన్ని అస్సలు జీర్ణించుకోలేమన్నారు.

ఇన్నేళ్లూ గుర్తుకు రాని డిక్లరేషన్ ఇప్పుడే ఎందుకు? : జగన్

- తిరుమల పర్యటన వాయిదా

అమరావతి : 'తొలిసారి ఎవరైనా వెళ్తుంటే ఇలా అడగొచ్చు. కానీ, జగన్ ఏమైనా కొత్తనా? వైఎస్ రాజశేఖర రెడ్డి ఏమైనా కొత్తనా? నా మతం ఏమిటో, కులం ఏమిటో రాష్ట్రంలో, దేశంలో తెలియదా? రాజశేఖరరెడ్డిగారు వరుసగా ఐదేళ్లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన కొడుకునే కదా నేను. నా పాదయాత్ర మొదలు పెట్టే ముందు దర్శించుకున్నాను. పాదయాత్ర ముగిసిన తరువాతకూడా నడకమార్గంలో స్వామివారిని దర్శించుకున్న తరువాతే ఇంటికి వెళ్లాను. ఆ తరువాత సిఎంగా వరుసగా ఐదేళ్లు పట్టు వస్త్రాలు సమర్పించాను. ఇలా 10,11 సార్లు వెళ్లిన తరువాత, ఈ రోజు డిక్లరేషన్ అడగడం ఏమిటి? అడ్డుకుంటామంటూ నోటీసులు ఇవ్వడమేంటి?' అని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిలోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక మాజీ ముఖ్యమంత్రికే ఇటువంటి పరిస్థితి ఏర్పడితే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే డిక్లరేషన్ అంశాన్ని ముందుకు తెచ్చారని చెప్పారు. అయితే, బాబు అనుకున్న విధంగా టాపిక్ డైవర్ట్ కాకూడదన్న ఉద్దేశ్యంతోనే తన తిరుమల పర్యటనను వాయిదా వేసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. 'మా నాయకులు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇస్తున్నారు. హౌస్ అరెస్టులు చేస్తున్నారు. పక్క రాష్ట్రాల నుండి బిజెపి కార్యకర్తలను రప్పించి గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అలా తాను చేసిన తప్పులను కప్పు పుచ్చుకునేందుకు చంద్రబాబు డైవర్ట్ చేస్తున్నారు' అని జగన్ చెప్పారు. తన మతం గురించి వివరణ ఇస్తూ 'నాలుగు గోడల మధ్య నేను బైబిల్ చదువుతాను. బయటకు వస్తే హిందూ సాంప్రదాయాలను అనుసరిస్తాను. గౌరవి స్తాను. ఇస్లాంను అనుసరిస్తాను. గౌరవిస్తాను. సిక్కిజ మ్‌ను అనుసరిస్తాను. గౌరవిస్తాను. నా మతం మానవత్వం. రాసుకోండి ఇదే నా డిక్లరేషన్' అని అన్నారు.

జపాన్ ప్రధానిగా 'ఆసియన్ నాటో' ప్రతిపాదకుడు ఎన్నిక



పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి షిగేరు ఇషిబా జపాన్ కొత్త ప్రధానమంత్రి అయ్యాడు. ఇషిబా, మాజీ రక్షణ మంత్రి, అవినీతి కుంభకోణాల మధ్య తక్కువ ఆమోదం రేటింగ్‌లతో పోరాడుతున్న ఫ్యూమియో కిషిడా తర్వాత స్థానంలో ఉన్నాడు. 2000వ దశకంలో రక్షణ మంత్రిగాను, వ్యవసాయ మంత్రిగాను పనిచేసిన 67 ఏండ్ల రాజకీయ నాయకుడు, పార్టీ నాయకత్వాన్ని కాపాడుకోవడంలో అతని ఐదవ ప్రయత్నంగా శుక్రవారం ఓటింగ్‌లో 215 ఓట్లతో ఈ పదవిని పొందాడు. మొదటి రౌండ్ ఓటింగ్‌లో ఎనిమిది మంది అభ్యర్థులకు వ్యతిరేకంగా వచ్చారు.

ఎన్నికల తరువాత ఇషిబా తన పార్టీకి ఇది పునర్జన్మ అని, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందుతుందని వాగ్దానం చేశాడు. సిఎన్ఎన్ ప్రకారం, అతను అధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటానని, నిజ వేతన వృద్ధిని సాధిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. చైనా, ఉత్తర కొరియాల నుంచి వచ్చే బెదిరింపులను ఎదుర్కోవడానికి ఆసియా నాటో కూటమిని రూపొందించడానికి, నాయకత్వం వహించడానికి ఈ ప్రాంతంలో అమెరికా మిత్రదేశమైన జపాన్ సిద్ధంగా ఉండాలని కూడా అతను పిలుపునిచ్చాడు.

ఇషిబాను దుందుడుకు వ్యక్తిగా, "ఒంటరి తోడేలు"గానూ వర్ణిస్తారు. అతను తన స్వంత పార్టీతో తలపడటానికి కూడా భయపడడు. అతనికి ఉన్నత స్థాయి శత్రువులు, అట్టడుగు మిత్రులు ఉన్నారు. అణుశక్తి వినియోగం పెరగడం, వివాహిత జంటలు వేర్వేరు ఇంటిపేర్లు ఉపయోగించడాన్ని అనుమతించక పోవడంపై జపాన్ విధానాన్ని ఆయన విమర్శించాడు. ఈ ఏడాది ప్రారంభంలో పార్టీ అవినీతి కుంభకోణంలో తనకు ముందు నాయకుడిగా వున్న కిషిడా వ్యవహరించిన తీరును కూడా ఆయన తీవ్రంగా విమర్శించాడు.ఆగస్టులో తిరిగి ఎన్నికను కోరకూడదని కిషిడా తీసుకున్న నిర్ణయానికి మార్గం సుగమం చేసిన ప్రధాన కారకాల్లో ఈ వివాదం ఒకటిగా పరిగణించబడింది. గత పతనంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తన కార్యక్రమాలకు టిక్కెట్ల అమ్మకాల ద్వారా ప్రకటించని రాజకీయ నిధులను సేకరించిన ఒక కుంభకోణం చెలరేగినప్పుడు మాజీ ప్రధానమంత్రి ప్రజామోద రేటింగ్ క్షీణించింది. కిషిడా వ్యక్తిగతంగా ఈవెంట్లలో పాల్గొననప్పటికీ అతని పార్టీ సహచరులను అదుపు చేయడంలో విఫలమైనందుకు విస్తృతంగా విమర్శించబడింది.

పారిపోతున్న ఉక్రేనియన్ సైన్యం

- ది ఎకనామిస్ట్



ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ దేశానికి రష్యాపై ఆధిపత్యం చెలాయించడానికి తగినంత మానవశక్తి లేదా వనరులు లేవనే వాస్తవం తేటతెల్లమౌతోందని ది ఎకనామిస్ట్ గురువారం రాసింది. జెలెన్‌స్కీ ప్రస్తుతం తన "విజయ వ్యూహ" ప్రతిపాదనను ప్రచారం చేయడానికి అమెరికా సందర్శిస్తున్నాడు. ఇది పశ్చిమ దేశాలు అందిస్తున్న నగదు, ఆయుధాల సహాయ స్థాయిని పెంచుతుందని, తద్వారా కీవ్ పోరాటాన్ని కొనసాగించవచ్చని ది ఎకనామిస్ట్ పేర్కొంది. ఉక్రేనియన్ ఆర్థిక వ్యవస్థ భయంకరమైన సంక్షోభ స్థితిని ఎదుర్కొంటుందని, సైనిక సిబ్బంది సంఖ్య క్షీణిస్తున్నట్టు బ్రిటీష్ మ్యాగజైన్ వివరించింది. వాలంటీర్లను రంగంలోకి దింపుతున్న మాస్కోలా కాకుండా, కీవ్ బలవంతపు నిర్బంధంపై ఆధారపడుతున్నదని ఆ పత్రిక వివరించింది."సైన్యంలో బలవంతంగా చేర్పించిన వారిలో చాలా మంది పోరాడటానికి పనికిరారని అధికారులు ఫిర్యాదు చేస్తున్నారు. వయసు పైబడినవారిలో చాలా మంది అనారోగ్యంతో ఉన్నారు. తాగుబోతులవుతున్నారు. సైన్యం నుంచి బయటపడటానికి స్పష్టమైన మార్గం లేదు. దీని వల్ల సైన్యంలో చేరటం చావటానికి వన్-వే టికెట్ లాగా కనిపిస్తుంది" అని ది ఎకనామిస్ట్ అంటోంది. "యాక్టివ్ డ్యూటీలో ఉన్న 5-10 శాతం మంది సైనికులు సెలవు లేకుండా గైర్హాజరయ్యారు" అని, "30 శాతం కంటే ఎక్కువ మంది ఉక్రేనియన్లు డ్రాఫ్ట్-డాడ్జింగ్ సిగ్గుచేటుగా భావిస్తున్నారు" అని ది ఎకనామిస్టు పేర్కొంది.

సైనిక సేవకు అర్హులైన యువకులు జెలెన్‌స్కీ రాజీలేని వైఖరికి మద్దతు ఇవ్వడానికి చాలా తక్కువ మొగ్గు చూపుతున్నారు. గురువారం ఒక ప్రత్యేక సంపాదకీయ కథనంలో, పత్రిక జెలెన్‌స్కీ తన సైనిక వ్యూహంతో "వాస్తవికతను ధిక్కరిస్తున్నట్టు" ఆరోపించింది. అతను దానిని కొనసాగిస్తే "ఉక్రెయిన్ మద్దతుదారులను తరిమికొట్టడంతో పాటుగా ఉక్రేనియన్ సమాజాన్ని మరింత విభజించవచ్చు" అని హెచ్చరించింది. శాంతి కోసం రాయితీలు కల్పించిన తర్వాత రష్యాపై విజయాన్ని "సంపన్నమైన, పాశ్చాత్య దేశాల వైపు ఒరిగిన ప్రజాస్వామ్యంగా" ఉక్రెయిన్ పునర్నిర్వచించుకోవాలని ది ఎకనామిస్ట్ సలహా ఇచ్చింది. "ఈ భయంకరమైన సత్యాన్ని స్వీకరించినందుకు ప్రతిఫలంగా, పాశ్చాత్య నాయకులు ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక సామర్థ్యం, భద్రతా హామీలను ఇవ్వడం ద్వారా తన యుద్ధ లక్ష్యాన్ని విశ్వసనీయంగా మార్చుకోవాలి" అని సూచించింది.ఉక్రెయిన్‌ను తన కూటమిలోకి లాగాలనే నాటో ఉద్దేశం శత్రుత్వానికి కీలకమైన కారణాల్లో ఒకటని మాస్కో పేర్కొంది. స్థిరమైన శాంతి కోసం దాని దృష్టిలో ఉక్రెయిన్ సైనిక బలం, దాని అలైన్‌మెంట్‌పై పరిమితి ఉంటుంది. సంఘర్షణ ప్రారంభదశలో శాంతి చర్చల సమయంలో కీవ్ ఆ నిబంధనలకు అంగీకరించింది. అయితే పశ్చిమ దేశాల సూచన మేరకు ఉక్రెయిన్ యు-టర్న్ తీసుకున్న విషయం జగద్విితమే.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే అవార్డుల జాబితా నుండి తొలగిస్తారా ?

- శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులపై కేంద్రానికి విద్యావేత్తల బృందం రెండో లేఖ

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని విమర్శించిన ఇద్దరు శాస్త్రవేత్తలను ప్రతిష్టాత్మకమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుల తుది జాబితాలో మినహాయించడంపై విద్యావేత్తల బృందం కేంద్ర శాస్త్ర సాంకేతిక సలహాదారు (పిఎస్ఎ) అజయ్ సూద్‌కు రెండో లేఖ రాసింది. ఈ అవార్డులకు ఎంపిక చేయడంలో విద్యా సంబంధమైన అంశాలను కాకుండా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవడమనే పద్ధతి భారత శాస్త్రీయ రంగానికి అనారోగ్యకరమైన పరిణామమని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

అవార్డుల జాబితాలో ఇద్దరు విద్యావేత్తల పేర్ల తొలగింపు అంశంపై శాస్త్రవేత్తలకు అజయ్ సూద్ సమాధానమిచ్చిన వారం రోజుల తర్వాత మరో విద్యా వేత్తల బృందం ఆయనకు ఈ నెల 24న లేఖ రాసింది. ఈ రెండో లేఖపై 176మంది సంతకాలు చేశారు. వీరిలో చాలామంది శాస్త్రీయ రంగానికి చెందినవారే. కొద్దిమంది విద్యావేత్తలు మాత్రం భిన్న నేపథ్యాలను కలిగివున్నారు.

26మంది శాస్త్రవేత్తలు ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్నారు. ఆగస్టు 7న అవార్డు గ్రహీతల జాబితాను ప్రకటించగా, 10న వారి పేర్లను తొలగించినట్లు స్పష్టమైంది. ఎంపిక ప్రక్రియలో మంత్రి పాత్రను ప్రవేశపెట్టేందుకే వెబ్‌సైట్‌లో వారు ఈ మార్పులు చేశారని వెల్లడైందని రెండో లేఖలో విద్యావేత్తలు పేర్కొన్నారు.

ఆగస్టు 30న మొదటగా కేంద్రానికి ఈ అంశంపై లేఖ రాశారు. ఈ ఏడాది అవార్డు గ్రహీతల జాబితా నుండి ఇద్దరు శాస్త్రవేత్తలను మినహాయించారని విద్యావేత్తలు అందులో పేర్కొన్నారు. రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ సమితి (ఆర్‌విపిసి) ఈ జాబితాను ఖరారు చేసింది. మినహాయించబడిన ఇద్దరు శాస్త్రవేత్తల్లో ఒకరు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే వ్యక్తి కాగా, రెండో ఆయన మానవ హక్కుల అంశంపై కొన్ని సందర్భాల్లో మోడీ సర్కార్‌ని విమర్శించారు. వీరిద్దరు ముంబయిలోని టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ (టిఐఎఫ్ఆర్)కు చెందిన సుబ్రత్ రాజు, బెంగళూరులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌కి చెందిన ప్రతీక్ శర్మలు.

వాస్తవానికి అవార్డు గ్రహీతల జాబితాను ఎంపిక చేసేందుకు అనుసరించే నిబంధనలు మారాయని కమిటీ పేర్కొంది. ఆర్‌విపిసి జాబితాను ఖరారు చేసిన తర్వాత ఆ పేర్లను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రికి నివేదించాలని, ఆయన తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. ఈ మేరకు నిబంధనలను సవరించారని తెలిపింది. మొదటిసారి శాస్త్రవేత్తలు రాసిన లేఖకు పిఎస్ఎ ఈ నెల 17న వివరణ ఇచ్చారు. అయితే ఈ మార్పు దిగ్భ్రాంతికరంగా వుందని రెండో లేఖ పేర్కొంది.

ఈరోజు, రేపు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు : ఐఎండి ఆరెంజ్ అలర్ట్

న్యూఢిల్లీ : ఈరోజు, రేపు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర, గుజరాత్, గోవా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ఈ రాష్ట్రాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది.కాగా, ముంబయిలో భారీ వర్షాలు కురవడంతో పాఠశాలలను బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ మూసివేస్తున్నట్లు గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో గురువారం కూడా వర్షాలు పడనున్నాయి. ఇక మిగతా రాష్ట్రాల విషయానికొస్తే... కొంకణ్, గోవాలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుజరాత్ రాష్ట్రంలో రాబోయే మూడురోజులు భారీ వర్షాలు పడనున్నాయని ఐఎండి అంచనా వేసింది. ప్రత్యేకించి గుజరాత్ రాష్ట్రంలో సౌరాష్ట్ర, కచ్‌లలో ఈరోజు, రేపు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది.

మధ్యప్రదేశ్‌లో రాబోయే మూడు రోజులు కూడా తేలికపాటి మోస్తరు వర్షాలు పడనున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లలో ఈరోజు, రేపు భారీ వర్షాలు పడనున్నాయి. ఇక రాబోయే మూడురోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.

పశ్చిమబెంగాల్, బీహార్, సిక్కిం రాష్ట్రాల్లో ఈరోజు భారీ వర్షాలు పడనున్నాయి. నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండి తెలిపింది.

నేరం రుజువైతే సందీప్ ఘోష్‌కు మరణశిక్ష ?

బెయిల్‌ను తిరస్కరించిన సీబీఐ కోర్టు

కోల్‌కతా : విధుల్లో వున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో నిందితుడైన ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కు సీబీఐ కోర్టు బెయిల్ నిరాకరించింది. ఆయనపై నమోదైన అరోపణలు చాలా తీవ్రమైనవి, అత్యంత అరుదైన కేటగిరీలోకి వస్తాయని, అవి రుజువైతే మరణశిక్ష పడే అవకాశాలు వున్నాయని సీబీఐ కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్. డే వ్యాఖ్యానించారు. ఈ నెల 30వరకు ఘోష్‌ను, సహ నిందితుడు అభిజిత్ మోండాల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ చేసిన అభ్యర్థనను సిబిఐ కోర్టు ఆమోదించింది.

నిందితుడిని బెయిల్‌పై విడుదల చేసేందుకు సమానత్వపు సూత్రాన్ని నీరుగార్చడం అన్యాయమని కోర్టు అభిప్రాయపడిందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసులో తన క్లయింట్‌ను అన్యాయంగా ఇరికించారని ఘోష్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈనేరంలో ఆయన పాత్రేమీ లేదన్నారు. అయితే నేరం జరిగిన సమయంలోనిందితుడు అక్కడ వుండాల్సిన అవసరం లేదని, ఇతరుల సాయంతో కూడా ఆ వ్యక్తి నేరానికి పాల్పడవచ్చని వ్యాఖ్యానించారు. అభిజిత మోండాల్ బెయిల్ విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది. సాక్ష్యాధారాలను తారుమారు చేయడమో, ధ్వంసం చేయడమో జరిగింది. అభియోగాలు ఎదుర్కొంటున్న మోండాల్ తాళా పోలీసు స్టేషన్ మాజీ ఇన్‌చార్జి. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడంలో కావాలనే జాప్యం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

రాజౌరి, రియాసి జిల్లాల్లో ఎన్ఐఎ సోదాలు

జమ్మూకాశ్మీర్ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) శుక్రవారం జమ్మూకాశ్మీర్‌లోని రాజౌరి, రియాసి జిల్లాల్లోని ఏడు ప్రదేశాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జూన్ 9వ తేదీన రియాసి జిల్లాలో పౌని ప్రాంతంలోని టెర్యాత్ గ్రామ సమీపంలో శివఖోరి దేవాలయం నుండి కత్రాకు వెళుతున్న బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో బస్సు లోయలో పడింది. ఈ ఘటనలో తొమ్మిది మంది చనిపోయారు. 41 మంది గాయాలపాలయ్యారు. చనిపోయిన వారిలో రాజస్థాన్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 14 ఏళ్ల కుర్రాడు ఉన్నారు. ఇక ఈ ఘటనపై జూన్ 17వ తేదీన హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ కేసును ఎన్ఐకి అప్పగించింది. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం ఎన్ఐఎ సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, రాజౌరి చెందిన హకామ్ ఖాన్ అనే వ్యక్తి బస్సుపై దాడి చేసేముందు ఉగ్రవాదులకు ఆహారం, ఆశ్రయం, వారికి అవసరమైన వస్తువులను అందించారు. దీంతో ఆ వ్యక్తిని అరెస్టు చేశారు.

ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ప్యానెల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు నాణ్యత సరిగా లేని అంశంపై శుక్రవారం సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. వాయు నాణ్యతను పర్యవేక్షించడానికి, కాలుష్యాన్ని నియంత్రించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాయు నాణ్యత నిర్వహణ కమీషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఏజీ మాసిలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. గాలిలోనే మొత్తం కలుషితం ఉన్నదని, ఎన్సీఆర్ రాష్ట్రాలకు చెప్పినట్లు ఎయిర్ క్వాలిటీ ప్యానెల్ పనిచేయడం లేదని జస్టిస్ ఓకా తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

జల్‌పల్లిలో కుక్కలకు రేబిస్ టీకాల పంపిణీ



నవతెలంగాణ-బడంగ్ పేట్

జల్ పల్లి మున్సిపాలిటీ, షాహీన్ నగర్, ఫ్రైడే మార్కెట్ స్థలం నందు శుక్రవారం అంతర్జాతీయ రెబిస్ డే సందర్భంగా, బ్లూ క్రాస్ సంస్థ సహకారంతో రేబిస్ టీకాలు పంపిణీ కార్యక్రమాన్ని చైర్మెన్ అబ్దుల్లా బిన్ హమాద్ సాధి,కమిషనర్ వాణిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లూ క్రాస్ సంస్థ సహకారంతో మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడద తప్పించే విధంగా చర్యలుతీసుకుంటున్నామన్నారు. అనంతరం బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 284 పెంపుడు కుక్కలకు, వీధి కుక్కలకు టీకాలు వేయడం జరిగిందని, 8 కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసేందుకు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక మునిసిపల్ కమిషనర్ ఏ. వాణి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్,శానిటేషన్ సిబ్బంది,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్లోని వెంకటరమణ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను స్థానిక వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులందరూ సీసీ రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు అందరూ సహకరించాలని సూచించారు. దీనికి కాలనీ వాసులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరిస్తామని తెలియజేశారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, రోడ్డు లెవెల్స్ సరి చూసుకుంటూ నిర్మాణ పనులు చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలవకుండా త్వరగా నిర్మాణ పనులను చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ ప్రాధాన్యంపై అవగాహన పెంచాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- రాజ్‌భవన్‌లో సీపీఆర్ శిక్షణా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సాధారణ ప్రజలందరిలోనూ సీపీఆర్ శిక్షణా కార్యక్రమం ప్రాధాన్యంపై అవగాహన పెంచాల్సిన అవసరం చాలా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ పేర్కొన్నారు. అన్ని కళాశాలల కరికులంలో కూడా దీన్ని ఒక భాగంగా చేర్చడం మంచిదని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో ఏఈడీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎవరికైనా ఎప్పుడైనా ఉన్నట్టుండి గుండెపోటు వస్తే.. ఆ చుట్టు పక్కల ఉండేవారు ఎవరైనా కూడా వాళ్లను తాత్కాలికంగా అప్పటి కప్పుడు కాపాడగలిగే అవకాశం ఉంది. అదే.. సీపీఆర్. అంటే కార్డియో పల్మనరీ రీససిటేషన్. ఇందులో శిక్షణ పొందితే మనం మన చుట్టుపక్కల ఉన్నవారి ప్రాణాలను కాపాడగలిగే ధైర్యం వస్తుందని గవర్నర్ తెలిపారు. సడన్ కార్డియాక్ అరెస్టు వీక్, ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిజియాలజిస్టు డాక్టర్ హయగ్రీవరావు ఆధ్వర్యంలోని బృందం రాజ్‌భవన్‌లోని దాదాపు 200 మంది సిబ్బందికి సీపీఆర్ చేయడంలో శుక్రవారం శిక్షణ ఇచ్చింది. నిపుణులైన వైద్యులు, ఇతర సిబ్బంది వచ్చి.. కొన్ని బొమ్మలను తీసుకొచ్చి వాటి మీద సీపీఆర్ ఎలా చేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ హయగ్రీవరావు మాట్లాడుతూ 'ప్రతియేటా దాదాపు 7 లక్షల మంది ఉన్నట్టుండి వచ్చే గుండెపోటు వల్ల మరణిస్తున్నారు. భారతదేశంలో సాధారణంగా 55-65 ఏండ్ల మధ్య వారికి ఎక్కువగా గుండెపోటు సంభవిస్తోంది. ఇంకా చిన్నవయసు వారిలోనూ కొందరికి గుండెపోట్లు సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి. అలాంటి సమయంలో ఆ చుట్టుపక్కల ఉన్న వారిలో ఎవరైనా సీపీఆర్ చేయడంలో శిక్షణ పొంది ఉంటే, వారి ప్రాణాలను అప్పటికప్పుడే కాపాడగలరు. ఇలా సీపీఆర్ చేయడం వల్ల మెదడుకు శాశ్వత నష్టం జరగకుండా కాపాడగలం. ప్రతి కుటుంబంలోనూ తప్పనిసరిగా కనీసం ఒక్కరైనా ఈ సీపీఆర్ చేయడంలో శిక్షణ పొంది ఉండాలన్నది మా ఆశయం" అని చెప్పారు. కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డాక్టర్ సంబిత్ సాహు మాట్లాడుతూ, సీపీఆర్‌ను సరిగా చేయగలగడం, ఏఈడీని ఉపయోగించడం నేర్చుకోవడం చాలా ముఖ్యం అని చెప్పారు. కార్యక్రమం ముగిసిన తర్వాత.. శిక్షణ పొందిన వారందరికీ సీపీఆర్ సర్టిఫికెట్లను గవర్నర్ అందజేశారు.

డబుల్ ఇండ్లకు 20 కుటుంబాలు తరలింపు

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసి ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినందున మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించే చర్యల్లో భాగంగా అక్కడి ప్రజలను మలక్‌పేట్ నియోజకవర్గంలోని పిల్లి గుడిసెలులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ భవన సముదాంలోకి తరలించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం హిమాయత్ నగర్ మండలంలోని శంకర్ నగర్ కాలనీకి చెందిన ఫాతిమా బేగం, ఎండీ సాధిక్, రేష్మ బేగం, ఫర్జానా బేగం, గౌసోద్దీన్, అబ్దుల్ రహమాన్(6 కుటుంబాలు), వినాయక విధిలోని నాజనీమ్ బేగం, నూర్జహాన్ అహ్మద్ ఖురేషి(3 కుటుంబాలు), నాంపల్లిలోని నాగమణి, మల్లమ్మ టి.పార్వతీ బాయి, పి.ఎల్లమ్మ, సంగీత, సి.రాజు, ఈ.పాండు, సి.యాదయ్య, ఎం.పార్వతమ్మ, బాల నర్సమ్మ, ఎమ్‌బి.నాగమణి(11 కుటుంబాలు) మొత్తం 20 కుటుంబాలను తరలించామన్నారు. మలక్ పేట నియోజకవర్గం సైదాపూర్ మండలంలోని పిల్లిగుడిసెలు డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయంలోకి 9 కుటుంబాలను, నాంపల్లి ఆసిఫ్ నగర్ జియాగూడకు 11 కుటుంబాలను తరలించామని కలెక్టర్ తెలిపారు.

పేద ప్రజలకు అండగా ఉంటా

- ఎంపీ ఈటల రాజేందర్



నవతెలంగాణ-కొత్తపేట.

మారుతీ నగర్, సత్యా నగర్, జనప్రియ అపార్ట్మెంట్స్‌లో శుక్రవారం అధికారులు మార్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే కాలనీకి చేరుకున్న అధికారులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళన చేపట్టారు. దాంతో అధికారులు పోలీసుల సహకారంతో మార్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా ఎంపీ సభ్యులు ఈటల రాజేందర్, కొత్తపేట కార్పొరేటర్, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా, మహేశ్వర్ రెడ్డి లింగాల రాహుల్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్లు ధర్నాకు దిగారు ఈటల రాజేందర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండ దండగా ఉంటానని, తాను పేదల మనిషినని తెలిపారు. మీ కన్నీళ్ల తుడవడానికి తాను వచ్చానని, ఎలాంటి ఇబ్బందులు జరగనివ్వబోనని ఏది జరిగిన తనను దాటుకునే జరగాలని అన్నారు. పార్లమెంటులో తాను, విశ్వేశ్వర్ రెడ్డి, కిషన్ రెడ్డి, రఘునందన్ రావు ఎప్పటికీ అండదండగా ఉంటామని చెప్పారు. ఇది పేదల పోరాటం అన దీనిని ప్రధానమంత్రి దష్టికి తీసుకెళ్తానని ఆయన పర్కొన్నారు ఆయన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు ప్రజలతో ఉండి వారి కష్టసుఖాలను తెలుసుకొని వారితో పటు రోడ్డుపై భైటాయించి ధర్నాకు దిగారు ఇందులో పలువురు నాయకులు కార్యకర్తలు రాజేందర్ వెంబటి ఉండి ధర్నాలు పాల్గొన్నారు .



నంది హిల్స్‌లో బార్ షాప్‌కు అనుమతి ఇవ్వద్దు

నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్ మెయిన్ రోడ్డు 10లో బార్ షాప్ పెట్టడానికి ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇవ్వొద్దని కోరుతూ నందిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సరూర్ నగర్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందిహిల్స్ కాలనీ అధ్యక్షుడు చల్ల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ నందిహిల్స్ కాలని, టీచర్స్ కాలనీల ప్రజలు ప్రస్తుతం ఉన్న విజయ దుర్గ వైన్స్ తోనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిసర కాలనీ వాసులు పడే ఇబ్బందులను దష్టిలో ఉంచుకొని బార్‌కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వకూడదని తెలియజేశామన్నారు. లట్పల్లి నర్సిరెడ్డి, తన్నీరు రంగా రావు, శ్రీనివాస రావు , గోవింద్ రావు, రమేష్ నాయక్, సూర్య నారాయణ ,రాజేందర్ రెడ్డి, నర్సింహ రావు, రమేష్ కుమార్, అభిలాష్ ,సుధాకర్ రెడ్డి. నర్సి రెడ్డి తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని బాలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ బండ్లగూడా ఖల్సా 49వ వార్షిక సర్వసభ్య సమావేశం వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ సింగిరెడ్డి పెంటారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.రైతుల ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కొలను తిరుపతిరెడ్డి, కళ్లెం నిరంజన్ రెడ్డి, పన్నాల గోపాల్ రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, ఇబ్రమ్ బాలయ్య, మేకల మహేందర్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, నిరుడు నర్సమ్మ కొంతం అరుణరెడ్డి, రావుకు లింగం, కొంతం సంపత్ రెడ్డి, ఇన్సిపెక్టర్ రమాదేవి, రమేష్, సీఈవో ఎర్ర జైహింద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాయత్ నగర్‌లో రాచ కాలువ కబ్జా...



నవతెలంగాణ-హాయత్ నగర్

రాచ కాలువ నుంచి దిగువకు వర్షపు నీరు వెళ్లకుండా కొందరు రాచ కాలువ ను కబ్జా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాయత్ నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ ప్రియ కాలనీలో రేకుల షెడ్లు వేసి అట్టి కాలువ కనిపించకుండా పూడ్చివేశారని తెలుస్తోంది. అదే ప్రాంతంలో స్వెక్ట్రా నిర్వాహకులు సైతం కల్వర్టును పూడ్చి వేయగా కాలువ గుండా వెళ్లాల్సిన వర్షపు నీరు రోడ్డుపై పారుతున్నది. గతంలో కూడా అట్టి కాలువపై పిర్యాదు లు వచ్చిన సంబంధిత అధికారులు స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మారలేదని విమర్శలు వస్తున్నాయి. హైడ్రా దెబ్బతో అయిన రాచ కాలువకు విముక్తి కలుగుతుందో చూడాలి.

ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి



- కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ నాథ్

నవతెలంగాణ -నాగోల్.

నాగోలు డివిజన్‌లో ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ నాథ్ యాదవ్ సఫాయి కార్మికులకు సూచించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ నుండి నూతనంగా వచ్చిన చెత్త సేకరణ సైకిల్ బండ్లను హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తో కలిసి కార్పొరేటర్ సఫాయి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి కాలనీవాసులు ఇండ్లలో ఉండే చెత్తను మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే చెత్త సైకిల్ బండ్లపైనే వేసి డివిజన్ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. అదే విధంగా ఎక్కడపడితే అక్కడ కుప్పలు తెప్పలుగా వేయడంతో డివిజన్‌లో పారిశుద్ధ్యం లోపించి ఈగలు దోమలు పుట్టుకొచ్చే అనారోగ్యాలకు కారణం అవుతున్నాయని అన్నారు. చెత్త సేకరణ లో డివిజన్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. సఫాయి కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు సమస్యలు ఉన్నాతమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్ , డీఈ నీలిమ, జవాన్లు లక్ష్మయ్య , సఫాయిలు , జీహెచ్ఎంసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రస్తుత సమాజంలో విద్యార్థుల,మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు అన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బడంగ్ పేట్ నందు ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు, మహిళలపై జరుగు నేరాలపైన అవగాహన,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మూఢ నమ్మకాలు, సైబర్ క్రైమ్ నేరాలు, చైల్డ్ మ్యారేజ్, మత్తు పదార్థాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. సమాజంలో ఎంతో మార్పు జరిగిన ఇప్పటికీ మూఢ నమ్మకాలు, మహిళలపై, విద్యార్థులపై అఘాయిత్యాలు ఆగడం లేదన్నారు. ప్రజల్లో చైతన్యం పరిజ్ఞానం పెంచి అఘాయి త్యాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని తెలిపారు. సదస్సులో పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జీ.శ్రీనివాస్ రెడ్డి, కె.సుధాకర్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు,పాఠశాల సిబ్బందితో పాటు షీ టీం, వనస్థలిపురం డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-హాయత్ నగర్





పగలు కూడా వెలుగుతున్న వీధి దీపాలు అనే కథనం శుక్రవారం నవతెలంగాణ లో ప్రచురించిన విషయం విదితమే. అట్టి వార్తకు జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. మన్సూరాబాద్ లోని ఎరుకల నాంచారమ్మ బస్తి, వెంకటరమణ కాలనీ లలో పగలు కూడా వీధి దీపాలు వెలుగు తున్నాయి.దీనికి డీ ఈ పుణ్యా నాయక్ స్పందించి సిబ్బందిని పంపి అట్టి వీధి దీపాలకు మరమ్మతులు చేపించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు రావడం లేదని దయచేసికాలనీ వాసులు తమ తమ ఇంటి వద్ద ఉన్న వీధి దీపాలను ఉదయం పూట ఆఫ్ చేసుకోవాలని కోరారు.

హస్తినాపురంను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ బాణోత్ సుజాత నాయక్



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ లో నెలకొన్న డ్రయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేశారు. డివిజన్ అభివృద్ధి విషయం లో రాజీ పడకుండా పనులలో పారదర్శకత వహిస్తూ ఆదర్శమైన డివిజన్ గా హస్తినాపురం ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సుజాత నాయక్ తెలిపారు. శుక్రవారం హెచ్. ఎం.డబ్ల్యు.ఎస్ జి.ఎం బలరామరాజు,మేనేజర్ సురేష్ , జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లికార్జున్ గౌడ్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తో కలిసి కార్పొరేటర్ అగ్రికల్చర్ కాలనీ లో పర్యటించారు. వారు మాట్లాడుతూపలు కాలనీలలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టి మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండ చూస్తామని, వర్షాకాల నేపథ్యం లో లోతట్టు ప్రాంతాల కాలనీ వాసుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. వారితో అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి,రాము గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు నల్లబ్యాడ్జీలతో నిరసన



నవతెలంగాణ-సిటీబ్యూరో

రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని కోరుతూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండోరోజు ఖైరతా బాద్ విద్యుత్ సౌధలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సింగరేణి భాగస్వామ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని, జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో తలపెట్టనున్న 1X800 నూతన పవర్ ప్లాంట్ వ్యతిరేకిస్తూ.. జాక్ నాయకులు నినదాలు చేశారు. విద్యుత్ శాఖ మంత్రి చొరవతో తీసుకొని జెన్‌కో ద్వారానే ఆర్టీఎస్ నిర్మిం చాలని, ప్రభుత్వ రంగ సంస్థను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకట్ నారాయణ రెడ్డి, బాలకృష్ణ, సదానందం, రాజేష్, నగేష్, శ్రీనివాస్, పి.వి. రావు, సురేష్, ప్రశాంత్, పవన్, విద్యాసాగర్ , రాజేశ్వరరావు, కిరణ్, రవి, ధనలక్ష్మి సుధా, స్వప్న స్వాతి, మౌనిక, శిరీష, మల్లయ్య, లక్ష్మి, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-వనస్థలిపురం

బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ లో నూతన సీసీ రోడ్డు పనులను, డివైడర్ పనులన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ ఆశలత, డీఈ దామోదర్ రెడ్డిలతో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటి స్తూ, లెవెల్స్ సరి చూసుకుంటూ కాలనీవాసులకు ఎలాంటి



ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు తెలిపారు. డివైడర్ పనులలోనూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు.ఏఈ నరేందర్ తేజ, కాలనీ సభ్యులు దామోదర్ రెడ్డి, రంగారెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లారెడ్డి, రాధాకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పార్క్ నిర్మాణ పనుల పరిశీలన

బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్ ఫేస్1లో నూతనంగా నిర్మిస్తున్న పార్కును కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ దామోదర్ రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, సెక్రటరీ ధనరాజ్, రవి కిరణ్, జిహెచ్ఎంసి ఏ ఈ నరేందర్ తేజ, శానిటేషన్ జవాన్ యాదగిరి, ఎస్ ఎఫ్ ఏ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





చెవి కత్తిరించని కుక్కలుంటే ఫిర్యాదు చేయాలి

నవతెలంగాణ-హాయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయ నగర్ కాలనీ లో కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి అనే కథనాన్ని శుక్రవారం నవతెలంగాణ ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హాయత్ నగర్ సర్కిల్ వెటర్నరీ అధికారి యాదగిరి మాట్లాడుతూ కుక్కలకు ఆహారం, నీరు లేకపోతే అవి మనుషులను కరుస్తాయని,చెవి కత్తిరించిన కుక్కలకు చికిత్స చేశామని, చికిత్స చేయని కుక్కలు ఉంటే తమకు పిర్యాదు చేయాల న్నారు.

కులగణన జరగాల్సిందేనని ప్రకటించడం బీసీ కులాల ఉద్యమానికి తొలి విజయం

- డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-హాయత్ నగర్

ఆర్ఎస్ఎస్ అనే బ్రాహ్మణ మనువాద సంస్థ బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమరభేరిలో రిజర్వేషన్లను సవరణ చేయాలని అదేవిధంగా కుల జనగణన అవసరం లేదని చెప్పిందని.. అయితే అదే ఆర్ఎస్ఎస్ కేరళ అసెంబ్లీ ఎన్నికలలో కుల జనగణన జరపడం తథ్యం అని కులగణన చేయకపోతే దేశంలో అనిశ్చితి ఏర్పడుతుందని చెప్పడం గమనార్హం అని డీసీసీ అధికార ప్రతి బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమి భాగస్వామి పార్టీలతో సమావేశంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశవ్యాప్త కుల జనగణన జరగాలని, 50 శాతం రిజర్వేషన్లు సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసి కులగణన జరిగే ప్రసక్తే లేదని ఒకవైపు బీజేపీ నాయకులు అంటున్నారన్నారు. అయితే మరోవైపు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నేతలు కులగణన జరపాలని ప్రకటించడం బీసీ కులాల ఉద్యమానికి ప్రతీక అని అన్నారు. దేశవ్యాప్తంగా కుల జనగణ జరపాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ కోరితే వద్దని అనలేమని బీజేపీ నాయకులు అంటున్నారన్నారు.

దేశ జనాభాలో 60 శాతానికి పైగా బీసీ కులాలు ఉన్నాయని, బ్రిటిష్ ప్రభుత్వం 1931లో జనాభా లెక్కలు చేసినప్పుడు 52 శాతం ఓబీసీలు ఉన్నారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశ జనాభా 30 కోట్లు అని.. అందులో 52 శాతం బీసీ కులాల వారు ఉన్నారని తెలిపారు. 2014 కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ పార్లమెంటులో ఆందోళన నిర్వహించిందని గుర్తు చేశారు. అయితే 2014 నుండి 2024 వరకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీ దేశవ్యాప్తంగా ఓబీసీల కులగణన చేయడం, 52 శాతం రిజర్వేషన్ల సీలింగ్ విధానాన్ని ఎత్తివేయడం మర్చిపోయిందన్నారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఓబీసీ కులాల జనభా లెక్కలు జరపాలని ఇండియా భాగస్వామి పార్టీలైన ముఖ్యంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కుల జనగణన జరపాలని దేశవ్యాప్తంగా తిరుగుతు ఉద్యమాన్ని మొదలుపెట్టాడని తెలిపారు.

కుల జనగణన అంశం అనేది కులాల మధ్య అగాథం ఏర్పడుతుందని బిజెపి నాయకత్వం భావిస్తున్నదని.. అదే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ అగ్రనాయకత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కుల జనగణన నిర్వహించడం తన వల్ల కాదని దేశ సర్వోన్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసి చేతులు దులుపుకున్నది బీజేపీ అని చెప్పారు. మండల ఉద్యమం వచ్చినప్పుడు బీసీ కులాల జనాభాలో అక్షరాస్యత ఎక్కువగా లేనందువల్ల ఉద్యమం రాజకీయంగా తగిన ఫలితాన్ని సాధించలేకపోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టబద్ధమైన రాజకీయ రిజర్వేషన్లు ఉండడం మూలంగా పంచాయతీ నుంచి పార్లమెంటు సభ్యుడు వరకు జనాభా ప్రతిపదికన విద్యా ఉద్యోగ రాజకీయాలు రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా కుల జనగణన జరిగితే జాతీయ స్థాయిలో ఉన్నటువంటి పార్టీలు వారి వారి జనాభా ప్రకారం పంచాయతీ నుండి పార్లమెంటు సీట్లు కేటాయించవలసి ఉండటం వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేస్తున్న ఐఏఎస్ ,ఐపీఎస్ న్యాయస్థానాల్లో బీసీ కులాల జనాభా లెక్కలు తీయాల్సి ఉంటుందని.. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలలో బడ్జెట్‌లో నిధులు కేటాయించవలసి ఉంటుందని తెలిపారు. 77 సంవత్సరాల భారత స్వాతంత్ర్య దేశంలో 90 శాతం ప్రజలు సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ పథకాల అమలులో వివక్షను చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు అధికారులు ఎందుకు లేరని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ప్రశ్నించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు చట్టసభలలో రిజర్వేషన్లు అమలు చేయడానికి ముందుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దేశవ్యాప్తంగా కుల జనగణన జరగాలని చట్టసభలో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని చెప్తున్న పార్టీ కూడా కాంగ్రెస్‌కావున దేశవ్యాప్తంగా కుల జనగణన జరిగి 50 శాతం రిజర్వేషన్లు సీలింగ్ విధానాన్ని ఎత్తివేయలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్‌లో రూ.9లక్షల వ్యయంతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్, కాంగ్రెస్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, తిరుమలానగర్ అసోసియేషన్ సభ్యులు నర్సింగ్ రావు, బాబురావు, రత్నం, రాము, మాధవన్, అంజయ్య, వెంకట్, జగన్నాథం, గంగరాజు, ఉమా, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 21వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి రాక

- నల్సార్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-శామీర్‌పేట

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేడు నల్సార్ యూనివర్సిటీలో నిర్వహించే 21వ స్నాతకోత్సవానికి ముఖ్యతిథిగా వస్తునందు న్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ యూనివర్సిటీలో నిర్వహించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏర్పాట్ల వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కృష్ణదేవరావు కలెక్టర్‌కు వివరించారు. ఆడిటోరియంలోని సీటింగ్‌ను, లైటింగ్, పీఏ సిస్టం, డయాస్, భద్రత ఏర్పాట్లను కలెక్టరు పరిశీలించారు. రోడ్లకు మరమ్మతులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్తు, పుష్పలంకారణ, వైద్య శిబిరాలు, అంబులెన్సు, మొబైల్ టాయిలెట్స్, పాసులు, సంబంధిత శాఖల అధికారులు నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు.

కాలనీల సమస్యలను పరిష్కరిస్తా



-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం కాప్రా డివిజన్ మెహెర్ బాబా కాలనీలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ వర్క్ వాళ్లతో మాట్లాడి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రోహిత్, బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ఇంద్రయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బైక్‌లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోడిమెట్ల చౌరస్తా నుంచి అన్నోజిగూడ నారపల్లి తదితర ప్రాంతాల్లో కొనసాగిన ఈ ర్యాలీలో మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొని పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అప్పుడే బాపూజీ కలలుగన్న స్వచ్ఛ భారత్ సాకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పలువురు, కార్పొరేటర్లు తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కౌకుంట్ల



నవతెలంగాణ-కీసర

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం పురపాలక సంఘంలో వరల్డ్ టూరిస్ట్ డే లో భాగంగా (పబ్లిక్ ప్లేస్) శిల్పానగర్ పార్కులో మాస్ క్లీనింగ్ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆరో వార్డులోని శిల్పా నగర్ కాలనీలోని పార్కులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ .జి. రాజేంద్ర కుమార్, 6 వార్డు కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, 14 వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ముల్లి పావని



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన టూరిస్ట్ డే సందర్భంగా ఘట్కేసర్ టీ జంక్షన్ వద్ద పావని జంగయ్య యాదవ్, ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. టీ జంక్షన్ సర్కిల్ సమీపంలో చెత్త పాయింట్లు క్లీన్ చేశారు. చెత్తను రోడ్డు పరిసరాలల్లో వేయకుండా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్.. మాట్లాడుతూ.. చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్త బుట్టలో వేయాలన్నారు. అంతకుముందు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద రోడ్డును శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, దాని వల్ల పర్యావరణం దెబ్బ తింటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, అనురాధ రాఘవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూ వాసవీ శివనగర్ సమస్యలు పరిష్కరించాలి



- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌కు వినతిపత్రం సమర్పించిన కాలనీవాసులు

నవతెలంగాణ-కాప్రా

న్యూ వాసవీ శివనగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. న్యూ వాసవీ శివనగర్ కాలనీలో సీసీ రోడ్లతో పాటు మిగతా సమస్యల పరిష్కారానికి చర్యలను చేపట్టినట్టు తెలిపారు. చర్లపల్లి డివిజన్‌లోని వివిధ కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తూ ప్రతీ కాలనీ సమస్యలను పరిష్కరిసామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ కీర్తి, కాలనీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, హీరాలాల్, ముత్యాలు, నజీర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో..

వికలాంగులకు 5శాతం కేటాయించాలి

- రూ. 6 వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలి
- ఎన్ఆర్‌పీడీ రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకట్
- మేడ్చల్ జిల్లా మూడో మహాసభల్లో జెండావిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వికలాంగులకు 5శాతం కోటా కేటాయించాలని, ఉద్యోగ నియామకాల్లో శరీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని, రూ.6వేల పెన్షన్ పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్ఆర్‌పీడీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల కోసం ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్ జిల్లా 3వ మహాసభ కమలానగర్ భాస్కర్ రావు భవన్‌లో చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యతిథిగా ఎన్ఆర్‌పీడీ కార్యదర్శి అడివయ్యతో కలిసి ఎన్ఆర్‌పీడీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు ఉన్నాయని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. నిధుల పర్యవేక్షణ చేయడంలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలం చెందుతుందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ వెల్లడించిందన్నారు. జమ్మూకాశ్మీర్, గోవా, బీహార్ రాష్ట్రాలలో రూ.2.83 కోట్లు ప్రభుత్వ ప్రచారం కోసం వినియోగించారని కాగ్ నివేదిక వెల్లడించిందని చెప్పారు. ప్రపంచ జనాభాలో 16శాతం మంది వికలాంగులు ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని తెలిపారు. కానీ దేశంలో ఎక్కడా ఇటువంటి సర్వేలు చేయడం లేదన్నారు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఆశా వర్కర్ల ద్వారా వికలాంగుల వివరాలను సేకరించాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలులో లోపం ఉందని సుప్రీం కోర్టు చెప్పినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. 2011 నుండి కేంద్ర ప్రభుత్వం పెన్షన్ రూ.300 వాటా ఉందని, రూ.300 ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం అమలులో ఉన్న నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ, అంటీజం యాక్ట్ వంటివి అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ డిసేబుల్డ్ స్టడీ ఇండియా రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది రాష్ట్ర జనాభాలో 12.2 శాతం వికలాంగులు ఉన్నారని గర్తు చేశారు. రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నావని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కులాలకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగులకు ఇవ్వడం లేదన్నారు. రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టడం లేదని వాపోయారు. పెన్షన్ రూ.6వేలు పెంచి ఇవ్వాలన్నారు 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం అమలు కోసం, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్స్ అమలు కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం చట్టం అమలుకు కో ఆర్డినేషన్ కమిటీలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్ఆర్‌పీడీ మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా కడలి నాగలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుల్తాన్, రమేష్, కోశాధికారిగా మల్లేష్, ఉపాధ్యకుడిగా లక్ష్మీపతిరావు, జి. బాలయ్య, సహాయ కార్యదర్శిగా విజయ లక్ష్మి, వెంకటయ్య, గంగారెడ్డి, కమిటీ సభ్యులుగా రమేష్, నవ్య, మోజెష్, కృష్ణ గౌడ్, రజిత, నాగయ్య వెంకటేష్, అనిల్, శివ కుమార్‌ను ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ(ఎం) పార్టీ పనిచేస్తుందని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని అంతయ్య కాలనీలో పార్టీ శాఖ మొదటి మహాసభలు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో బి. మంజుల అధ్యక్షతన



నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్యతిథులుగా కోమటి రవి, మల్కాజిగిరి మండల కార్యదర్శి ఎం. కృపా సాగర్, మండల కమిటీ నాయకులు బంగారు నర్సింగరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందన్నారు. అందులో ప్రధానంగా ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు అమలు కోసం ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు రూపొందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అంతయ్య కాలనీ పార్టీ శాఖ కార్యదర్శి సోమనపల్లి నాగమణి, సిపిఎం పార్టీ నాయకులు ఎర్రోళ్ల సుమిత్ర, కే.పద్మ, బి సునంద, నరసమ్మ లతా, మదనమ్మ, బుజ్జి, విజయలక్ష్మి, సుజాత, వాణి, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలపై పెరిగిన దాడులు

- హక్కుల సాధనకు మహిళలు ఐక్యం కావాలి
- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్.సృజన



నపవతెలంగాణ-ఘట్కేసర్

గత పదేండ్లుగా బీజేపీ మతోన్మాదుల పాలనలో మహిళలపై 250రెట్లు దౌర్జన్యాలు పెరిగాయని, బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేదని, రాజ్యాంగబద్ధంగా మహిళలకు ఉన్న హక్కులు సాధించుకోడానికి మహిళలు ఐక్యం కావాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్.సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం ఘట్కేసర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల మూడో మహాసభ మండల అధ్యక్షురాలు జి.నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్. సృజన హాజరై ఐద్వా జెండాను ఎగరవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సమాన అవకాశాలు లేవన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో ఇద్దరు మహిళలాలను నగ్నంగా ఊరేగించారని చెప్పారు. ఇలాంటి ఘటనలను పౌరసమాజం సహించకూడదన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐద్వా పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కోసం పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్. సబిత మాట్లాడారు. అనంతరం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఘట్కేసర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, అరుణ, కోశాధికారిగా అనసూర్య, ఉపాధ్యక్షురాలుగా సునీత,సహాయ కార్యదర్శిగా అలివేల, కమిటీ సభ్యులుగా జీవాని సరళ, రాజ్యలక్ష్మి, స్వరాజ్యం, రేణుక, గౌరీ, తదితరులున్నారు.

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

- రూ. 30 కోట్ల 55 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం
- పాలకపక్షం ఏకపక్ష నిర్ణయాలపై విపక్ష కార్పొరేటర్ల నిరసన



నవతెలంగాణ-బోడుప్పల్

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నదని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల నిరసనల మధ్య శుక్రవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమిషనర్ రామలింగంలు అభివృద్ధి పనుల కేటాయింపులో తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్లు వ్యతిరేకించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా పాలకపక్ష సభ్యుల డివిజన్లకే నిధులు కేటాయిస్తున్నారని బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు మండిపడ్డారు. కాసేపు మేయర్, కమిషనర్లకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొత్త లక్ష్మీరవిగౌడ్, కాటపల్లి లత రామచంద్రారెడ్డి, బందారం అంజలి శ్రీధర్ గౌడ్, కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్, బీజేపీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డిలు కౌన్సిల్ హాల్లో నినాదాలిచ్చారు. చివరకు పాలకపక్షం ఒకమెట్టుదిగి ప్రతిపక్షపార్టీల సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లకు రూ.10లక్షలు విలువ చేసే అభివృద్ధి పనులను నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోద ముద్రవేశారు. మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో 28 అంశాలపై చర్చించి కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో సుమారు రూ.30 కోట్ల 55 లక్షల విలువైన 173 అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదేవిధంగా కార్పొరేషన్ పరిధిలోని మాస్టర్ ప్లానరోడ్ల వెడల్పును తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్ గౌడ్, కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వరల్డ్ ఫొటోగ్రఫీ డే పురస్కరించుకుని ఫోకస్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాప్రాలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫంఅసోసియేషన్ ప్రతినిధులకు, క్రికెట్‌లో గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలిపి బహుమతులు అందజేశారు.

-నవతెలంగాణ,కాప్రా

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్ పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

కమలా నగర్ స్ఫూర్తి లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చర్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్‌ను రిటైర్డ్ హెడ్ మాస్టర్ విజయ్ కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన అల్లుడు దివంగత సిరిపురం హరిప్రసాద్ జ్ఞాపకార్థంగా పేద విద్యార్థులకు మెటీరియల్స్ అందజేశామన్నారు. అనంతరం డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీరంగంలో రాణించాలంటే ఇంగ్లీష్ తప్పనిసరిగా మారిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ డీజీ ప్రోగ్రాం చైర్మెన్ పజ్జూరి పావని రెడ్డి, మల్కా రమాదేవి, హెడ్ మాస్టర్ ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి లైయన్స్ క్లబ్ సభ్యులు పీపీ రాజు, వంజరి ప్రవీణ్, నరేష్, ఎస్.రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని ఏఎస్ రావునగర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చక్రిపురం శిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ క్యాంపులో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డాక్టర్ అనిల్ బృందం కళ్ళ పరీక్షలు, దమ్మాయిగూడ పద్మసాయి డెంటల్ క్లినిక్ డాక్టర్ దినేష్ బృందం దంతాల పరీక్షలు, ట్రినెట్ డయాగ్నోస్టిక్స్ వారు రక్త పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నాగార్జున నగర్ సన్‌సీడ్ హాస్పిటల్ డాక్టర్లు చేసి ఉచితంగా మందు లు పంపిణీ చేశారు. శ్రీవిద్యా బ్లడ్ బ్యాంకు వారు బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. 82 మంది పాల్గొని అన్ని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం పలు వురు రక్తదానం చేశారు. ఈ కాంపులో క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, కార్యదర్శి చనమోలు వరప్రసాద్, చందన్ రాజు, కంతేటి విజయకుమార్, సునీల్, మణి, మోహన్ జగ్గరాజు, భిక్షపతి, తదితరులున్నారు.

పీర్జాదిగూడలో మంగళగౌరీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీతార కృతిశెట్టి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొల్పిన మంగళగౌరీ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రముఖ సినీతార కృతిశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకేంతో ఆనందంగా ఉందని, ఇంత అందమైన, అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉండే అత్యంత సౌకర్యవంతమైన షోరూమ్‌ను పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో నెలకొల్పినందుకు నిర్వాహకులను అభినందించారు. మంగళగౌరి షాపింగ్ మాల్ వారి ప్రారంభోత్సవ, దసరా-దీపావళి ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు. అనంతరం డైరెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వెడ్డింగ్ కలెక్షన్స్‌కు సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రశ్రేణిని అందజేయడం తమ లక్ష్యమని తెలిపారు. షోరూమ్‌లో అన్ని తరాల కుటుంబ సభ్యుల అభిరుచులకు సరిపడే నాలుగు లక్షల వెరైటీలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివాహాది శుభకార్యాలకు, ప్రత్యేక వేడుకలకు మంగళగౌరీ అడ్డాగా నిలుస్తుందని తెలిపారు.శారీ కలెక్షన్స్‌లో అనేక రకాల పట్టు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వారానికి ఒక్కరోజు, నెలకు నాలుగు రోజులే

విధులకు హాజరవుతున్న ఏపీఎం

- విచారణ చేసి చర్యలు తీసుకుంటాం పీడీ సాంబశివరావు



నవతెలంగాణ-మేడ్చల్

ప్రతినెలా ప్రభుత్వం నుండి వేతనం తీసుకుంటూ విధులకు మాత్రం వారంలో ఒక్కరోజు, నెలలో నాలుగు రోజులు మాత్రమే హాజరైతున్నాడని మండల స్థాయి ఉద్యోగులపై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే మేడ్చల్ మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న అధికారి వారంలో ఒకరోజు, నెలలో నాలుగు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నాడని పలువురు కింది స్థాయి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. వచ్చిన రోజు కూడా కేవలం రెండు, మూడు గంటలు విధులు నిర్వహించి వెళ్లిపోతున్నాడని విమర్శలు గుప్పుమంటున్నాయి. దీంతో కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల మండల పరిధిలోని డబీల్ పూర్‌లో సీసీ నిర్లక్ష్యం కారణంగా ఓ గ్రూపు లీడర్, వీవోఏ గ్రూప్ సభ్యులకు తెలియకుండా రూ.3లక్షల విత్ డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. సదరు ఏపీఎం ప్రతిరోజు ఆఫీస్‌కు వచ్చి మండల పరిధిలోని ఓ గ్రామంలో పర్యటించాల్సి ఉంటుంది.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

ఏపీఎంపై విధుల నిర్వహణ పట్ల వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. ఏపీఎం ప్రతి రోజు మండల మహిళా సమైక్య కార్యాలయానికి వచ్చి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

బోరబండలో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
బోరబండ స్వరాజ్ నగర్ లో అధికారులతో కలిసి కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ శుక్రవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులు చేపట్టా లని, అధికారులను ఆదేశిం చారు. ఈ పర్యటనలలో జీహెచ్‌ఎంసీ ఏ.ఈ. భరత్ , టీజీఎస్‌పీడీసీఎల్ ఏ.ఈ.- సాయి తేజ, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ - జూబ్లీహిల్స్
జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ క్యాంపు కార్యాలయంలో, శుక్రవారం వెంగల్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యా రావు జన్మదినం సందర్భంగా, కేక్ కటింగ్ చేసి బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా నిర్వహించారు .

కంటోన్మెంట్‌లో నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధం

- గణపతి దేవాలయ చైర్మెన్‌గా బల్వంత్ రెడ్డి ..!
- బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్‌గా దండుగుల యాదగిరి..!
- పదవులు ఆశిస్తున్న వలసవాదులు...
- పెదవి విరుస్తున్న సీనియర్ నాయకులు...



నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు నామినేటెడ్ సభ్యులు చైర్మెన్లు పదవి భర్తీ చేసే కార్యక్రమం మొదలయింది. ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీ గణేష్ నియోజకవర్గంలో ఉన్న గణపతి దేవాలయం, సంతోషిమాత, శ్రీ పెరమాల వెంకటేశ్వర స్వామి ఆలయం ,. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాలకు చైర్మెన్‌లు, డైరెక్టర్లను నియామకాలకోసం పలువురు నాయకుల పేర్లను అధిష్టానానికి సిఫార్సు చేశారు. అయితే దాదాపుగా ఎమ్మెల్యే చేసిన సిఫార్సును అధిష్టాన వర్గం ఆమోదించినట్టు సమాచారం. పలు ఆలయాలకు చైర్మెన్లు డైరెక్టర్లను ఖరారైన చేసినా నాయకుల పోటీ ఎక్కువగా ఉండటంతోవారిని బుజ్జగించే పనుల్లో ఎమ్మెల్యే ఉన్నారని తెలిసింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పెరమళ్ళ దేవస్థానం శ్రీ వెంకటేశ్వర దేవాలయంతోపాటు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవికి ఉపాధ్యక్ష పదవికి భారీగా పోటీ ఉండడంతో ప్రకటించే విషయంలో పార్టీ అధిష్టానం ఆచి చూచి వ్యవహరిస్తోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కంటోన్మెంట్‌లో పలు పార్టీల నాయకులకు పదవులు ఆశ చూపి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొచ్చారు. అయితే గతంలో బీఆర్ఎస్‌లో ఉండి పదవులు అనుభవించి కాంగ్రెస్‌లో కి వలస వచ్చిన వారు కూడా చైర్మెన్ పదవులకు మళ్లీ పోటీపడుతుండడంతో సీనియర్ నాయకులు కొంత దిగులు పడుతున్నారు దాంతో పార్టీ అధిష్టానం వర్గం పదవుల ప్రకటన విషయంపై ఆచితూచి వ్యవహరిస్తోంది అయితే సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాత్రం నిరసనతో ఉన్నారు. ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకుని ఉన్న వారికి చిన్న పదవులు ఇచ్చే ఆలోచనలు అధిష్టానం ఉందని పెదవి విరుస్తుతున్నారు. కాగా బోయిన్పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ పదవికి మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అనుచరులు ఆనంద్ గౌడ్ పేరు, మరో సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి పేరే ప్రస్తుతం ప్రస్థానంలో కనిపిస్తోంది. ఇదిలా ఉంటే సికింద్రాబాద్ గణపతి దేవాలయానికి సీనియర్ నాయకుడు అల్లాడి గౌరీ శంకర్ తో పాటు పలువురు కూడా చైర్మెన్ పదవి ఆశిస్తున్నట్టు సమాచారం.

స్వచ్ఛతలో అందరూ భాగస్వాములు కావాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..
- ఖైరతాబాద్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్



నవతెలంగాణ-బంజారా హిల్స్
స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. స్వచ్ఛతలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగాశుక్రవారం ఖైరతాబాద్ లోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ముందుగా ఇందిరానగర్ కాలనీలో పర్యటించి కాలనీ స్థితిగతులను, పారిశుధ్య నిర్వహణ ను పరిశీలించారు.

ఈ సందర్భంగ గవర్నర్ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు మన బస్తి, మన గ్రామం, మన రాష్ట్రం,మన దేశం పరిశుభ్రంగా స్వచ్ఛతతో సురక్షితంగా ఉండాలన్నారు. మన హక్కుల తో పాటు బాధ్యతలు ఉంటాయని, స్వచ్ఛ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించరాదని,పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మన పని మనం చేసినప్పుడే ప్రభుత్వ మద్దతు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛతపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. స్వయం గా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత సేవ చేయాలని, స్వచ్ఛత దేశ సేవలో ఒక భాగమన్నారు. సమాజాభివృద్ధికి స్వచ్ఛత కార్యక్రమం అవసరమని చెప్పారు. స్వచ్ఛతపై ఒకరి నుండి ఒకరికి అవగాహన కలగాలని, అందరినీ జాగృతం చేయాలని కోరారు. ఇందిరానగర్ కాలనీ స్వచ్ఛతతో సుందరంగా తీర్చి దిద్దితే కాలనీ ప్రజలు సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు. ఇందిరా కాలనీ ఇతర బస్తీలకు మార్గదర్శకం కావాలని, అందుకు అందరూ సహకరించాలని గవర్నర్ కోరారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాజ్ భవన్ కు సెక్రటేరియట్ కు చాలా దగ్గరగా ఉన్న ఈ కాలనీని స్వచ్ఛతలో అభివృద్ధి సాధించేలా గవర్నర్ ఇందిరానగర్ కాలనీ ని దత్తత చేసుకున్నారని తెలిపారు. కాలనీ స్వచ్ఛతతో పాటు కాలనీలోని ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గవర్నర్ కార్యాలయం నుండి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇందిరానగర్ కాలనీలోని ఇంటింటికి వచ్చి ఏ సమస్యలు ఉన్నాయన్నది తెలుసుకుని, కుటుంబ స్థితిగతులపై వివరాలు సేకరించి, ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఆదిశగా, ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. రానున్న ఆరు నెలల్లో కాలనీ రూపు రేఖలు మారాలని, స్వచ్ఛతకు మరో పేరుగా ఉండాలన్నారు. ఆ దిశగా కాలనీవాసులు కృషి చేయాలని కోరారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, మాట్లాడుతూ స్వచ్ఛ హి సేవ కార్యక్రమాన్ని నగరంలో పాఠశాల కలశాల విద్యార్థులకు ప్రజల కు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు సంక్షేమం పై దృష్టి పెట్టినట్టు చెప్పారు. కార్పొరేటర్ విజయ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమానికి గవర్నర్ రావడం ఆనందంగా ఉందని అన్నారు. స్వచ్ఛత కార్యక మం వచ్చాక ప్రజల్లో చాలా అవగాహన వచ్చి మార్పు వస్తుంద న్నారు. సచ్చితకు జీహెచ్ఎంసీ చేస్తున్న కృషికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. చేయడానికి గవర్నర్ మద్దతు తో కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశించారు.

అంతకుముందు గవర్నర్ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వాలంటీర్లు ఫ్లాష్ మాబ్ పర్ఫామెన్స్ చేశారు. ఈ కార్యక్రమం లో జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు, మహిళలు, ఎన్జీవోలు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రామన్నగుంట చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవ



- హాజరైన ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్..
కంటోన్మెంట్ పరిధిలోని న్యూ బోయిన్‌పల్లిలోని రామన్నకుంట చెరువు వద్ద కంటోన్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో అధికారులు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమానికి నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. స్థానికులు వారు నివసించే ఇండ్లతోపాటు వాటి పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ దక్షిణ కమాండ్ డైరెక్టర్ అమూల్ బి జగ్తాప్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయిక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ వంశీ, ఆరోగ్య విభాగ అధిపతి దేవేందర్, పారిశుధ్య విభాగాధిపతి మహేందర్, బోర్డు మాజీ సభ్యుడు పండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అస్సాం సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ
డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో కలిసి, శుక్రవారం అస్సాం సచివాలయంలో అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, మున్సిపల్ పరిపాలనలో బలమైన సంస్కరణలు, నగరాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. హైదరాబాద్ నగరంలోని సమగ్ర శుభ్రత, డ్రయినేజీ వ్యవస్థ, నీటిపారుదల వంటి అంశాలపై అస్సాం ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులను అవగాహన చేసుకోవడంపై దృష్టి సారించామని డిప్యూటీ మేయర్ తెలిపారు. మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఇనిషియేటివ్‌లు, స్మార్ట్ సిటీ పరిణామాల పై కూడా ఇద్దరు నేతలు వివరణాత్మక చర్చలు జరిపారు. పర్యావరణ అనుకూలత, సుస్థిరతకు సంబంధించిన విధానాలు, శాశ్వతమైన మునిసిపల్ మౌలిక వసతుల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నగర పరిపాలనలో సమర్థత పెంపు అంశాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది.ఈ సమావేశంలో అస్సాం మునిసిపల్ అధికారులతో పాటు జీహెచ్ఎంసీప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాలు పరస్పరం తమ అనుభవాలను పంచుకునే దిశగా ఒప్పందాలు చేసుకుని, ఒకరిపై ఒకరు ఆధారపడే విధానాలను అన్వేషించుకోవడం చర్చల ప్రధాన లక్ష్యంగా ఉంచామని, ఈ మార్పులు భవిష్యత్తులో మునిసిపల్ పరిపాలనలో సుస్థిరమైన అభివృద్ధికి దోహదం చేస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

సికింద్రాబాద్‌లో నకిలీ ట్రాన్స్‌జెండర్ల వేధింపులు..

- వసూళ్లకు పాల్పడుతున్న ఏడుగురి అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో
సికింద్రాబాద్‌లో స్త్రీ వేషధారణలో వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు పురుషులతో పాటు మరో ముగ్గురు ట్రాన్స్ జెండర్ నిర్వాహకులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం టాస్క్‌ఫోర్సు డీసీపీ వై.వీ.యస్. సుధీంద్ర తెలిపిన వివరాల మేరకు మాయాబజార్ హొటల్ సమీపంలో భిక్షాటన పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్న నలుగురితోపాటు ముగ్గురు నిర్వాహకులను పోలీసులు పట్టుకున్నారు. సూరద చాందిని, జయశ్రీ, మనీషాలు లింగమార్పిడి చేసుకొని ట్రాన్స్ జెండర్లుగా మారినట్టు పోలీసులు తెలిపారు. వీరు పురుషులకు స్త్రీ వేషధారణ వేయించి వ్యాపార సముదాయాలు, సిగ్నల్స్ వద్ద డబ్బులు వసూలు చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలాంటి వారిపట్ల వాహనదారులు వ్యాపారస్థులు, పాదచారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

అక్టోబర్ 1 నుంచి 15 వరకూ సిల్క్, కాటన్ ఎక్స్‌పో



నవతెలంగాణ - బంజారా హిల్స్...
మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో సిల్క్, కాటన్ వస్త్రాల్లో 100 శాతం నాణ్యతకు వేదికగా నిలుస్తుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్టోబర్ 1 నుంచి 15 వరకూ అమీర్‌పేట కమ్మసంఘంలో నిర్వహించనున్న స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దసరా,దీపావళి పండుగలను పురస్కరిం చుకొని చేనేత రంగంలో పద్మశ్రీలతో పాటు అనేక అవార్డులు, రివార్డులు అందుకున్న నిష్ణాతులైన చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు తాము ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఎక్స్‌పోను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు.దేశంలో ప్రముఖ రాష్ట్రాలకు చెందిన నాణ్యమైన చెందేరి, కోల్కటా, నారాయణపేట్, పటోల, ఉప్పాడ, మంగళగిరి, వెంకటగిరి, కాంత, బెనారస్, గద్వాల్, గుజరాత్, టసర్, పోచంపల్లి, ఇక్కత్తో లాంటి వస్త్రాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



- జంపన్న ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్
పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ అన్నారు శుక్రవారం న్యూ బోయిన్‌పల్లిలోని రామన్నకుంట చెరువు వద్ద నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు చెరువులో చెత్త వేయడం వల్ల దోమలు పెరుగు తాయని పైగా చెరువు కాలుష్యం అవుతుందన్నారు. ఎవరికి వారు ఇండ్లల్లో వాడిన చెత్తను చెరువులో వేయటం వల్ల చెత్తాచెదారుల పేరుకుపోయి కలుషితం అవుతుందని చెప్పారు. అధికారులు చెరువులు ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తున్నా స్థానికులు ఆ విధంగా చెత్త వేయడం వల్ల మురికి కూపంగా మారుతోందని తెలిపారు. స్థానికులు ఇప్పటికైనా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెరువుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక విధాల కృషి చేస్తున్నారని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు

మూడు తరాల ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ



నవతెలంగాణ-ఓయూ
మూడు తరాల ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు కొండా లక్ష్మణ్ బాపూజీ వందేమాతర ఉద్యమం, భారత స్వాతంత్ర ఉద్యమం , క్విట్ ఇండియా ఉద్యమం, తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాట ఉద్యమం, నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం ఇలా అనేక ఉద్యమాలలో పాల్గొన్న గొప్ప నాయకుడు అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఓయూలో తెలంగాణ ఉద్యమంలో జరిగిన అనేక సభలకు కొండా లక్ష్మణ్ బాపూజీ హాజరయ్యారని, 97 సంవత్సరాల వయసులో కూడా ఎముకలు కొరికే చలిలో ఢిల్లీ జంతర్మంతర్ దగ్గర ఆయన ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం దీక్ష చేశారని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్ర మంలో ఓయూ జేఏసీ చైర్మెన్ రాజు నేత, ఓయూ జేఏసీ నాయకులు రాము, విక్రం, నాగరాజు, మహేష్ మధు మరియు బీసీ సంఘం నాయకులు బొమ్మ నరేందర్, గుజ శ్రీకాంత్, అనురాధ, హరినాథ్, చాణిక్య, మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ చైర్మెన్ బాలకృష్ణ నేత ఆధ్వర్యంలో

ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సంబరాలను ఓయూ జేఏసీ చైర్మెన్ బాలకృష్ణ నేత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై తన అమూల్యమైన సందేశాన్ని బాపూజీతో ఆయనకున్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తు చేశారు. బాపూజీ బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను రాబోయే తరాలకు అందించే విధంగా అన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాలని, బాపూజీ జీవితం మీద పరిశోధన నిర్వహించి ఆయన జీవిత చరిత్రను రికార్డు చేసి భద్రపరచాలని, బాపూజీ పేరు మీద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చేయూత అందించే విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం బాపూజీ పేరు మీద ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయడం ఎంతో శుభసూచకం అన్నారు. రానున్న రోజులలో ప్రభుత్వం ఇంకా మరెన్నో సంక్షేమ కార్యక్రమాల్లో బాపూజీ పేరు మీద రూపొందించాలన్నారు.

టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు నిజ్జన రమేష్, ఆశప్ప, టీపీసీసీ నాయకులు మద్దెల సంతోష్, రాంబాబు నాయుడు, వైజేఎస్ అధ్యక్షుడు సలీం పాషా, వీజేఎస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, జేవీఎస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, టీడీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, విద్యార్థి జన సమితి నాయకులు శేఖర్ యాదవ్, బోనాల నాగేష్, దిలీప్, శివకుమార్, వర్కాల రవి, రాపోలు వాసు, పాల్గొన్నారు.





కొండా లక్ష్మణ్ బాపూజీకి డిప్యూటీ మేయర్ నివాళ్లు

నవతెలంగాణ-ఓయూ
డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డిలు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు బాపూజీ జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన చేసిన ఉద్యమాల గురించి ప్రస్తావించారు. కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు, తదితరులు పాల్గొని బాపూజీ జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

మళ్లీ అడ్డదారుల్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు

- డా.మహిపాల్ యాదవ్



నవతెలంగాణ - బంజారా హిల్స్
తెలంగాణలో మళ్ళీ అడ్డదారిలో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రయత్నంపై జరుగుతున్నదని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జెఏసి చైర్మెన్ డా. మహిపాల్ యాదవ్ తెలిపారు.శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో శ్రావ్య ప్రముఖ తెలంగాణల పాటలు రచయిత గాయకుడు విష్ణు కిషోర్ లతో కలిసి మాట్లాడారు.

గత ప్రభుత్వంలో అడ్డదారుల్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేసి అనేక తప్పిదాలు చేశారని, ఆ బాటలోనే ఈ ప్రభుత్వంలో ఉన్న కొంత మంది అధికారులు నడుస్తు న్నారని ఆరోపించారు. వారం రోజుల్లో మళ్లీ అడ్డదారుల్లో గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాలో మున్సిపల్ ఇరిగేషన్ రెవెన్యూ తదితర శాఖల్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి సిద్ధపడుతున్నట్టు తెలిపారు. గతంలో అడ్డదారిలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల్లో నియమించిన వారిని తొలగించాలన్నారు. అలాగే బ్యాక్‌లాగ్ జాబుల్లో అక్రమంగా నియమించిన వాళ్లను కఠినంగా శిక్షించాలన్నారు. అర్హులైన వారిని ఆయా బ్యాక్‌లాగ్ జాబులో నియమించాలని డిమాండ్ చేశారు. అడ్డదారుల్లో బ్యాక్‌లాగ్ జాబు కొనాలనుకునే వారికి మీ డబ్బులు పోతాయి, మీ జాబులు పోతాయని మీరు జైలుకు వెళ్తారని ప్రభుత్వం గట్టిగా హెచ్చరికలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన జరిగే బ్యాక్లాగ్ నియమాకులను అడ్డుకోవాలని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జెఏసి పక్షనా ప్రభుత్వాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.నరేష్, డీఎస్సీ అభ్యర్థుల నాయకుడు బండారి సురేష్ , డప్పిస్ట్ సురేష్ బాబు, సామాజికవేత్త అశోక్, వ్యాపారవేత్త రాజేష్, చీమల జగదీష్ యాదవ్, ఓయూ నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విల్లా మేరీలో మినీ నవరాత్రి ఉత్సవాలు

సోమాజిగూడలోని విల్లా మేరీ ఉమెన్స్ కళాశాలలో కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ నవరాత్రి దాండియా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ నిర్వహణకు వచ్చిన ప్రతి రూపాయి దత్తత తీసుకున్న విద్యార్థి చదువుకు వెచ్చించనున్నట్టు కళాశాల డైరెక్టర్ ఫిలోమినా,సెక్రటరీ చిన్నమ్మలు తెలిపారు. ప్రతి ఏటా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రదర్శనలలో వచ్చిన ప్రతి రూపాయిని నిరుపేద విద్యార్థి ఉన్నత చదువుకోవాలని లక్ష్యంతో వారి చదువుకు వెచ్చించడం గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నదన్నారు. దీనిని ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేవతి దేవి, కరస్పాండెంట్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. నవతెలంగాణ - బంజారా హిల్స్

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
13
హైదరాబాద్
HMDA
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

ఎనీమియా ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎనీమియా ముక్త్ భారత్ పోస్టర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రస్తుతం ఉన్న పద్ధతులను బలోపేతం చేయడమే కాకుండా, రక్తహీనత సమస్యను అధిగమించడానికి కొత్త వ్యూహాలను ప్రవేశపెట్టడాన్ని లక్ష్యంగా చేసుకుందన్నారు. ఈ కార్యక్రమం ఆయా వయస్సు వర్గాల్లో అనీమియా తగ్గించడాన్ని లక్ష్యంగా చేసుకుని అమలుకు కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా ప్రయివేటు పాఠశాలల్లోనూ జపనీస్ ఎన్సెఫలిటిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందనీ, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.సరస్వతి పాల్గొన్నారు.



బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం బాపూజీ

- ఆయన చేసిన కృషి మరువలేనిది : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జ్యోతి ప్రజలన చేసి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కీషి చేశారని, వారి సేవలు మరువలేనివన్నారు. అదనపు కలెక్టర్ కదిరవన్ పలని మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం, నాన్ ముల్కీ, 1969లో ప్రత్యేక రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి జి.ఆశన్న, డీటీడబ్ల్యూవో ఆర్.కోటజీ, సీపీవో డాక్టర్ సురేందర్, డీఎస్సీడీవో పెరక యాదయ్య, డీపీఆర్వో అబ్దుల్ కలీం, డీఈఐఈ అనంతం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రమేష్, బీసీ సహాయ సంక్షేమ అధికారులు కృష్ణాచారి, నరసింహులు, సంజీవులు, వసతి గృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు లక్ష్మణ్ బాపూజీ



- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

అలుపెరగని పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని టీజీఎస్పీడీసీఎల్ చైర్మెన్ అండ్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో శుక్రవారం నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సంస్థ ముషారఫ్ ఫరూఖీ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళ్లర్పించి మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ, వివిధ హెూదాల్లో పేదలకు సేవ చేయడంతోపాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని కొని యాడారు. సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు కె.రాములు, నందకుమార్, సుధా మాధురి, సీపీఓ నారాయ ణ, చీఫ్ ఇంజినీర్లు శివాజీ, బాల స్వామి, జేఎస్ మాజీదుల్లా ఖాన్, సివిల్ ఎస్‌ఈ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా
- అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల ర్యాలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా అన్నారు. అంతర్జాతీయ వయోవద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏఎస్‌రావు నగర్‌లో వయోవద్ధుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు కృష్ణారెడ్డి వద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమం కోసం పాటు పడుతున్నామని తెలిపారు. తల్లి దండ్రుల బాధ్యత పిల్లలదే అనీ, వారిని జాగ్రత్తగా చూసుకోవాలనీ, లేదంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండబ్ల్యూపీఎస్‌సీ యాక్టును ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి మాట్లాడుతూ వయోవద్ధుల ప్రతి సమస్యనూ తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సీడీపీఓలు స్వాతి, రేణుక, శారద, జిల్లా వయోవద్ధుల కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, ఏఎస్‌రావు నగర్ కమిటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ క్రిష్ణమూర్తి, సెక్రెటరీ రామ్మోహన్ రావు, కమిటీ మెంటర్స్, వయోవద్ధుల ఆశ్రమాల వారితోపాటు, ఇతర వయోవద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను శుక్రవారం నాంపల్లి గృహకల్పలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకుల్లో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ కొమరం భీం జిల్లా వాంకాడి గ్రామంలో 1915లో జన్మించారని, స్వాతంత్ర సమరయోధుడు, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. 1952లో ఆసిఫాబాద్ నుంచి ఎన్నికయి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవినీ తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు ఖాలిద్ అహ్మద్, ముఖీమ్ ఖురేషి, ఏపీఆర్వో మొహమ్మద్ వాహీద్, మొహమ్మద్ ముస్తఫా షరీఫ్, మిత్రులు ఉస్మాన్ అలీ ఉస్మాని, పాల్గొన్నారు.

భగత్ సింగ్ కలలుగన్న అసమానతలు లేని సమ సమాజానికి పోరాడుదాం



- డీవైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సర్దార్ భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలను భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో... షాపూర్ నగర్ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పసుల అంజయ్య పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 27న పంజాబ్ రాష్ట్రంలో జన్మించడం జరిగిందన్నారు. 13 ఏండ్ల వయసులోనే సహాయ నిరాకరణోద్యమం భగత్ సింగ్ పై ప్రభావం చూపించి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో స్వేచ్ఛని రగిలించి స్వరాజ్య సాధన పోరాటంలో చిరుప్రాయంలోనే ఉరికంబాని సైతం ముద్దాడుతూ ప్రాణాలు వదిలిన వీరుడన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోసం సమసమాజ స్థాపన కోసం పేద, ధనిక భేదం లేని సమాజం కోసం యువతి యువకులు పోరాడాలన్నారు. విద్య, వైద్యం ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని దేశంలో సంపదను మొత్తం రాజకీయ నాయకుల ముసుగులో ఉన్న పెద్దపెద్ద కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పి దేశ సంపదను లూటీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, వంశీ, నగేష్, విష్ణు, పాల్గొన్నారు.



ఈఎన్టీ హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద ఆచార్య, ఆర్‌ఎంఓ డాక్టర్ అనీల్ కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీఎన్జీవో ఇఎన్టీ యూనిట్ అధ్యక్షులు తుమ్మకుంట రాజు, ఆఫీస్ సూపరింటెండెంట్ సునీల్, రవి, సంతోష్ తివారి, అశ్విన్, భాస్కర్, అజ్మత్ అలీ తదితరులు కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. -నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోంది

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ - ముషీరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని అందులో భాగంగానే రాష్ట్ర మంత్రులపై ఈడీ దాడులకు పాల్పడుతుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి శుక్రవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో మంత్రులపైన మంత్రుల ఇళ్లపైన సోదాలు చేయడం అధికారులను భయభ్రాంతులకు గురిచేసి అధికారంలో ఉన్నటువంటి ప్రతిపక్ష పార్టీ నాయకులను లొంగదీసుకునే విధంగా ప్రయత్నాలు చేయడం భారతీయ జనతా పార్టీకి ఒక యాక్టివిటీలా మారింది అని అన్నారు. ఇప్పటికైనా భారతీయ జనతా పార్టీ తన విధానాన్ని మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా తిరగబడే సమయం ఆసన్నమైందన్నారు. ఈ రకమైనటు వంటి సిగ్గుమాలిన చర్యలకు పాల్పడుతున్న భారతీయ జనతా పార్టీ ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ దానిపై ఇప్పటివరకు పార్లమెంట్లో చర్చించకపోవడం పై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

పీడీఎస్‌యూ స్థాపించి ఈ అక్టోబర్12తేదీతో యాభై సంవత్సరాలు పూర్తి కాబోతున్న సందర్భంగా శుక్రవారం విద్యానగర్‌లోని ఎస్వీఎస్ కళాశాలలో పీడీఎస్‌యూ 50 వసంతాల గోడ ప్రతికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రధాన అధ్యక్ష కార్యదర్శులు ధరణి, గణేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మందుల సైదులు, నాయకులు వంశీ,

ప్రాణదాతకు 116 ఏండ్లు

- నాటి మూసి వరదల్లో 150 మందికి రక్షణ
- చారిత్రక ఉస్మానియా ఆస్పత్రి చింత చెట్టు



నవతెలంగాణ - ధూల్‌పేట్

ప్రాణదాతకు 116 ఏండ్లు.. నాటి మూసి వరదల్లో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకున్న బాధితులను నేనున్నానని అక్కున చేర్చుకుంది. తనను సైతం లెక్క చేయక 150 మందిని తన కొమ్మాలతో రక్షించి ఆశ్రయ మిచ్చింది. ప్రాణ దాతగా చారిత్రకతను సంతరించుకుంది. ఇది మన ఉస్మానియా ఆస్పత్రిలోని చింత చెట్టు. ప్రస్తుతం అభివృద్ధి లేక నిరాశ్రయంగా మారింది. నేడు చెట్టు చారిత్రకత కార్యక్రమం నిర్వహిస్తారు.

1908లో సెప్టెంబర్ 28వ తేదీలో సంభవించిన వినాశకరమైన మూసీ మహావరదలకు సరిగ్గా 116 ఏండ్లు. ఇది హైదరాబాద్ చరిత్రలో ఒక విపత్తుగా మిగిలిపోయింది. ఈ విషాదానికి పర్యవసానంగా, నాటి పాలకులు నిపుణులైన ప్రణాళికాకర్తల సహాయంతో పటిష్టమైన వివిధ నగర అభివృద్ధి ప్రణాళికలను, పథకాలను అమలు చేశారు, ఇది మన నగరాన్ని ఆధునిక నగర ప్రణాళికకు ఉదాహరణ నగరంగా మార్చింది.

నగరంలో 116 ఏళ్ల క్రితం సెప్టెంబరులో భయంకరమైన మూసి వరదల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మనషుల వచ్చిన శారీరక రోగాలకు మెరుగైన వైద్యం అందించేది ఉస్మానియా ఆసుపత్రి రాష్ట్ర నలుమూలల ప్రఖ్యాతి నిండింది. అదే క్రమంలో భయంకరమైన మూసి ఫ్లడ్స్ వరదల్లో చిక్కుకున్న 150 మందిని కాపాడి దేశ చారిత్రక ఘనత పొందింది. నగరానికి వచ్చిన పర్యాటకులు నగరంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలు సందర్శిస్తూ ఈ చెట్టును సందర్శించడం విశేషం. మూసి, చారిత్రక పర్యాటక ప్రాంతాలతో పాటు ఈ చెట్టును ఫోటోలో బంధిస్తారు.

1908 సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు మూసీ ఉప్పొంగింది. వరద ప్రవాహం తగ్గేంత వరకు ఆ చెట్టును ఆసరగా చేసుకుని 150 మంది బతికి బయటపడ్డారు. చారిత్రక ప్రాధాన్యం సంతరించుకున్న ఆ వృక్షానికి ప్రస్తుతం రక్షణ కరవైంది. దాని ప్రాధాన్యం భావితరాలకు చెప్పేందుకు సర్కారు చర్యలు తీసుకోకపోవడంపై చరిత్ర కారులు పెదవి విరుస్తున్నారు.

నిధుల కొరత :

గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేసిన సోమేష్‌కు మార్ చెట్టు ఆవరణలోని ఉద్యానాన్ని ఆధునీకీకరించేందుకు రూ.కోటి నిధులను మంజూరు చేశారు. ఆగమేఘాల మీద పనులు ప్రారంభించిన అధికారులు కొన్ని నెలల వ్యవధి లోనే ఆయన మరో శాఖకు బదిలీ కావడం, నిధుల గ్రహణం పట్టుకోవడంతో పనులు నిలిచిపోయాయి. ఏ నగరానికైనా మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం అని హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అమలు విషయంలో కూడా ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించి కాలుష్య రహిత, శబ్దరహిత నగరం, ప్రణాళికాబద్ధమైన రవాణా వ్యవస్థ, వసతులు, డ్రైనేజీ వ్యవస్థ, ఘన వ్యర్థాలను శుద్ధి తదితర ప్రణాళికలను రూపొందించడం వల్ల నగరానికి క్రమబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఏటా వ్యక్తలు పేర్కొంటున్నారు. నగరంలోని వారసత్వ చారిత్రక భవనాల రక్షణ, వాటిలోని కనీసం 5, 6 భవనాలకు యునెస్కో గుర్తింపు వచ్చేందుకు అవకాశం ఉంది.


గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌కు 'కేర్ ఆస్పత్రి' గాంధీ భవన్ మెట్రో రైలు స్టేషన్‌గా పేరు



నవతెలంగాణ - ధూల్‌పేట్

మెట్రో ప్యాసింజర్‌కు అత్యవసర వైద్య సేవలను అందించడానికి కేర్ హాస్పిటల్స్ నాంపల్లి గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ప్రారంభించింది. ప్రతిరోజూ స్టేషన్ గుండా వెళ్ళే వేలాది మంది ప్రయాణికులకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకరావడానికి గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌ను ఇప్పుడు కేర్ హాస్పిటల్స్ గాంధీ భవన్ మెట్రో రైల్ స్టేషన్‌గా నామకరణం చేసారు. ఆరోగ్య సంరక్షణను ముందంజలో ఉంచడానికి మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేర్ హాస్పిటల్స్ నాంపల్లి వారి ఆధ్వర్యంలో కేర్ మెడికల్ సెంటర్ స్పెషలిటీ హెల్త్ కేర్ సెంటర్‌ను సీఓఓ డాక్టర్ సమీ, కేర్ హాస్పిటల్స్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, ఇతర విశిష్ట అతిథులులతో కలిసి ఆస్పత్రి సీఈఓ జసదీప్ సింగ్ చేతులమీదుగా ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్రో ప్యాసింజర్స్‌కు అత్యవసర వైద్య సేవలను అందించడానికి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ప్రారంభించడం వల్ల అత్యవసర చికిత్స అవసరమైన మెట్రో ప్రయాణికులకు ఈ కొత్త సౌకర్యం ప్రథమ చికిత్స కేంద్రంగా పనిచేస్తుందన్నారు. ఎమర్జెన్సీ క్లినిక్‌కి సంప్రదించిన రోగి పరిస్థితిని బట్టి, అవసరాన్ని బట్టి రోగిని సమీపంలోని ఆరోగ్య సంరక్షణ సదుపాయానికి తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇది ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగికి గోల్డెన్ అవర్‌లోనే అవసరమైన ప్రథమ చికిత్సను అందజేస్తుందని తద్వారా జీవించే అవకాశాలు పెరుగుతాయని ఆయన వివరించారు. సి .ఓ .ఓ డాక్టర్ సమీ మాట్లాడుతూ.. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇప్పుడు మెట్రో స్టేషన్‌లో మా స్పెషాలిటీ హెల్త్‌కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో, మేము ప్రయాణికులకు తక్షణ సంప్రదిం పులు, అవసరమైన వైద్య సేవలను అందిస్తామన్నారు. మా సమీపంలోని ఆస్పత్రిలో అందుబాటులో ఉండం వలన ఎమర్జెన్సీ సర్వీసులు వెంటనే అందిస్తామన్నారు. దీంతో ఆరోగ్య ఫలితాలను అందరూ పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

పునరావాసం కల్పించేవరకు తొలగించవద్దు



నవతెలంగాణ - ధూల్‌పేట్

మూసీ సుందరీకరణ పేరుతో రెవెన్యూ అధికారులు గురువారం పేదల ఇండ్లను తొలగించేందుకై ఆర్‌బీ-ఎక్స్ అని రెడ్ మార్కింగ్ వేశారు. ఆ ఇండ్లకు పునరావాసం కల్పించేవరకు వారి ఇండ్లను తొలగించవద్దని అధికారులను డిమాండ్ చేస్తూ ,ఆ సమస్యపై గోషామహల్ డివిజన్ దేవినగర్ బస్తీ ప్రజలతో మాట్లాడుతున్న ఆ బస్తి రక్షణ పోరాట కమిటి కన్వీనర్ కదిరే రాజు, సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా ప్రతినిధి బృందం ఎల్.కోటయ్య, కే.జంగయ్య, ఎస్.కిరణ్ తదితరులు ఉన్నారు.

అటు శుభ్రత..ఇటు జల సంపద

- సీవరేజ్ క్లీనింగ్, ఇంకుడు గుంతలపై స్పెషల్ డ్రైవ్
- సీవరేజ్ ఓవర్ ఫ్లోకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ
- గాంధీ జయంతి నుంచి ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహా నగరాన్ని సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే ముఖ్యమంత్రి లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గాంధీ జయంతి నుంచి డిసెంబర్ వరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్‌పై జలమండలి సీజీఎంల నుంచి కిందిస్థాయి మేనేజర్ అధికారి వరకు వర్క్ షాప్ నిర్వహించారు. ఖైరతాబాద్‌లో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎండీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ సీవరేజ్ సమస్యలపై తరుచూ వచ్చే ఫిర్యాదుల్ని తగ్గించుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపెట్టాలని అధికారులకు తెలిపారు. రోజూ అధికశాతం ఫిర్యాదులు సీవరేజ్ సమస్యలపైనే వస్తున్నాయని, వాటికి ఒక శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. 3 నెలల పనితీరు ఎంసీసీ ఫిర్యాదులపై ప్రభావం చూపిస్తుందని వివరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మురుగునీటి నిర్వహణపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గతేడాది హైదరాబాద్‌లో భూగర్భ జలాలు క్షీణించడం వల్ల ట్యాంకర్ల డిమాండ్ ఏర్పడిందన్నారు. కానీ భవిష్యత్తులో ఇలాంటివి పునావతం కాకుండా ఉండేందుకు ప్రజలంతా తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని దాంతో నీటికి ఇబ్బందులు ఉండవన్నారు. అనంతరం ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ ఒక నగర శుభ్రత, దాని మురుగునీటి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుందన్నారు. జలమండలి ఎంత పెద్ద ప్రాజెక్టులు చేపట్టినా క్షేత్ర స్థాయిలో నిత్యం చేసే తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణనే ప్రజలంతా గమనిస్తారని గుర్తు చేశారు. దానిపైనే మన పనితీరు అంచనా వేస్తారని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణం కూడా ముఖ్యమని ఈడీ తెలిపారు. స్పెషల్ డ్రైవ్ విజయం కావడానికి క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులపై ఆధారపడి ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం సీవరే జ్ పై ఈఎన్సీ, రెవెన్యూ డైరక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ 90 రోజుల్లో సీవరేజ్ సమస్యల్ని పరిష్కరించడానికి చేపట్టాల్సిన చర్యలు, అవలంబించాల్సిన పద్ధతులు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, వాటి ప్రాధాన్యం, నిర్మించుకునే విధానం తదితర అంశాలపై వివ రించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరక్టర్ రవి కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్ -2 స్వామి, పర్సనల్ డైరక్టర్ సుదర్శన్, డైరెక్టర్ ఆపరేషన్స్ -1 విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యటనలతో ప్రాపంచిక జ్ఞానం, మానసిక వికాసం



- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్

నవతెలంగాణ - ధూల్‌పేట్

జీవితం అనేది ఒక్కసారి దొరికే అవకాశమని, పర్యటనలతో ప్రాపంచిక జ్ఞానం, మానసిక వికాసం అని తెలంగాణ గ్రంథాలయ పరిషద్ చైర్మెన్ డాక్టర్ రియాజ్ అన్నారు. సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా సిటీ కళాశాల కామర్స్, మేనేజ్మెంట్ విభాగం ఈ నెల 23 నుండి 27 వరకు నిర్వహించిన పర్యటక వారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత కాలంలో వీలైనన్ని దేశాలు, ప్రదేశాలు తిరిగి చూడాలన్నారు. దీంతో వివిధ సంస్కృతులు, రకరకాల ప్రాంతాల మనుషుల ఆలోచనలను గురించి తెలుసుకోవటానికి పర్యటనలు దోహదం చేస్తాయని తెలిపారు. తద్వారా మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల మధ్య నిసర్గ సౌందర్యంతో విలసిల్లుతున్న అందమైన ప్రదేశం తెలంగాణ అని, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే గంగా జమున తెహజీబ్ లాంటి విశిష్టమైన సాంస్కృతిక విశిష్టత కలిగినది తెలంగాణ రాష్ట్రం అన్నారు. చారిత్రక కట్టడాలు, ఆలయాలు, జలపాతాలు, కొండలు, గుట్టలు ఇలా ఈ జిల్లాలో చూసినా గొప్ప పర్యటక అనుభూతులను అందించే ప్రదేశాలు రాష్ట్రం సొంతమన్నారు. విదేశీయులు పర్యటనల ద్వారా ప్రపంచ నలుమూలలా చుట్టివస్తారని, తమ సంపాదనలో కొంత పర్యటనల నిమిత్తం ఖర్చుచేస్తారని అన్నారు. తనకి కూడా వివిధ దేశాలను సందర్శించాలనే అభిలాషతో 12 దేశాలు పర్యటించానన్నారు. మూసీ నది ఒడ్డున ఉన్న సిటీ కాలేజీ ఒక చారిత్రక కట్టడం కావటం విశేషమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ.. పర్యటక దినోత్సవం సందర్భంగా తమ కళాశాల నిర్వహించిన కార్యక్రమాలను చూసి అధికారులు అభినందించారని, ఇతర కళాశాలలకు మార్గదర్శకమయ్యామని అన్నారు. కామర్స్ మేనేజ్మెంట్ విభాగం సమర్థవంతంగా వారోత్సవాలను నిర్వహించిందని, ఇతర కాలేజీల విద్యార్థులు కూడా వివిధ పోటీలలో పాల్గొనేలా చేసిందన్నారు. ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ నీరజ మాట్లాడుతూ.. ఐటీకి, ఫార్మాకి హబ్‌గా ఉన్న హైదరాబాద్ అతి త్వరలో టూరిజం హబ్‌గా మారుతుందని, విద్యార్థులకు అత్యుత్తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. సంగారెడ్డి డిగ్రీ కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్.రత్న ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం పర్యటక దినోత్సవ నినాదం టూరిజం-పీస్ అని, ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య సంఘర్షణలు జరుగు తున్న ఈ సమయంలో టూరిజం ద్వారా శాంతిని వ్యాపించడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. సిటీ కళాశాలకి ప్రిన్సిపాల్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించి, వారు టూరిజం శాఖ ఉన్నతికి దోహదం చేశారని అన్నారు. అతిథి రాజేష్ మాట్లాడుతూ.. పర్యటనలు మంచి జ్ఞాపకాలను, మంచి పరిచయాలను అందిస్తాయని, దేశంలోనే అతిపెద్ద పరిశ్రమలలో టూరిజం ఇండస్ట్రీ ఒకటని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ప్రభావితం కానీ రంగాలలో టూరిజం ఒకటని అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైంది. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్. మల్లికార్జున వారోత్సవ నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.యూన్సి రాణి, డాక్టర్. రవీంద్ర బాబు, డాక్టర్.శిరీషా, లలిత, నేహ, నరేశ్, సైదులు, రాజేష్, అనిత, రామారావు, ఫ్లారెన్స్, త్రిశూల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో అనుమతిలేని వాల్ పోస్టర్లు, రైటింగ్స్‌పై నిషేదం

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించడం, సుందరీకరణ లక్ష్యంగా అనుమతులు లేని వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్ లను నిషేధించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, వాల్ రైటింగ్స్ చేసినట్లైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా సర్కిళ్ల సంబంధిత డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్, సినిమా థియేటర్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై వాల్ పోస్టర్స్, సినిమా పోస్టర్లు అంటించకుండా, వాల్ రైటింగ్ రాయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో డిప్యూటీ కమిషనర్లు అశ్రద్ధ వహించకుండా కఠినంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్ చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జరిమానాలు విధించాలని ఆదేశించారు. జరిమానాల వివరాల నివేదిక పంపించాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నవరాత్రుల్లో డీజే సిస్టమ్ ప్లే చేయొద్దు

- గోషామహల్ ఏసీపీ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ - ధూల్‌పేట్

నవరాత్రు ఉత్సవాల్లో డీజే సిస్టమ్ ప్లే చేయొద్దని గోషామహల్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి మండపం నిర్వాహకులకు ఆదేశించారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గోషామహల్ డివిజన్ పరిధిలోని దుర్గామాత నిర్వాహకులతో షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్లు బాలు చౌహాన్, ఎం మహేష్, ఎస్సైలతో కలిసి ఆయన మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలన్నారు.డీజే సిస్టమ్, ఇష్టానుసారంగా వ్యవహరించకుండా భక్తి, శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. ఇక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాటు చేశామన్నారు. అందుకనుగుణంగా శాంతి భద్రతలకు సహకరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి, ఉన్నతికి కాంగ్రెస్ కృషి

- మహిళా అధ్యక్షురాలు
- శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్



నవతెలంగాణ - ధూల్‌పేట్

మహిళల సంక్షేమానికి, ఉన్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుందని ఖైరతాబాద్ జిల్లా మహిళ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు ఆదేశాల మేరకు కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సభ్యత్వ నమోదు సమావేశం కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉస్మాన్ బిన్ మాహమ్మద్ ఆల్ హాజ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మహిళల అభ్యున్నతి ప్రథమ ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. మాహమ్మద్ ఆల్ హాజ్రీ మాట్లాడుతూ..

కార్వాన్ నియోజకవర్గం మహిళ కమిటీ సభ్యులందరు కలిసి అధిక మొత్తంలో మహిళలను మహిళ కాంగ్రెస్ సభ్యత్వంలో పాల్గొనే దిశగా కార్యాచరణను రూపొందిచడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమలో కాంటెస్టెడ్ కార్పొరేటర్స్, డివిజన్ ప్రెసిడెంట్స్, బ్లాక్ ప్రెసిడెంట్స్, మహిళ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాపూజీ స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధిద్దాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

బాపూజీ స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని బహుజనులకు చేరువచేద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకను ఉత్సవ కమిటీ -చైర్మన్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ట్యాంక్ బాండ్ జలదృశ్యం లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆర్. కృష్ణయ్య హాజరై బాపూజీ చిత్రపటానికి పూలమాల లేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..సబ్బండ వర్గాలు సౌఖ్యంగా జీవించడానికి తన స్వగృహమైన జలదృశ్యాన్ని ఉద్యమానికి అంకితమివ్వడం బాపూజీ దార్శనికతను, ధైర్యాన్ని ప్రతిబింబిస్తున్నదని కానీ నేడు తెలంగాణ ఆవిర్భావం తరువాత సామాజిక పరిస్థితులు అందుకు భిన్నంగా కొనసాగుతున్నాయని మహనీయుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో బడుగు బలహీన వర్గాలు తీవ్రంగా అణచివేయబడుతున్నాయని పేర్కొన్నారు . బాపూజీతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.జయంతి వేడుక చైర్మన్ గుజ్జ సత్యం మాట్లాడుతూ .విద్య వైద్యం సామాజిక ఆర్థిక రాజకీయ అవకాశాలు ప్రజలందరికీ సమాన నిష్పత్తిలో లభించినప్పుడే సంపూర్ణ తెలంగాణ సాకారమవుతుందన్న బాపూజీ అంతరంగాన్ని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. ఇటువంటి తరుణంలో తెలంగాణ పౌరసమాజం కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు .కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను ప్రాథమిక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు.. భారతరత్న సిద్ధించేలా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలన్నారు. తెలంగాణా సెక్రటరియేట్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ బ్లాక్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమానికి బీసీ కమిషన్ మెంబర్ రాపోలు జైప్రకాష్, పీసీసీ సెక్రటరీ కోట్ల శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సురేష్ గుండేటి శంకర్ రామకృష్ణ, ఉదయ్ కుమార్, జయంతి వంశీకృష్ణ,రాజేందర్ రామలింగం రాందేవ్ వెంకట్ నారాయణ, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని అశోక్ నగర్ చౌరస్తా వద్ద గల బాపూజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ జీవిత చరిత్రను ప్రాథమిక పాఠ్యాంశంలో చేర్చాలని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. బాపూజీ స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని బహుజనులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.


భగత్‌సింగ్ కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి యువతకు ఆదర్శం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ స్వాప్నికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ, భారత స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యను ముద్దాడిన, స్ఫూర్తి ప్రధాత భగత్ సింగ్‌లు భారత ప్రజలకు ఆదర్శం అని భారత లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు కొనియాడారు. అమరుల జయంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జయంతి కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాంతం కలలు కన్న బాపూజీ తన స్వప్నం చూడకుండానే నిష్క్రమించారని విచారం వ్యక్తం చేశారు. అతి పిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శం అన్నారు.

అంబర్‌పేట్‌లో..

ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ కపిల్వాయి దిలీప్ కుమార్



అంబర్‌పేట్‌లో..

ధూల్ పేట్‌లో..

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం చాంద్రాయణగుట్ట నర్సిపూల్ బాగ్ లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కార్యాలయంలో జోనల్ ఏ యంసీ రాజారావు, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనాబీలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధూల్‌పేట్‌లో బాపూజీకి నివాళులర్పిస్తున్న దృశ్య

సాధారణ వ్యాయామాలతో...

ఎవరైతే ఉదయాన్నే లేచి వ్యాయామం చేస్తారో, వారు రోజంతా హుషారుగా ఉంటారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదయం పూట చేసే వ్యాయామం మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. శరీరంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపరుస్తుంది. తద్వారా ఏదైనా అనారోగ్యాన్ని తట్టుకునే శక్తి లభిస్తుంది. వైద్యుల అవసరం ఎక్కువగా రాదు. రోజూ ఉదయం వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును తగ్గించవచ్చు, మెదడు పనితీరు మెరుగుపడుతుంది.

రోజంతా గొప్ప అనుభూతిని పొందడంలో మీకు సహాయపడే కొన్ని సాధారణ ఉదయపు వ్యాయామాలును తెలుసుకుందాం. మీరు వాటిని మీ రోజూవారీ దినచర్యలో చేర్చుకోవచ్చు. జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదు. ఇంట్లోనే సులభంగా ఈ వ్యాయామాలను ఆచరించవచ్చు.



నడక లేదా పరుగు

ఉదయంపూట బహిరంగ ప్రదేశాలలో కాసేపు నడక, లేదా పరుగెత్తడం చేయాలి. తద్వారా మీరు ప్రకృతితో కనెక్ట్ కావొచ్చు. దీనితో ఆరోగ్య ప్రయోజనాలు గణనీయంగా ఉన్నాయి. మీ ఎముకలలో దృఢత్వం పెంచవచ్చు, మీ బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. అంతేకాకుండా, గుండె ఆరోగ్యంగా ఉండటానికి, రక్తపోటును అదుపులో ఉంచటానికి ఇవి సహాయపడతాయి. బయటకు వెళ్లలేకపోతే ఇంట్లో లేదా ఇండోర్ లో కూడా ట్రెడ్‌మిల్‌పై నడక లేదా పరిగెత్తడం చేసినా మంచిదే.

జంపింగ్ జాక్స్

హృదయ ఆరోగ్యానికి, కండరాలను బలోపేతం చేయటానికి ముఖ్యంగా డెల్టాయిడ్‌లకు టోన్ చేయడంలో జంపింగ్ జాక్స్ గొప్ప ప్రయోజనాలను కలిగిస్తాయి.

లెగ్ స్క్వాట్స్


గుంజీలు తీయటం ద్వారా కూడా పలు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. రెండు కాళ్లను కాస్త దూరంగా జరిపి, చేతులను ముందుకు చాచి నిటారుగా ఉంటూ కూర్చోవటం, పైకి లేవటం చేయాలి. ప్రారంభంలో 2 సెట్లను 15 సార్లు రిపీట్ చేయండి. ఈ వ్యాయామాలు మోకాలి స్థిరత్వానికి సహాయపడతాయి, కండరాలకు ప్రయోజనం చేకూరుస్తాయి

బ్యాలెన్సింగ్ టేబుల్ పోస్

దీనినే దండయమాన భర్మానాసన అని కూడా అంటారు. ఇది పొత్తికడుపు, దిగువ వెనుక కండరాలను బలపరుస్తుంది. అలాగే ఇది వెన్నెముకకు ఫ్లెక్సిబిలిటీ అందివ్వటానికి సహాయపడుతుంది.

వీటితో పాటు పుషప్స్, స్కిప్పింగ్, అబ్డక్టర్ సైడ్ లిఫ్ట్ ఇలాంటి వ్యాయామాలను ఉదయపు దినచర్య కోసం ఎంచుకోవచ్చు.

ఈ లోకంలో నిస్వార్థమైనది తల్లిదండ్రుల ప్రేమ మాత్రమే. తమ పిల్లల భవిష్యత్ బాగుండాలి అనే స్వార్థం మాత్రమే అందులో ఉంటుంది. మరి పిల్లలకు కూడా తల్లిదండ్రులపై అలాంటి ప్రేమ ఉండాలి కదా! అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ప్రేమ కేవలం వారు చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు మాత్రమే ఉంటుంది. పెరిగే కొద్ది కొంత మంది పిల్లలకు తల్లిదండ్రులపై ప్రేమ, గౌరవం తగ్గిపోతున్నాయి. కానీ తల్లిదండ్రులు అలా ఉండలేరు. జీవితంలో చివరి దశలో ఉన్నా పిల్లలపై ప్రేమ మాత్రం తగ్గదు. తమని పట్టించుకోకపోయినా పిల్లలు జీవితాంతం సుఖంగా, సంతోషంగా ఉండాలని మనసరా కోరుకుంటారు. అలాంటి ఓ కథనమే ఈ వారం ఐద్వా అదాలత్‌లో మీ కోసం...



తల్లిదండ్రులను అర్థం చేసుకోండి

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

వృద్ధాప్యంలో ఉన్న భార్యాభర్తలు కలిసి ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చారు. భర్త రాఘవయ్యకు 70 ఏండ్లు, భార్య మంగమ్మకు 65 ఏండ్లు ఉంటాయి. ఈ వయసులో వీరికేంటి సమస్యా హాయిగా ఉండొచ్చు కదా అనుకుంటున్నారా! రాఘవయ్య, మంగమ్మకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అందరికీ పెండిండ్లు అయిపోయాయి. వారికి పిల్లలు కూడా ఉన్నారు. కూతురు వేరే దేశంలో ఉంటుంది. అప్పుడప్పుడు ఇండియాకి వచ్చిపోతుంటుంది. రాఘవయ్య పిల్లలను బాగా చదివించాడు. పెద్ద అబ్బాయి సుమిత్ ఎంబీఏ చేశాడు. ప్రస్తుతం జాబ్ చేసుకుంటూనే రాఘవయ్య నడిపే జనరల్ స్టోర్ కూడా అతనే తీసుకున్నాడు. రాఘవయ్యకు పెద్ద ఇల్లు ఉంది. మూడు అంతస్తుల భవనం. ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కటి అని కట్టించాడు. చిన్న బాబు సృజన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కొడుకులతో పాటుగా కోడళ్లు కూడా ఉద్యోగం చేస్తున్నారు. అంతా బాగానే ఉంది.

అయితే తల్లిదండ్రులు వాళ్లకు భారమయ్యారు. ఇప్పుడు వాళ్లకు ఎలాంటి ఆదాయం లేదు. ఉన్న షాపు పెద్ద కొడుకు తీసుకొని నడిపించుకుంటున్నాడు. దాంతో పాటు రెండు షటర్లకు వచ్చే అద్దె కూడా అతనే తీసుకుంటాడు. రాఘవయ్య చేతికి ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు. షటర్లకు వచ్చే అద్దె ఇవ్వమన్నా ఇవ్వడు. కనీసం వాళ్ల అవసరాలైనా తీరుస్తున్నారా అంటే అదీ లేదు. ఇక చిన్న కొడుకు ఇల్లు మొత్తం తీసుకున్నాడు. దానిని కిరాయికి ఇచ్చి అద్దె వసూలు చేసుకుంటున్నాడు.

రాఘవయ్య, మంగమ్మ ఇద్దరూ కష్టపడి కట్టించుకున్న ఇల్లు అది. ఈ వయసులో సంతోషంగా ఉండేందుకు ఎంతో ఆశతో కట్టుకున్నారు. అలాంటి ఇల్లు ఇప్పుడు వారికి లేకుండా బయటకు పంపించేశారు. ఇదేంటి అంటే 'పెద్దోడికి షాపులు ఇచ్చావు, నేను ఇల్లు తీసుకుంటాను' అంటాడు చిన్నోడు. ఇక కూతురు ఎక్కడో విదేశాల్లో ఉంది. అన్నలతో మాట్లాడదామని ప్రయత్నిస్తే 'ఇది మా కుటుంబ వ్యవహారం. ఇందులో నువ్వు జోక్యం చేసుకోవద్దు' అన్నారు. ఆమె 'ఇంట్లో నా వాటా ఉంది కదా! అది అమ్మానాన్నలకు ఇవ్వండి' అంటే అది కూడా చేయడం లేదు. అందుకే కూతురు వారి ఖర్చుల కోసం నెలకు ఐదు వేలు పంపిస్తుంది.

'ప్రస్తుతం మూడు వేలకు ఓ చిన్న గది అద్దెకు తీసుకొని ఈ వయసులో మేము వేరుగా ఉంటున్నాం. ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇంటిని కొడుకులు మాకు దూరం చేశారు. నిలువ నీడ లేకుండా పోయింది. పోలీస్ స్టేషన్‌కు వెళితే 'మేమేం చేయలేము, కోర్టులో కేసు వేసుకోండి' అంటున్నారు. తెలిసిన వాళ్ల చెబితే మీ దగ్గరకు వచ్చాము. మీరైనా మాకు సహాయం చేయండి. ఆ ఇల్లు మొత్తం మాకు వద్దు. మేము ఉండేందుకు రెండు గదులు, షాపు కిరాయిలో సగం ఇస్తే మా ఖర్చులు మేము చూసుకుంటాం. నా కూతురు ఎలాగో ఇల్లు వద్దు అంటుంది. అది కూడా వాళ్లనే తీసుకోమనండి. మాకు మాత్రం బతికేందుకు కొంత ఇవ్వమని చెప్పండి. మేము సంపాదించిన దాని కోసం కూడా ఇప్పుడు మేము అడుక్కోవలసి వస్తుంది. ఏ తల్లిదండ్రులకు ఇలాంటి పరిస్థితి రాకూడదు' అంటూ ఆ వృద్ధ దంపతులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

> తల్లి దండ్రులు వాళ్లకు భారమయ్యారు. ఇప్పుడు వాళ్లకు ఎలాంటి ఆదాయం లేదు. ఉన్న షాపు పెద్ద కొడుకు తీసుకొని నడిపించు కుంటున్నాడు. దాంతో పాటు రెండు షటర్లకు వచ్చే అద్దె కూడా అతనే తీసుకుంటాడు.

మేము ఆ ఇద్దరు కొడుకులను పిలిపించి 'మీ తల్లిదండ్రులు కష్టపడి సంపాదించుకున్న ఇంటిని వారికి కాకుండా చేశారు. వాళ్లు తలచుకుంటే మీ ఇద్దరి పైనా కేసు పెట్టి ఆయన సంపాదించిన ఆస్తి ఆయన తీసుకోవచ్చు. కానీ వాళ్లు అలా చేయడం లేదు. నా పిల్లల భవిష్యత్ బాగుండాలి, సుఖంగా, సంతోషంగా ఉండాలి, మేము సంపాదించి మొత్తం వారికే కదా! అని వాళ్లు ఆలోచిస్తున్నారు. అలాంటి వారిని ఈ వయసులో ఇబ్బంది పాలు చేస్తున్నారు. వాళ్లను పట్టించుకోకుండా రోడ్డున పడేశారు. వాళ్లేమి మొత్తం ఇల్లు వాళ్ల ఆధీనంలో ఉంచుకోవాలని అనుకోవడం లేదు. ఉండటానికి రెండు గదులు, బతకడానికి కొంత డబ్బు కోరుకుంటున్నారు. మిమ్మల్ని సంపాదించింది. ఏమీ ఇవ్వమనడం లేదు. ఇప్పటి నుండు ఒక పోర్షన్‌లో వాళ్లు ఉంటారు. మిగిలినవి మీరు అద్దెకు ఇచ్చుకోండి. షాపు కిరాయిల్లో సగం మీ నాన్న అకౌంట్లో వెయ్యండి. అలా కాదని వాళ్లను ఇబ్బంది పెడితే పరిస్థితి మరోలా ఉంటుంది. మేము కేసు పెడదాం అంటే మీపై ప్రేమతో వాళ్లు వద్దన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రుల ప్రేమను అర్థం చేసుకోండి. ప్రేమగా చూసుకోండి' అని చెప్పాము. ఇద్దరు కొడుకులు మేం చెప్పిన దానికి అంగీకరించారు. ఒక పోర్షన్ ఖాళీ చేయించి తల్లిదండ్రులకు ఇచ్చేందుకు అంగీకరించారు. అలాగే షాపు కిరాయిల్లో సగం వాళ్ల ఖర్చులకు ఇస్తామని చెప్పారు. రెండు నెలల తర్వాత రాఘవయ్య వచ్చి 'మా ఇంట్లో మేము ఉంటున్నాం మేడమ్' అంటూ సంతోషంగా చెప్పారు.

> వాళ్లేమి మొత్తం ఇల్లు వాళ్ల ఆధీనంలో ఉంచుకోవాలని అనుకోవడం లేదు. ఉండటానికి రెండు గదులు, బతకడానికి కొంత డబ్బు కోరుకుంటున్నారు. మిమ్మల్ని సంపాదించి ఏమీ ఇవ్వమనడం లేదు. ఇప్పటి నుండు ఒక పోర్షన్‌లో వాళ్లు ఉంటారు. మిగిలినవి మీరు అద్దెకు ఇచ్చుకోండి.

- వై. వరలక్ష్మి, 9948794051

ఓపీ డబుల్.. ఐపీ హౌస్‌ఫుల్

(మొదటిపేజీ తరువాయి)

వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్లు సైతం సరిపడా అందుబాటులో లేవు. ఎక్స్‌రే, ఈసీజీ సెంటర్ల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఉస్మానియా నుంచి బదిలీపై వెళ్లిన 110 మంది స్టాఫ్ నర్సుల స్థానంలో కొత్తవారు ఇప్పటి వరకు రాకపోవడంతో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సగం వరకు వైద్యులు కూడా బదిలీపై ఇక్కడికి రాకపోవడంతో పీజీల హౌస్ సర్జన్లతో నెట్టుకురావాల్సి వస్తోందని హాస్పిటల్ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు 10 మంది ఆర్ఎంఓలకు ఏడుగురు, 10 మంది సీఎంఓలకుగాను ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారు. కొన్ని పరిస్థితుల్లో సీఎంఓల పనులను కూడా ఆర్ఎంఓలే చేయాల్సి వస్తుండటంతో పనిభారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారు. మందులు సైతం అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీపీ, షుగర్, గుండె సంబంధిత రోగులకు వైద్యులు రాసే మందుల్లో సగం బయట కొనాల్సిన దుస్థితి ఏర్పడింది.

రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం : డాక్టర్ రాకేశ్ సహాయ, సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్

హాస్పిటల్‌కు వచ్చే రోగలకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం. రెండు, మూడు రోజుల నుంచి రోగుల సంఖ్య పెరిగింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. హాస్పిటల్‌కు వచ్చే వారందరికీ చికిత్స అందిస్తున్నాం. అత్యవసరం ఉన్న వారిని అడ్మిట్ చేసుకుని, నార్మల్ ఉన్న వారికి రెండు, మూడు రోజుల వరకు వేచి చూడాలని సూచిస్తున్నాం.

ఏచూరి లేని లోటు తీర్చలేనిది

(మొదటిపేజీ తరువాయి)

ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి సతీమణి సీమాచిస్తీ, కుమార్తె అఖిలా ఏచూరి, కుమారుడు దినేశ్‌లను స్టాలిన్ పరామర్శించారు. వారితో కాసేపు మాట్లాడి ఏచూరి మరణానికి తన సంతాపాన్ని తెలుపుతూ, ఆయన లేని లోటు తీర్చ లేనిదని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వెంట డీఎంకే ఎంపీలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, కనిమొళి ఉన్నారు. సీతారాం ఏచూరి మరణించినప్పుడు స్టాలిన్ విదేశాల్లో ఉండటంతో మంత్రులు, ఎంపీల బృందాన్ని ఏచూరి భౌతిక కాయానికి నివాళి అర్పించేందుకు పంపించారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన స్టాలిన్ మూడు రోజుల క్రితం చెన్నైలో జరిగిన ఏచూరి సంతాప సభలో పాల్గొన్నారు.

రూపాయి పతనం

(మొదటిపేజీ తరువాయి)

గరిష్ఠ స్థాయి 83.62 నుంచి 83.71 కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుంది.

వరుస లాభాలకు బ్రేక్

గత కొన్ని రోజులుగా వరుస లాభాలతో రాణిస్తున్న దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలను చవి చూశాయి. ఫెడ్ రేట్ల కోత, ఐటి షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి కొనుగోళ్ల మద్దతుతో ఇటీవల ఆల్‌టైమ్ రికార్డులను నమోదు చేశాయి. దీంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఈ క్రమంలో వారాంతంలో బిఎస్ఇ సెన్సెక్స్ 264 పాయింట్లు పతనమై 85,571.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 85,978 గరిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 37.13 పాయింట్లు తగ్గి 26,178.95 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్-30లో పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హీరో మోటో కార్ప్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు బిపిసిఎల్, సన్ ఫార్మా, దివి ల్యాబ్స్ సూచీలు 6.23 శాతం వరకు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

శ్రమదోపిడీ సహించం

28న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
30న చలో లేబర్ కమిషనరేట్

- బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాల్లో తేడా లేదు
- నాన్‌పర్మినెంట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి
- కనీస వేతనాలు పెంచాలి
- కార్మిక చట్టాలు అమలు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర నేతల డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్, టెంపరరీ, డైలీవేజ్, అప్రెంటీస్, పీస్‌రేటెడ్, హోమ్‌బేస్డ్ వంటి రకరకాల పేర్లతో పలు ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న కార్మిక, ఉద్యోగ శ్రమదోపిడీని సహించేది లేదని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర శాఖ హెచ్చరించింది. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలనీ, కనీస వేతనాలు పెంచి, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ రమ, కార్యదర్శి జే వెంకటేష్ మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ పోరాట కార్యక్రమాలను ప్రకటించారు. ఈనెల 28న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 30న చలో లేబర్ కమిషనరేట్ పేరుతో మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వశాఖల్లో వేర్వేరు పేర్లతో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులు, ఉద్యోలందరినీ ఏకం చేయాలనే సీఐటీయూ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు సెప్టెంబర్ మాసంలో పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించినట్టు వారు తెలిపారు. పై తేదీల్లో జరిగే ఆందోళనల్లో అన్ని వర్గాలు, రంగాల కార్మికులు ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలనీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల చట్టం అమలు చేయాలనీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలన్నీ కల్పించాలని కోరారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నదని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన కనీస వేతనాల ఉత్తర్వులనే, తాజాగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఇచ్చిందని గుర్తుచేశారు. కొత్త ఉత్తర్వుల్లో కనీస వేతనాలు పెంచలేదన్నారు. సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ సంస్థలు, పురపాలక, గ్రామ పంచాయతీలు, విద్య, వైద్యరంగాలు, యూనివర్సిటీల్లో వివిధ పేర్లతో కార్మిక, ఉద్యోగ శ్రమదోపిడీ కొనసాగుతున్నదని ఉదహరించారు. వీరందరినీ ఏకతాటిపైకి తెచ్చి, సర్వీసుల క్రమబద్ధీకరణతో సహా ఇతర డిమాండ్లన్నీ సాధించుకోవడమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమని నాయకులు స్పష్టంచేశారు. పై తేదీల్లో జరిగే ఆందోళనల ద్వారా ప్రభుత్వం స్పందించకుంటే, భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. పెట్టుబడుల ఆకర్షణ పేరుతో పారిశ్రామికవేత్తలకు రెడ్‌కార్పెట్ పరుస్తూ, కార్మిక హక్కుల్ని ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. సెజ్‌ల్లో పరిస్థితులు మరింత పాశవికంగా ఉన్నాయనీ, కార్మిక శాఖ పెట్టుబడిదారుల ఫెలిసిటేషన్ సెంటర్‌గా మారి, కార్మిక సమస్యల్ని పట్టించుకోవట్లేదని విమర్శించారు.

బంజారా హిల్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లో చోరీ

పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్‌లో నిందితుల అరెస్ట్

నవతెలంగాణ - బంజారాహిల్స్



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో దొంగలు పడ్డారు. ఈ కేసుకు సంబంధించి పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు నిందితులను బెంగాల్ పోలీసులు అరెస్టు చేసినట్టు ఖరగ్‌పూర్ జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్14లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసం ఉంది. అయితే ఆయన కుటుంబం ప్రస్తుతం ప్రగతి భవన్‌లో ఉంటుండటంతో ఈ ఇంటికి అప్పుడప్పుడు మాత్రమే కుటుంబ సభ్యులు వచ్చి వెళుతున్నారు. ఇదే అదునుగా భావించిన బీహార్‌కు చెందిన దొంగలు.. రోషన్ కుమార్ మండల్, ఉదయ్ కుమార్ ఠాకూర్.. ముందస్తు పథకం రచించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఇంట్లో సుమారు రూ.2 లక్షల నగదు, 100 గ్రాముల బంగారం, విదేశీ కరెన్సీ చోరీ చేశారు. ఈ మేరకు ఈ నెల 24న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌గా ఏర్పడ్డారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలించారు. రైల్లో పశ్చిమబెంగాల్‌కు పారిపోయిన విషయం తెలుసుకున్న పోలీసులు.. ఆ రాష్ట్ర పోలీసుల సహాయంతో ఖరగ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి నగదు, బంగారం, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కోర్టులో నిందితులను హాజరుపరిచి హైదరాబాద్‌కు తీసుకొస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం డిప్యూటీ సీఎం అమెరికా పర్యటనలో ఉన్నారు.

ఐఎంఎఫ్‌తో తిరిగి చర్చలు

శ్రీలంక కొత్త అధ్యక్షుడు దిసనాయకె వెల్లడి

కొలంబో : ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అత్యంత దుర్భరమైన ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ, విదేశీ రుణదాతలతో చర్చలు తిరిగి ప్రారంభిస్తామని శ్రీలంక కొత్త అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె తెలిపారు. సాధ్యమైనంత త్వరగా చర్చల ప్రక్రియను పూర్తి చేసి, నిధులు తీసుకువస్తామని చెప్పారు.

గతంలో మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె రూపొందించిన ఆర్థిక పునరుద్ధరణ ప్రణాళిక భవితవ్యం దిసనాయకె తాజా విజయంతో చిక్కుల్లో పడింది. ఐఎంఎఫ్‌తో బెయిలవుట్ ఒప్పందంపై తిరిగి చర్చలు జరుపుతామని దిసనాయకె తన ఎన్నికల ప్రచారం సందర్భంగా చెప్పారు.

ప్రభుత్వం అమలు చేసే పొదుపు చర్యలు పేదలు భరించే విధంగా వుండాలనుకుంటున్నామని చెప్పారు. 2022లో దివాలా తీసినట్లు శ్రీలంక ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 8300కోట్ల డాలర్ల దేశీయ, విదేశీ రుణాల చెల్లింపులను నిలిపివేసింది. తీవ్ర విదేశీ మారక ద్రవ్య సంక్షోభం నెలకొంది. దీనివల్ల నిత్యావసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది.

మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీదాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఈడీ టీమ్‌లు ఈ దాడులను ప్రారంభించాయి. విదేశాల నుంచి కోట్ల రూపాయల కస్టమ్స్‌ను ఎగవేసి వాచీలను తీసుకొచ్చారనే సంబంధిత అధికారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఈడీ అధికారులు మంత్రి నివాసం, కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. ముఖ్యంగా, సింగపూర్ నుంచి చెన్నై పోర్టుకు గుట్టుచప్పుడు కాకుండా నవీన్‌కుమార్ అనే వ్యక్తి అత్యంత ఖరీదైన పది వాచీలను తరలించినట్టు గతంలో కస్టమ్స్ అధికారులు గుర్తించారు. ఇందులో నుంచి రెండు వాచీలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు హర్షరెడ్డికి చేరినట్టు కస్టమ్స్ అధికారుల దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఒక్కో వాచ్ విలువ రూ.1.78 కోట్లుగా కస్టమ్స్ అధికారులు గుర్తించారు. మిగతా వాచీలను ఫహెర్దీన్ ముబీన్ అనే వ్యక్తికి చేరినట్టు తెలుస్తున్నది. కాగా, ఈ వాచీలకు సంబంధించి కస్టమ్స్ సుంకాన్ని చెల్లించకుండా ఎగవేసినట్టు సంబంధిత అధికారులు ఈడీ ఆఫీసర్లకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు మనీలాండరింగ్ చట్టం కింద కేసులను నమోదు చేసుకొని రంగంలోకి దిగిన ఈడీ అధికారులు.. మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన జూబ్లీహిల్స్‌లోని నివాసంతో పాటు హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయాలు, ఆయన కుమార్తె నివాసాల్లో ఆకస్మిక సోదాలను నిర్వహించారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఐదు టీంలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు ఈ సోదాలు కొనసాగాయి. సోదాలు జరిగే సమయంలో మంత్రి పొంగులేటి నివాసంలో లేరు. అయితే, ఈ సోదాల్లో అధికారులు స్వాధీనపర్చుకున్న అంశాలకు సంబంధించి ఈడీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేయను న్నదని సమాచారం.

రాజకీయ కక్షతోనే.. : టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

రాజకీయ కక్షతోనే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఈడీ దాడులను నిర్వహిస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తనను కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లోపాయకారి ఒప్పందంలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. 2014 నుంచి ఈడీ జరిపిన దాడుల్లో 96శాతం పైగా ప్రతిపక్షాల మీద జరిగిన దాడులేనని గుర్తు చేశారు. రాజకీయంగా లబ్ది పొందేందుకే ఫేక్, పాల్స్ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టేందుకే ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగంపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈడీ దాడులను తాము రాజ్యాంగ బద్ధంగా ఎదుర్కొంటామన్నారు. హైడ్రాతో నష్టపోతున్న పేద వర్గాలను ప్రభుత్వం ఆదుకుంటుందనిఇ చెప్పారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ సొమ్మెంత? తొమ్మిది నెలల్లో తమ ప్రభుత్వం చేసిన రుణమాఫీ సొమ్మెంత? అనేది చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. బాపూజీ జీవన విధానాన్ని, గుణగణాలను, పోరాటాన్ని అలవర్చుకోడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం పోరాటం చేయడమే కాక తెలంగాణ వస్తేనే తాను పదవులు తీసుకుంటానని ప్రతిజ్ఞ చేసిన మహనీయుడని కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. నేతన్నలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, కమిటీ చైర్మెన్ ఇరవత్రి అనిల్, కె. మురళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాల మాయ దేవి, గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య పరిరక్షణకు
ఏచూరి అవిశ్రాంత పోరాటం

- దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి
- మహారాష్ట్రలో సంతాప సభలో వక్తలు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అవిశ్రాంత పోరాటం చేశారని వివిధ పార్టీల నేతలు కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. మహా వికాస్ అఘాడి (ఇండియా బ్లాక్) ఆధ్వర్యంలో ముంబయిలోని నారిమన్ పాయింట్ వైబి చవాన్ ఆడిటోరియంలో శుక్రవారం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మహారాష్ట్ర కమిటీ నిర్మించిన పది నిమిషాల డాక్యుమెంటరీలో సీతారాం జీవితం, రచనలను ప్రదర్శించి ఆయనకు హృదయ పూర్వక నివాళి అర్పించారు. నాయకులంతా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ యూపీఏ సంకీర్ణ ప్రభుత్వంలో సీతారాం ఏచూరి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంస్థలకు ముప్పు పొంచి ఉందని, మోడీ పాలన ఎక్కువ కాలం కొనసాగితే సామాన్యులు మరింత నష్టపోతారని ఏచూరి అనే వారని అన్నారు. దాన్ని నిరోధించాలంటే ప్రతిపక్షాన్ని ఏకం చేయాలన్నదే ఆయన వైఖరని, దాని వల్లే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ ఉనికిలోకి వచ్చిందని తెలిపారు. నిర్ణయాత్మక పాత్ర పోషించాల్సిన ప్రస్తుత సమయంలో ఏచూరి నిష్క్రమణ బాధాకరమని శరద్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏచూరి ఎప్పుడూ మృదువుగా, స్నేహపూర్వకంగా ఉండే వారని, ధూమపానానికి చెక్ పెట్టాలనీ భావించేవారని అన్నారు. ఏచూరి మంచి స్నేహితుడని, ఆయన సన్నిహితంగా మెలిగే విధానాన్ని కొనియాడారు.

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ ధావలే మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐతో ప్రారంభమై 45 ఏండ్లుగా ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నెల రోజుల క్రితం వరకు కూడా ఆయన చనిపోతారని ఊహించలేదన్నారు. ఏచూరి మహారాష్ట్ర లోని ప్రతి జిల్లాను సందర్శించారని, అనేక సమావేశాల్లో



ప్రసంగించారని అన్నారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు మాట్లాడుతూ దేశంలో పెచ్చరిల్లుతున్న బీజేపీ హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఏచూరి అగ్రగామిగా నిలిచారని అన్నారు. హిందూత్వంపై రాజకీయ, సైద్ధాంతిక పోరాటం చేయడంతో పాటు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే నరసయ్య ఆడమ్ మాట్లాడుతూ ఏచూరితో తాము తెలుగులో మాట్లాడేవాళ్లమని, షోలాపూర్‌లో బీడీ కార్మికులు ఉపాధి కోల్పోయినప్పుడు ఆ సమస్యను అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఏచూరి తీసుకున్న చొరవను గుర్తు చేసుకున్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే మాట్లాడుతూ ఏచూరి మహోన్నతమైన వ్యక్తి అని, ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చివరివరకు గొంతెత్తారని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడిన గొప్ప నేతని కొనియాడారు. రాష్ట్ర సీపీఐ ప్రధాన కార్యదర్శి సుభాష్ లాండే మాట్లాడుతూ 30 ఏండ్ల క్రితం ఏచూరి తనను శ్రీలంక కామ్రేడ్ అనూరా దిసనాయకేకి పరిచయం చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఇప్పుడు శ్రీలంక అధ్యక్షుడిగా ఉన్నందుకు సంతోషంగా ఉందని, మరోవైపు ఆయనను తనకు పరిచయం చేసిన వ్యక్తి లేరని బాధగా ఉందని అన్నారు. ఏచూరి ఉండి ఉంటే దిసనాయకే శ్రీలంక అధ్యక్షుడైనందుకు సంతోషించేవారన్నారు. శివసేన ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ ఎంపీగా ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్ష పార్టీల తరఫున ప్రకటనలు రూపొందించడంలో ఆయనకు మరెవ్వరూ సాటి రారని శ్లాఘించారు. పీడబ్ల్యూపీ ప్రధాన కార్యదర్శి జయంత్ పాటిల్ మాట్లాడుతూ రాయ్‌గఢ్ జిల్లాలో ప్రత్యేక ఆర్థిక మండలికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనకు ఏచూరి మద్దతునిచ్చారని గుర్తు చేసుకున్నారు.

ఈ సమస్యపై జరిగిన సభ చాలా మందిని ఆకర్షించిందని, అది ప్రారంభమైనప్పుడు సోనియా గాంధీ ఢిల్లీ నుంచి ఫోన్ చేసి, ఫస్ట్ హ్యాండ్ రిపోర్ట్ తెప్పించుకున్నారని తెలిపారు. కమ్యూనలిజంపై పోరాటంలో భాగంగా ఏచూరితో తాను 12 ఇంటర్వ్యూలు చేశానని తీస్తా సెతల్వాడ్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీలు హుస్సేన్ దల్వాయ్, కుమార్ కేత్కర్, ప్రముఖ దళిత రచయిత అర్జున్ డాంగ్లే, మార్క్సిస్ట్ మేధావి ఆనంద్ తెల్తుంబ్డే, మహాత్మా గాంధీ ముని మనమడు తుషార్ గాంధీ, చిత్ర నిర్మాత సయీద్ మీర్జా, థియేటర్ డైరెక్టర్ ప్రసన్న, డాక్టర్ ఆర్ రామకుమార్, ఉదయ్, నీలిమా రణదివే, సామాజిక కార్యకర్తలు గౌతమ్ నవ్లాఖా, నటీస్తా సెటల్‌వాడ్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నేత శ్యామ్ గోహిల్, లాల్ నిషాన్ పార్టీ (లెనినిస్ట్) నేత విజయ్ కులకర్ణి, ఆప్ నేత ధనంజయ్ షిండే, ఆర్‌పిఐ నేత రాజేంద్ర గవాయ్, సర్వహార జన్ ఆందోళన్ నేత ఉల్కా మహాజన్, ఇండో పాలస్తీనా ఫ్రెండ్‌షిప్ సొసైటీ నేత ఫిరోజ్ మిథిబోర్వాలా, ఎన్ఎపిఎం నేత సంజయ్ మంగళ గోపాల్ వివిధ అభ్యుదయ పార్టీలు, సామాజిక ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సభకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ నార్కర్ అధ్యక్షత వహించారు. అంతకు ముందు విప్లవ గీతాల ప్రదర్శనలు, ఏచూరి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, నినాదాలతో నివాళులర్పించారు.

ఆట

తొలిరోజు 35 ఓవర్లే!

వెలుతురు లేమి, వర్షంతో సాగని ఆట
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 107/3
భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

ఊహించినట్టుగానే కాన్పూర్ టెస్టుకు వరుణుడు ఆటంకం కలిగించాడు. రాత్రి కురిసిన వర్షంతో ఉదయం టాస్ గంట ఆలస్యం కాగా.. మధ్యాహ్నం కారు మబ్బులతో వెలుతురు లేమి, ఆపై భారీ వర్షంతో తొలి రోజు ఆట సాగలేదు. రెండు సెషన్లలో 35 ఓవర్ల సాధ్యపడగా.. బంగ్లాదేశ్ 107 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. నేడు ఉదయం ఆట 30 నిమిషాల ముందుగానే ఆరంభం కానుంది.



నవతెలంగాణ-కాన్పూర్

వెలుతురు లేమి, భారీ వర్షంతో భారత్, బంగ్లాదేశ్ కాన్పూర్ టెస్టు తొలి రోజు కేవలం 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 107/3 పరుగులు చేసింది. మోమినుల్ హక్ (40 నాటౌట్, 81 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ ఇన్నింగ్స్‌తో మెప్పించగా.. షాద్‌మాన్ ఇస్లాం (24, 36 బంతుల్లో 4 ఫోర్లు), నజ్ముల్ శాంటో (31, 57 బంతుల్లో 6 ఫోర్లు) మంచి ఆరంభాలను దక్కించుకున్నారు. జాకిర్ హసన్ (0) డకౌట్ కాగా.. ముష్ఫీకర్ రహీమ్ (6 నాటౌట్) అజేయంగా నిలిచాడు. భారత బౌలర్లలో యువ పేసర్ ఆకాశ్ దీప్ (2/34), రవిచంద్రన్ అశ్విన్ (1/22) వికెట్లు పడగొట్టారు. తొలి రోజు 55 ఓవర్ల ఆట నష్టపోగా.. నేడు మ్యాచ్ ఓ అర గంట ముందుగానే షురూ కానుంది.

ఆకాశ్ డబుల్ స్ట్రోక్

యువ పేసర్ ఆకాశ్ దీప్ అదరగొట్టాడు. పేస్‌కు అనుకూలించే పరిస్థితుల్లో బుమ్రా, సిరాజ్ కొత్త బంతితో దాడి చేసినా బంగ్లాదేశ్ వికెట్ కోల్పోలేదు. ఆకాశ్ దీప్ బంతి అందుకోగా.. భారత్‌కు బ్రేక్ అందించాడు. ఓపెనర్ జాకిర్ హసన్ (0)ను స్లిప్స్‌లో డకౌట్‌గా సాగనంపాడు. యశస్వి జైస్వాల్ సూపర్ క్యాచ్‌తో జాకిర్ హసన్ పెవిలియన్ బాట పట్టాడు. మరో ఓపెనర్ షాద్‌మాన్ ఇస్లాం (24) సైతం ఆకాశ్ దీప్ ఉచ్చులో పడ్డాడు. కండ్లుచెదిరే బంతితో ఇస్లాంను ఎల్బీడబ్ల్యూగా ఆకాశ్ అవుట్ చేశాడు. 26/0తో ఉన్న బంగ్లాదేశ్ ఆకాశ్ దెబ్బకు 29/2తో ఒత్తిడిలో పడింది. ఇస్లాం నాలుగు ఫోర్లతో మెరిసినా.. ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. కెప్టెన్ నజ్ముల్ శాంటో (31), మోమినుల్ హక్ (40 నాటౌట్) మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించారు. 51 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ మాయ ముంగిట నజ్ముల్ బోల్తా కొట్టాడు. దీంతో బంగ్లాదేశ్ 30 ఓవర్లలోపే మూడో వికెట్ కోల్పోయింది. లంచ్ విరామ సమయానికి 26 ఓవర్లలో 74/2తో నిలిచిన బంగ్లాదేశ్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 107/3 పరుగులు చేసింది. లంచ్ తర్వాత తొలుత వెలుతురు లేమితో ఆట నిలిచిపోగా.. ఆ తర్వాత కుండపోత వర్షంతో అంపైర్లు తొలి రోజు ఆటను రద్దు చేశారు.

భిన్న వ్యూహం

కాన్పూర్ పిచ్‌ను భారత్, బంగ్లాదేశ్ విరుద్ధంగా అర్థం చేసుకున్నాయి. మేఘావృత వాతావరణంలో నల్ల మట్టి పిచ్‌పై భారత్ ముగ్గురు పేసర్లను తుది జట్టులోకి తీసుకోగా.. బంగ్లాదేశ్ ముగ్గురు స్పిన్నర్లను ఎంచుకుంది. టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. బంగ్లాదేశ్ టాస్ నెగ్గితే బ్యాటింగ్ ఎంచుకునేందుకు సిద్ధపడింది. నల్లమట్టి పిచ్ స్పిన్‌కు అనుకూలం, కానీ మూడు రోజుల పాటు వర్షం సూచనలతో భారత్ ముగ్గురు సీమర్లకు ఓటేసింది.

బంగ్లా అభిమానిపై దాడి?

బంగ్లాదేశ్ వీరాభిమాని 'టైగర్ రూబీ'పై కాన్పూర్‌లో దాడి జరిగిందని తెలుస్తోంది. మ్యాచ్ ఆరంభం కాగానే రూబీని కొందరు దురభిమానులు దూషించటం మొదలెట్టారని సమాచారం. వెన్ను, ఉదర భాగంలో కొట్టారని రూబీ పోలీసులకు తెలిపినా.. దాడికి సంబంధించిన దృశ్యాలు ఎక్కడా కనిపించలేదు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న రూబీని పోలీసులు తక్షణమే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

నేడూ భారీ వర్షం

కాన్పూర్ టెస్టును వరుణుడు వీడే చాన్స్ కనిపించటం లేదు. శనివారం ఉదయం నుంచే ఇక్కడ భారీ వర్షం సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో నేడు కూడా పూర్తి ఆట సాధ్యపడే అవకాశం లేదు. ఆదివారం సైతం వాతావరణ పరిస్థితుల్లో ఎటువంటి మార్పులు లేవు. తొలి మూడు రోజుల ఆటకు వర్షం ఆటంకం అనివార్యంగా కనిపిస్తోంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : జాకిర్ హసన్ (సి) యశస్వి (బి) ఆకాశ్ దీప్ 0, షాద్‌మాన్ ఇస్లాం (ఎల్బీ) ఆకాశ్ దీప్ 24, మోమినుల్ హక్ నాటౌట్ 40, నజ్ముల్ శాంటో (ఎల్బీ) అశ్విన్ 31, ముష్ఫీకర్ రహీమ్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (35 ఓవర్లలో 3 వికెట్లకు) 107.

వికెట్ల పతనం : 1-26, 2-29, 3-80.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 9-4-19-0, మహ్మద్ సిరాజ్ 7-0-27-0, రవిచంద్రన్ అశ్విన్ 9-0-22-1, ఆకాశ్ దీప్ 10-4-34-2.



చెస్ విజేతలకు రూ.25 లక్షల నజరానా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్

ఫిడే 45వ చెస్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం సాధించిన భారత జట్టులో కీలక సభ్యులు అర్జున్ ఇరిగేశి, ద్రోణవల్లి హారికలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరో రూ.25 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేయనుంది. బుడాపెస్ట్ నుంచి పసిడితో స్వదేశానికి చేరుకున్న అర్జున్, హారికలు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. చెస్ చాంపియన్లను అభినందించిన రేవంత్‌రెడ్డి.. చెరో రూ. 25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.



చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్

గ్యాంగ్‌స్టర్ విడుదలకు సిద్ధం

చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'గ్యాంగ్‌స్టర్'. ఈ చిత్రంలో అభినవ్ జనక్, అడ్ల సతీష్ కుమార్, సూర్య నారాయణ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు.

వైల్డ్ వారియర్ ప్రొడక్షన్స్ పతాకంపై రవి, నరసింహా సమర్పణలో చంద్రశేఖర్ రాథోడ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీ పోస్టర్‌ని రచయిత సాయిమాధవ్ బుర్ర విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సినిమా టీజర్, ట్రైలర్ ఇంకా పోస్టర్స్ అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమాకి కష్టపడిన ప్రతి ఒక్కరిని విజయం వరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

'రెండు గ్యాంగ్స్ మధ్య వార్‌ను మా డైరెక్టర్ చంద్రశేఖర్ ఆకట్టుకునేలా డిజైన్ చేశాడు. ప్రతి సీన్ రిచ్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ ప్లే చేశాను. మా అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుంది' అని నటుడు అభినవ్ జనక్ చెప్పారు.

డిస్ట్రిబ్యూటర్ అచ్చిబాబు మాట్లాడుతూ, 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. టీజర్, ట్రైలర్‌తో సినిమా పై బజ్ మరింతగా పెరిగింది. ఈ సినిమాని మీరంతా థియేటర్లలో చూడాలని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'సినిమా అంటే నాకు చాలా ఇష్టం. అన్నపూర్ణ స్టూడియోస్‌లో డీఎఫ్‌టీ కోర్స్ చేశాను. దిల్ రాజు ట్రైలర్ చూసి బాగుందన్నారు. మా సినిమా తేదీ ప్రచార చిత్రాన్ని విడుదల చేసిన సాయి మాధవ్ బుర్రాకి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని హీరో, దర్శకుడు, నిర్మాత చంద్రశేఖర్ రాథోడ్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరామెన్ : జీఎల్. బాబు, ఆర్ట్ డైరెక్టర్ : విజయ్ సారధి, ఫైట్స్, కొరియోగ్రఫీ, ఎడిటింగ్, రచన, నిర్మాత దర్శకత్వం- చంద్రశేఖర్ రాథోడ్.

నవచిత్రం

అందమైన పల్లె వీధుల్లోన..



రుత్విక్, ఇక్రా ఇద్రిసి

రమాదేవి ప్రొడక్షన్స్ పతాకంపై నూతన తారాగణంతో తెరకెక్కుతున్న ఫీల్ గుడ్‌ఎంటర్టైనర్ 'వైభవం'. సాత్విక్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రుత్విక్ – ఇక్రా ఇద్రిసి జంటగా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రంలోని 'పల్లె వీధుల్లోన' పాటను మేకర్స్ విడుదల చేశారు.

చిన్ననాటి జ్ఞాపకాలను, తల్లిదండ్రుల ప్రేమను, స్వచ్ఛమైన స్నేహాన్ని, పల్లె వైభవాన్ని గుర్తుచేసే ఈ పాటకు దర్శకుడు సాత్విక్ స్వయంగా సాహిత్యాన్ని, బాణీలను సమకూర్చగా, రితేష్ జి రావు ఆలపించారు. త్వరలోనే ఈ చిత్రం ఫస్ట్ కాపీ సిద్ధమవుతుందని, రానున్న రోజుల్లో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు. రీసెంట్‌గా వచ్చిన సినిమాలతో పోలిస్తే మా చిత్రం చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఇందులోని మా పాత్రలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తాయి. ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మేకర్స్‌కి థ్యాంక్స్ అని హీరో, హీరోయిన్ రుత్విక్, ఇక్రా ఇద్రిసి చెప్పారు.



ఎన్టీఆర్ వన్ మ్యాన్ షో.. దేవర : కళ్యాణ్‌రామ్

'మా 'దేవర' చిత్రాన్ని ఆదరిస్తున్న అభిమానులు, సినీ ప్రియులకు ధన్యవాదాలు. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడి పని చేసింది. నా తమ్ముడు, మా నాన్న (ఎన్టీఆర్‌ని ఉద్దేశించి) యాక్టింగ్‌తో అదరగొట్టేశాడు. ఇది వన్ మ్యాన్ షో అని గర్వంగా చెప్పగలను. మాకు ఇలాంటి విజయాన్ని అందించిన టీమ్‌కి థ్యాంక్స్' అని చిత్ర సమర్పకుడు నందమూరి కళ్యాణ్‌రామ్ చెప్పారు.

ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'దేవర'. ఈ సినిమా శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. తమ చిత్రాన్ని విశేషంగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపేందుకు చిత్ర బృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది.

ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ, 'మాకు ఇంత పెద్ద విజయాన్ని ఇచ్చినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు. నిన్న రాత్రి నుంచి వరుస ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఇది నా బెస్ట్ ఫిల్మ్ అని అందరూ మెచ్చుకుంటున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు.. అందరి వల్లే ఈ సినిమా ఈ స్థాయికి వెళ్ళిందని నమ్ముతున్నా' అని తెలిపారు.

ఈ చిత్రాన్ని నైజాంలో పంపిణీ చేసిన దిల్‌రాజు మాట్లాడుతూ, 'ఇందులో ఎన్టీఆర్ నటన మరో స్థాయిలో ఉంది. ఇది ఆయన వన్ మ్యాన్ షో. ఇక్కడే కాదు విదేశాల్లోనూ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు' అని అన్నారు.

కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ,'ఈ సినిమాకి రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లు రావడం ఆనందంగా ఉంది. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. అత్యద్భుత విజయాన్ని అందించిన అందరికీ థ్యాంక్స్' అని తెలిపారు.

> నేను ఎదురు చూస్తున్న రోజు వచ్చింది. దేవర సినిమాపై మీరు చూపిస్తోన్న అభిమానాన్ని చూసి చాలా సంతోషంగా ఉంది. అద్భుతమైన డ్రామ, భావోగ్వేగాలతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినందుకు దర్శకుడు కొరటాల శివకు థ్యాంక్స్. సోదరా అనిరుధ్ నీ మ్యూజిక్‌తో మా ప్రపంచానికి ప్రాణం పోశావు. ఈ చిత్రానికి బలమైన సపోర్ట్‌గా నిలిచిన మా నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె, అద్భుతంగా వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సాబు సిరిల్‌తోపాటు టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు. నా అభిమానుల వేడుకలు చూసి నా మనసు నిండింది. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటా.
>
> \- ఎన్టీఆర్

ఒకటి కాదు.. రెండు



హేమలత రెడ్డి

జెమినీ టీవీ యాంకర్‌గా అటు బుల్లితెర ప్రేక్షకులను, 'నిన్ను చూస్తూ' సినిమాతో హీరోయిన్‌గా ఇటు వెండితెర ప్రేక్షకులను అలరించిన హేమలత రెడ్డి ఓ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు.

గ్లామన్ మిసెస్ ఇండియా 2024 అవార్డులో బెస్ట్ టాలెంట్, బెస్ట్ ఫోటోజెనిక్ అవార్డులను దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు బహూకరించిన గ్లోరీ కిరీటంతో హేమలత రెడ్డి అంతర్జాతీయ షూట్ చేశారు.

హేమలత రెడ్డికి ఈ పురస్కారాలు రావడం పట్ల గ్లామన్ డైరెక్టర్ మన్ దువా కూడా తన ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే హేమలత రెడ్డితో కలిసి ఆమె బటుకేశవరా ఆలయాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా గ్లామన్ డైరెక్టర్ మన్ దువా మాట్లాడుతూ, 'హేమలత రెడ్డి మలేషియాలో గ్లామన్ మిసెస్ ఇండియా 2024గా టైటిల్ పొందారు. ఆమె మన దేశాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ని గర్వపడేలా చేసినందుకు మేం ఎంతో సంతోషంగా ఉన్నాం. ఆడిషన్స్ ఇచ్చిన తర్వాత ఈ పురస్కారాల కోసం సంవత్సరం సుదీర్ఘ ప్రయాణం చేశాం. అందాల పోటీల గ్రూమర్‌లు ఆమెకు బాగా శిక్షణ ఇచ్చి, ఆమెలో విశ్వాసాన్ని పెంచారు. తెలుగు ఇండస్ట్రీ నటి కావడంతో అన్ని ప్రయత్నాలు, శిక్షణ తర్వాత ఆమె గ్లామన్ మిసెస్ ఇండియా 2024 టైటిల్ విజేతగా నిలిచింది' అని తెలిపారు.



నయా కామెడీ థ్రిల్లర్ జిగేల్

త్రిగుణ్, మేఘా చౌదరి లీడ్ రోల్స్‌లో రూపొందుతున్న కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డా॥ వై.జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ మూవీ ఫస్ట్‌లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా డైరెక్టర్ హను రాఘవపూడి ఈ చిత్ర టీజర్‌ని లాంచ్ చేశారు.

త్రిగుణ్‌ను లాకర్ టెక్నీషియన్‌గా పరిచయం చేస్తూ మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. హీరో క్యారెక్టరైజేషన్ హిలేరియస్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. అలాగే త్రిగుణ్, మేఘా చౌదరి లవ్‌ట్రాక్ బ్యూటీఫుల్‌గా ఉంది. ఇరవై ఏళ్ళుగా ఎలా తెరవాలో తెలియని ఓ లాకర్‌ని ప్రజెంట్ చేస్తూ వచ్చిన సీక్వెన్స్ చాలా ఉత్కంఠభరితంగా ఉన్నాయి. త్రిగుణ్ చాలా ఎనర్జిటిక్‌గా కనిపించారు. మేఘా చౌదరి తన స్క్రీన్ ప్రజెన్స్‌తో ఆకట్టుకుంది. టీజర్‌లో షాయాజీ షిండే, పోసాని పాత్రలు అలరించాయి. దర్శకుడు కామెడీతో పాటు మంచి థ్రిల్ ఉండే ఎంగేజింగ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని రూపొందిచారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. టీజర్‌లో టెక్నికల్ వ్యాల్యూస్ టాప్ క్లాస్‌లో ఉన్నాయి. మొత్తానికి టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది అని చిత్రయూనిట్ తెలిపింది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది.

రఘు బాబు, పృథ్వీ రాజ్, మధు నందన్, ముక్కు అవినాశ్, మేక రామకృష్ణ, నళిని, జయవాణి, అశోక్, గడ్డం నవీన్, చందన తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్: మల్లి యేలూరి, స్టోరీ – స్క్రీన్ ప్లే: నాగార్జున అల్లం, డీఓపి : వాసు, డైలాగ్స్: రమేశ్ చెప్పాల, నాగార్జున అల్లం, మ్యూజిక్ డైరెక్టర్: ఆనంద్ మంత్ర, ఎడిటింగ్ : కోటగిరి వెంకటేశ్వరరావు, డ్యాన్స్ : చంద్ర కిరణ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఈ ఏడాది 7శాతంలోపు వృద్ధి

సిఈఏ నాగేశ్వర్ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.5-7 శాతం మధ్య చోటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ అన్నారు. శుక్రవారం ఆయన బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బీసీసీఐ) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను బట్టి పరిశీలిస్తే ఇది మెరుగైన వృద్ధి రేటేనని తెలిపారు. కరోనా అనంతరం ప్రపంచ వాణిజ్యం మందగించడంతో మధ్యకాలిక అనిశ్చితులను ఎదుర్కొంటుండగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్రవ్య విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ స్థిరపడిందన్నారు. దేశీయ ఆర్థిక మార్కెట్లు, బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నందున దేశ కరెంట్ ఖాతా బ్యాలెన్స్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. వ్యవసాయేతర ఉద్యోగాల కల్పనకు ఎంఎస్ఎంఈ రంగం కీలకమన్నారు. చిన్న, మధ్యతరహా సంస్థలు మరింత శ్రమశక్తిని పొందేందుకు పెద్ద పరిశ్రమల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్‌లోకి కొత్త రోల్స్ రాయిస్ కారు

ధర రూ.10.50 కోట్లు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కార్లను తయారు చేసే రోల్స్ రాయిస్ కొత్తగా భారత మార్కెట్లోకి తన 'కల్లినన్ ఫేస్‌లిఫ్ట్'ను విడుదల చేసింది. ఇంతక్రితం మోడళ్లతో పోల్చితే ఇందులో అత్యాధునిక ఫీచర్లను పొందుపర్చినట్టు ఆ కంపెనీ తెలిపింది. కాగా దీని ప్రారంభ వేరియంట్ స్టాండర్డ్ వర్షన్ ఎక్స్ షోరూం ధరను రూ.10.50 కోట్లుగా, బ్లాక్ బ్యాడ్జ్ ధరను రూ.12.25 కోట్లుగా నిర్ణయించింది. వచ్చే డిసెంబర్ నుంచి వీటి డెలివరీలను ప్రారంభించే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

సెప్టెంబర్ 30న సుదర్శన్ ఫార్మా బోర్డు భేటీ

హైదరాబాద్ : కెమికల్, ఫార్మాస్యూటికల్ కంపెనీ సుదర్శన్ ఫార్మా ఇండస్ట్రీస్ లిమిటెడ్ బోర్డు సెప్టెంబర్ 30న భేటీ కానుంది. ఇందులో కంపెనీ ఈక్విటీ షేర్ల సబ్-డివిజన్, విభజన ప్రతిపాదనను పరిశీలించే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. ఇటీవల ఈ కంపెనీ సుదర్శన్ మావెన్ ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ పేరుతో కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. దీని ద్వారా అన్ని రకాల ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ, ఆయుర్వేద, ఆహార సప్లిమెంట్ ఉత్పత్తులను తయారు చేయడం, రూపొందించడం, ప్రాసెస్ చేయడంతో పాటు అభివృద్ధి, ఎగుమతులు, దిగుమతులు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

స్టాక్స్ విభజనపై పీసీ జ్యువెలర్స్ దృష్టి!

హైదరాబాద్ : ప్రముఖ ఆభరణాల రిటైల్ చెయిన్ పీసీ జ్యువెలర్స్ స్టాక్స్‌ను విభజించే యోచన చేస్తోందని సమాచారం. సెప్టెంబర్ 30న జరగనున్న కంపెనీ బోర్డు భేటీలో ఈ నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. ప్రస్తుతం రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేసింది. పలు బ్యాంక్‌లకు చెల్లించాల్సిన రుణ బకాయిలను ఇటీవల వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించుకుంది. కంపెనీ తన వినియోగదారులు, విత్త సంస్థల నుంచి విశ్వాసాన్ని పొందాలని నిర్దేశించుకున్నట్టు పేర్కొంది.

వ్యవసాయ సలహాల కోసం హెల్ప్‌లైన్

గోద్రేజ్ ఆగ్రోవేట్

న్యూఢిల్లీ : ఆహార, వ్యవసాయ వ్యాపార సంస్థల్లో ఒక్కటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ కొత్తగా పంటల రక్షణకు సంబంధించిన సలహాలను అందించనున్నట్టు తెలిపింది. ఇందుకోసం హలో గోద్రేజ్ పేరుతో బహుభాషల్లో నిపుణులతో సూచనలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. దేశ వ్యాప్తంగా తెలుగు సహా ఎనిమిది భాషల్లో హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందని తెలిపింది.

భవిష్యత్‌లో శాశ్వత ఉద్యోగాలకు స్వస్తి

ఫిక్కీ సమ్మిట్‌లో నిపుణులు

నవతెలంగాణ - హైదరాబాద్

భవిష్యత్‌లో శాశ్వత ఉద్యోగాలు కానరాకపోవచ్చని టీఎంఐ గ్రూపు ఛైర్మెన్, హెచ్ఆర్ నిపుణులు టి మురళీధరన్ అన్నారు. ఫిక్కీ ది హెచ్ఆర్ ఎవల్యూషన్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగం చేసే పద్ధతులు మారనున్నాయన్నారు. పూర్తి సమయం, శాశ్వత ఉద్యోగుల పద్ధతి సమీప భవిష్యత్‌లో ఉండక పోవచ్చన్నారు. పరిస్థితులకు అనుగుణంగా మార్చుకునేలా పార్ట్‌టైం, కాంట్రాక్టు, గిగ్, ఔట్ సోర్సింగ్ కార్మికులు పెద్ద సంఖ్యలో రానున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ మంది మహిళలు చదువుకుంటున్నారు.. కానీ తక్కువ మంది పని చేయాలని అనుకుంటున్నారన్నారు. మగ యువత కూడా ఇంట్లో కూర్చొని పని చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛైర్మెన్ శ్రీని రాజు చింతలపాటి, శ్రీనిధి స్కూల్ హెడ్ మాల్కం నికల్సన్ తదితరులు పాల్గొని హెచ్ఆర్‌లోని కొత్త పోకడల గురించి మాట్లాడారు.

యుపిలో నరబలి

- రెండవ తరగతి బాలుడి హత్య

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్‌లో మరో ఘోరం జరిగింది. క్షుద్ర పూజల పేరుతో రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల బాలుడ్ని పాఠశాల ఉపాధ్యాయులే వారం క్రితం దారుణంగా హత్య చేసిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని బలి ఇస్తే పాఠశాల మంచి విజయాలు సాధిస్తుందన్న మూఢ విశ్వాసంతో ఉపాధ్యాయులే ఈ ఘాతుకానికి ఒడిగట్టడం దారుణం. బాధిత విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పాఠశాల యజమాని జసోదన్ సింగ్, ఆయన కుమారుడు దినేష్ బఘేల్‌తో బాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏడేళ్ల కృతార్థ్ హత్రాస్‌లోని రంగవాన్‌లోని డిఎల్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నాడు. గత వారం తన కొడుకు ఆరోగ్యం బాగులేదని సోమవారం ఆయనకు కాల్ వచ్చింది. తండ్రి అక్కడికి వెళ్లగా బాలుడ్ని పాఠశాల డైరెక్టర్ తన కారులో ఆస్పత్రికి తీసుకెళ్లారని వార్డెన్ చెప్పాడు. దీంతో హాస్టల్ వద్ద ఆయన వేచిఉన్నాడు. కాసేపటికే మీ కొడుకు చనిపోయాడంటూ కారులో ఉన్న ఆ బాలుడి మృతదేహాన్ని అతనికి స్కూల్ యజ మాని కుమారుడు బఘేల్ అప్పగించాడు. ఆ బాలుడ్ని స్కూల్ దగ్గర ఉన్న గొట్టపు బావి దగ్గర మొదట చంపాలని భావించారు. కానీ, హాస్టల్ నుండి బయటకు తీసుకొస్తున్న సమయంలో బాలుడు అరవడంతో అక్కడే అతని గొంతునులిమి చంపేశారు.

మత ఘర్షణలకు ఆజ్యం : వైఎస్ షర్మిల

అమరావతి : రాష్ట్రంలో మత ఘర్షణలకు ఆజ్యం పోసేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. తిరుమల లడ్డూ వివాదాన్ని సుమోటోగా తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాసినట్లు షర్మిల వెల్లడించారు. జగన్ సర్కారు లడ్డూలో జంతువుల కొవ్వు కలిపితే కూటమి సర్కార్ లడ్డూలో మత రాజకీయాలు కలుపుతోందన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్‌డిడిబి రిపోర్టు కూడా సాక్ష్యాలు ఉన్నాయని, అన్ని ఆధారాలు పెట్టుకున్నా చర్యలు లేవని, చర్యలు లేకుండా మత రాజకీయాలు చేస్తున్నారన్నారు.

ఆవు దూడను ముద్దాడితే చాలా...

- దేశంలో గోగుండాల దారుణాలపై చర్యలేంటి?
- మూకదాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న అమాయకపు ముస్లింలు
- అయినా పట్టని మోడీ సర్కారు, బీజేపీ ప్రభుత్వాలు
- సామాజికవేత్తలు, ప్రజాసంఘ నాయకుల ఆందోళన






న్యూఢిల్లీ : ప్రధాని మోడీ ఇటీవల ఒక ఆవుదూడను ముద్దాడిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఆ ఆవుదూడకు దీప్‌జ్యోతి అని పేరు పెట్టారు. సోషల్ మీడియా వేదికగా స్వయంగా మోడీ ఈ వీడియోను ప్రజలతో పంచుకున్నారు. బీజేపీ, హిందూత్వ శ్రేణులను ఈ వీడియో విపరీతంగానే ఆకట్టుకున్నది. మరికొందరు ఇది మోడీ పీఆర్ టీం ప్రచార తంతుగా అభివర్ణించారు. హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో హిందువుల ఓట్లను ప్రసన్నం చేసుకోవటానికే మోడీ ఇలా ఆవుదూడ వీడియోను సామాజిక మాధ్యమాల్లోకి వదిలారని అంటున్నారు. నోరులేని మూగజీవమైన ఆవుదూడపై ప్రేమ చూపిస్తున్న మోడీ.. దేశ ప్రజలందరికీ ప్రధానిగా ఉన్న ఆయన భారత్‌లో గోరక్షణ పేరిట గోగూండాలు ఒక వర్గం వారి మీద జరుపుతున్న దారుణాలు, మూకదాడులపై ఎందుకు స్పందించటం లేదని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ సర్కారులు గోగుండాలు, హిందూత్వ సంస్థల నాయకుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ దేశంలో హింసాత్మక పరిస్థితులకు దారి తీస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2014 నుంచి 50 వరకు ఘటనలు

అల్ జజీరా వార్తా కథనం ప్రకారం 2014 మోడీ కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆవుకు సంబంధించిన విషయంలో ముస్లింలపై దాదాపు 50 వరకు మూకదాడులు జరిగాయి. ఈ ఘటనల్లో పలువురు బాధితులు పేద కుటుంబాలకు చెందినవారు, రోజువారీ కూలీలే కావటం గమనార్హం. ఫలితంగా బాధిత కుటుంబాల భవిష్యత్తు అంధకారంలో మునిగిపోతున్నది. ఇలా గోగుండాలు జరిపిన ఇలాంటి మూకదాడుల్లో దాదాపు ఏ ఘటనల్లోనూ ఆవు మాంసం లభించిన దాఖలాలు లేకపోవటం గమనించాల్సిన అంశం. కానీ,



బీఫ్ తరలింపు అనుమానాల నేపథ్యంలో గోరక్షకులు జరిపే దాడుల్లో ముస్లింలు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇక యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలైతే అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయి. బీఫ్‌ను కలిగి ఉన్నారన్న ఆరోపణలపై కొందరి ఇండ్ల మీద బుల్డోజర్‌ను ప్రయోగించిన సందర్భాలూ ఉన్నాయని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు గుర్తు చేస్తున్నారు.

దేశంలో ఇంత పెద్ద ఎత్తున గోరక్షకుల దారుణాలు జరుగుతున్నప్పటికీ ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ నోరు తెరవకపోవటాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. ఆవుదూడను ముద్దాడటం ద్వారా హిందువుల ఓట్లను గంపగుత్తగా పొందొచ్చనుకుంటున్న మోడీ.. ఆ ఆవు పేరుతో దాడులకు గురైన ముస్లింల ఆగ్రహానికి గురవతామనే విషయాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల గోగూండాల దాడులు

పశ్చిమ బెంగాల్‌లోని ఫరీదాబాద్‌లో ఆగస్టు నెలలో గోరక్షకులు రెచ్చిపోయారు. ఛర్కీ దాద్రి పట్టణంలో షబీర్ మాలిక్ (26) అనే యువకుడిని బీఫ్ తీసుకున్నాడన్న అనుమానంపై హిందూత్వ శక్తులు కొట్టి చంపాయి. బెంగాల్ వలస కూలీ అయిన షబీర్ మాలిక్ మరణంతో ఆయన భార్య, రెండేండ్ల కుమారుడు ఒంటరివారయ్యారు. ఈనెల 3న 72 ఏండ్ల ముస్లిం వృద్ధుడి పైనా హిందూత్వ కార్యకర్తలు రెచ్చిపోయారు. బీఫ్‌ను తీసుకెళ్తున్నాడని ఆరోపిస్తూ సదరు వృద్ధుడిపై దాడికి దిగారు. అలాగే యూపీలోని అమ్రోహాలో అయితే ఒక స్కూల్ చిన్నారి టిఫిన్ బాక్స్‌లో బిర్యానీ తీసుకొచ్చాడన్న కారణంతో సదరు స్కూల్ ప్రిన్సిపాల్ ఆ చిన్నారిని స్కూల్ నుంచి బహిష్కరించాడు.

మాంసమని తెలిస్తే చాలు.. వారిపై దాడులే

ఇలాంటి ఘటనలను చూస్తే ఒక్క బీఫ్ మాత్రమే కాదు.. మాంసాహారమేదైనా ముస్లింలపై దాడులకు కారణమవుతున్నదని సామాజికవేత్తలు అంటున్నారు. తిండిపేరుతో ఒక వర్గంపై దాడులకు దిగటం, కఠిన చర్యలు తీసుకోవటం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. మందు, మాంసాహారం ప్రత్యేకించి ఒక వర్గం వారు మాత్రమే తీసుకోరనీ, హిందువులు కూడా వీటిని తీసుకునేవారి జాబితాలో ఉన్నారని అంటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) ప్రకారం భారత్‌లో మాంసం వినియోగం రోజురోజుకూ పెరిగిపోతున్నది. వారంలో కనీసం ఒక్కరోజైనా తాము చేపలు, చికెన్, ఇతర మాంసాన్ని తీసుకుంటామని 45.1 శాతం మంది మహిళలు, 57 శాతం మంది పురుషులు ఈ సర్వేలో వెల్లడించటం గమనార్హం. సాక్షాత్తూ ప్రభుత్వ సర్వే గణాంకాలే మాంసం వినియోగంపై వాస్తవాలను బయటపెడుతున్నాయనీ, అలాంటపుడు ఆహారం పేరుతో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయటం ఎంత వరకు కరెక్ట్ అని వారు ప్రశ్నిస్తున్నారు.

'ప్రభుత్వాలు కఠిన నిబంధనలు తేవాలి'


గోరక్షణ పేరుతో గోగుండాలు, హిందూత్వ కార్యకర్తల చర్యలు పరాకాష్టకు చేరుకున్నాయని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. బీఫ్ తరలిస్తున్నారన్న అనుమానంపై ముస్లిం అనుకొని బ్రాహ్మణుడైన హిందూ వ్యక్తిని చంపిన ఘటనలు కూడా దేశంలో ఉన్నాయని వారు ఉదహరిస్తున్నారు. కాబట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి విషయాల్లో కఠిన నిబంధనలు తీసుకురావాలనీ, ఒక వర్గాన్ని తినే తిండి పేరుతో లక్ష్యంగా చేసుకునే చర్యలను నియంత్రించాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.



తిరుమల వెళితే

జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

- విలేకరుల సమావేశంలో చంద్రబాబు



అమరావతి: ప్రతిపక్షనాయకుడు జగన్మోహన్‌రెడ్డి తిరుమల వెళ్లితే దేవాలయ సంప్రదాయం ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం యంత్రం రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల అంశంపై జగన్ చేసిన ఆరోపణలను ఖండించారు. గత ఐదేళ్లలో డిక్లరేషన్ ఇవ్వలేదని జగన్ చెప్పడం సంప్రదాయా లను, చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. దీనికి ఆయన సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని తెలిపారు. అన్యమతస్తులు ఎవ్వరు తిరుమలకు వెళ్లినా డిక్లరేషన్ ఇవ్వడం సాంప్రదాయమని అన్నారు. జగన్‌కు కూడా అదే వర్తిస్తుందని చెప్పారు. 'ముఖ్యమంత్రిగా వెళ్తే ఎవ్వరూ ఏమీ అడగరు. అంతమాత్రాన అంగీకరించినట్లు కాదు. నిబంధనల ను పాటించడం బాధ్యత' అని అన్నారు. తనను తిరుమల వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నా రన్న జగన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ జగన్‌ను తిరుమలకు వెళ్లవద్దని ఎవరూ చెప్పలేదని అన్నారు. ర్యాలీలు, జన సమీకరణలు చేయవద్దని, సాంప్రదాయాలు పాటించాలని మాత్రమే చెప్పామని తెలిపారు. తిరుమలకు వెళ్లవద్దంటూ జగన్‌కు పోలీసులు ఏమైనా నోటీసులు ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. ఇస్తే చూపించాలని అన్నారు. డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే జగన్ వెళ్లడం లేదన్నారు. గతంలో జమ్మూకాశ్మీర్ సిఎం వచ్చినప్పుడు డిక్లరేషన్ ఇచ్చివ వెళ్లారని పేర్కొన్నారు. 'మనది సెక్యులర్ దేశం. మత సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలిగాని మనో భావాలు దెబ్బతీసేందుకు కాదు.' అని చంద్రబాబు అన్నారు.

మీరు ఎలా చెబుతారు?

. 'ఎఆర్ డెయిరి ఎనిమిది ట్యాంకర్లు పంపింది. వాటిలో నాలుగింటిని వాడారు. ఎక్కడ వాడారన్నది తరువాత. మిగిలిన నాలుగింటిలో నెయ్యిని టెస్ట్‌కు పంపారు. కల్తీ జరిగినట్లు వచ్చింది. వాటిని వెనక్కి పంపారు. నివేదిక ఇచ్చింది ఎన్‌డిడిబి, మేం కాదు. అంటే అర్థం ఏమిటి? వాడిన నెయ్యిలో కూడా కల్తీ ఉందనే కదా! లేదని మీరు ఎలా చెబుతారు?' అని జగన్‌మోహన్‌రెడ్డి నుద్దేశించి చంద్రబాబు ప్రశ్నించారు. 'ఇట చెప్పలేదు. నివేదికలు లేవు' అంటూ అబద్దాలు చెబుతున్నారని అన్నారు. టెండర్లు పిలవడానికి ఎందుకు కండీషన్లు ఎందుకు మార్చారన్నారు. ట్రేడర్లను మార్చి నాసిరకం నెయ్యి సరఫరా చేశారని అన్నారు. అనుమానం వస్తే టెస్టుకు పంపించొచ్చని కాంట్రాక్టులో ఉందని, దాన్ని ఓవో చేశారని అన్నారు. జగన్ వ్యాఖ్యలు ఎన్‌డిడిబి రిపోర్టునూ తప్పుబట్టే విధంగా ఉందని పేర్కొన్నారు. రిపోర్టును బయటపెట్టకపోతే తాము తప్పుచేసిన వారిగా మిగిలిపోతామని, అందువల్లే బయట పెట్టామని చెప్పారు. ప్రతి ఏడాది ఆగస్టు 15 తరువాత పవిత్రోత్సవాలు చేస్తారని, ఈ ఏడాది శాంతియాగం కూడా చేశారని తెలిపారు.

తిరుపతిలో టెన్షన్... టెన్షన్

- జగన్ పర్యటనను అడ్డుకుంటామన్న బిజెపి, జనసేన
- భారీగా పోలీసుల మోహరింపు
- డిక్లరేషన్ పేరుతో తిరుపతిలో వెలిసిన బోర్డులు
- పర్యటన రద్దుతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు

తిరుపతి : తిరుపతిలో శుక్రవారం ఉదయం నుంచి టెన్షన్ వాతావరణం నెలకొంది. ఒకవైపు తిరుమల దర్శనానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని ప్రకటించడం, మరోవైపు ఆయన పర్యటనను అడ్డుకుంటామని ఇది వరకే బిజెపి, జనసేన నాయకులు హెచ్చరించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు భారీగా తిరుపతికి చేరుకున్నారు. తిరుమలలో 1000, అలిపిరి వద్ద 1500, ఎయిర్‌పోర్టు వద్ద 1500 మంది మోహరించారు. చివరి నిమిషంలో జగన్ పర్యటను రద్దుకావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. 'శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనానికి వస్తున్నాను.. వైసిపి శ్రేణులు ఎవ్వరూ హడావిడి చేయొద్దు' అని ట్విట్టర్‌లో జగన్‌హన్‌రెడ్డి ట్వీట్ చేయడంతో టిడిపి కూటమి నాయకులు అత్యవసరంగా సమావేశమై శ్రీవారి దర్శనానికి వస్తున్న జగన్‌ను అడ్డుకోరాదని, శ్రీవారి లడ్డూ కల్తీపై శాంతియుతంగా నిరసన తెలుపుతామని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, జనసేన నగర ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. అన్యమతస్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే దేవాదాయ శాఖ యాక్ట్ 311 ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని టిటిడి ఇఒ శ్యామలరావు పేరుతో శుక్రవారం బోర్డులు వెలిశాయి. చివరికి జగన్ పర్యటన రద్దు కావడంతో టిటిడి ఈ బోర్డులను తొలగించింది. వైసిపి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి కార్యకర్తలకు పోలీసులు ముందుగానే నోటీసులు పంపారు. జిల్లావ్యాప్తంగా 30 యాక్ట్ అమల్లో ఉందని, వచ్చే నెల 29 వరకూ ఎవరూ ర్యాలీలు, బహిరంగసభలు నిర్వహించరాదని, నలుగురైదుగురి కన్నా గుమిగూడి ఉండరాదని నోటీసులో పేర్కొన్నారు.

ఓ భక్తుడిలా జగన్ వస్తుంటే అడ్డుకుంటున్నారు : కరుణాకర్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకునేందుకు ఓ భక్తుడిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుంటే టిడిపి కూటమి నేతలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని టిటిడి బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు.

టీటీడీ హైజాక్‌కు కేంద్రం కుట్ర



రాష్ట్ర స్థాయి రైతు సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

- మత రాజకీయాలను బీజేపీ రెచ్చగొడుతోంది
- సీఎం, డిప్యూటీ సీఎం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలి : సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ఏలూరు : తిరుమల తిరుపతి దేవస్థానాన్ని (టిటిడిని) హైజాక్ చేసి తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీన్ని అడ్డుకోకపోతే భవిష్యత్తులో శ్రీశైలం, ద్వారకాతిరుమల, విజయవాడ కనకదుర్గ ఆలయాలతోపాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాలనూ తన వశం చేసుకుని పెత్తనం చేస్తుందని ఎపి రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తొలిరోజు వి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. టిటిడిలో నెలకొన్న లడ్డూ సమస్య మతం రంగు పులుముకుని ఉన్మాదంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండగా, బిజెపి నాయకులు సిబిఐకి అప్పగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. రూ.వేల కోట్లు ఆదాయం వచ్చే టిటిడిని లాగేసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కుంపటి రగిలించి మత రాజకీయాలు చేయాలని బిజెపి చూస్తోందన్నారు. పార్టీల మధ్య గొడవ మత రాజకీయాల కుట్రకు దారి తీస్తోందని, ఇది దేశానికి మంచిది కాదని తెలిపారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ ఏ ఉద్దేశంతో చెబుతున్నారో అర్థం కావట్లేదన్నారు. సంప్రదాయాలను అందరూ గౌరవించాలని, అదే క్రమంలో వర్ణాశ్రమం, అంటరానితనం, స్త్రీల పట్ల వివక్ష వంటి వాటిని వ్యతిరేకించాలని పేర్కొన్నారు. అంతేతప్ప, 'మేము శాసిస్తాం. మీరు అమలు చేయండి' అనే రీతిన ఉండకూడదన్నారు. రాష్ట్రంలోని నాయకులు కేంద్రానికి అవకాశం ఇచ్చే విధంగా మాట్లాడవద్దని హితవు పలికారు.

దీన్ని పవన్‌కల్యాణ్, ఆయన అనుచరులు గుర్తించాలని, రాష్ట్రాన్ని యుపిగా మార్చే అవకాశం ఇవ్వకూడదని అన్నారు. రాష్ట్రంలో ప్రజల మధ్య శాంతి, సామరస్యాలు ఉన్నాయని తెలిపారు. వాటిని చెడగొట్టి మతోన్మాద విస్తరణకు అవకాశం ఇవ్వకూడదన్నారు.

రైతు ఆదాయం పెరిగితేనే దేశాభివృద్ధి

మోడీ ప్రభుత్వ విధానాలు రైతులను చిదిమేస్తున్నాయని వి.శ్రీనివాసరావు తెలిపారు. కంగనా రనౌత్ మాటలు బిజెపి నాయకులకు రైతులపైగల ద్వేషానికి నిదర్శనమన్నారు. దేశం అభివృద్ధి చెందుతోందంటూ మోడీ చెబుతున్న మాటలు పచ్చి అబద్దాలని తెలిపారు. రైతు సంపద ఎక్కడ పెరిగిందని ప్రశ్నించారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్తోందన్నారు. గిట్టుబాటు ధర చట్టం చేసి అమలు చేస్తానని చెప్పిన మోడీ... రైతులను మోసం చేశారని వివరించారు. కార్పొరేట్ల కోసం రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారన్నారు. గిట్టుబాటు ధర చట్టం చేసి దానిని అమలు చేయని వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతుల ఆదాయం పెరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. 30 ఏళ్ల క్రితం వ్యవసాయ రంగంలో 62 శాతం మంది ఉండేవారని, ఇప్పుడు అది 50 శాతానికి పడిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో ఈ పదేళ్లలో నాలుగున్నర లక్షల ఎకరాల వ్యవసాయ భూమి తగ్గిపోయిందన్నారు. ఇది అభివృద్ధా? వినాశనమా? అని ప్రశ్నించారు. సహకార, పంచాయతీ వ్యవస్థలను కేంద్రం తమ చేతుల్లో పెట్టుకుంటోందని, రైతులు తమ హక్కుల కోసం పోరాడితే కేసులు పెడుతోందని తెలిపారు.

వాచ్‌మెన్లపైకి రోడ్డు రోలర్

- అక్కడికక్కడే ఇద్దరూ మృతి







అష్రఫ్ (ఫైల్) సాదిక్

చిత్తూరు : కడు పేదరికంలో ఉన్న కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు తమ ఊరికి సమీపంలోని రహదారి నిర్మాణ పని చేస్తున్న కంపెనీలో రాత్రి వాచ్‌మెన్‌గా పనికి చేరారు. పగటిపూట వారిలో ఒకరు వ్యవసాయ పనులు, ఇంకొకరు స్కూటర్ మెకానిక్ పనిచేస్తున్నారు. తమ కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నారు. పని ప్రదేశంలో వారిని రోడ్ రోలర్ రూపంలో మృత్యువు కబళించింది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామం వద్ద ఓ కంపెనీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తోంది. అదే గ్రామానికి చెందిన అవివాహితులైన అష్రఫ్ (24), సాదిక్ (26) ఆ పనుల వద్ద నెట్ వాచ్‌మెన్లుగా ఏడాదిన్నరగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఎప్పటిలానే విధులకు వెళ్లారు. అర్ధరాత్రి రెండు గంటల వరకూ అక్కడి పరికరాలు, యంత్రాలు, పనులకు కాపలా ఉన్నారు. ఆ తర్వాత వారికి రెప్పలు వాలడంతో సమీపంలోని మట్టి దిబ్బ ప్రదేశంలో కునుకుతీశారు. లైట్ వెలుతురులో రోడ్డు పనులు చేస్తున్న రోడ్ రోలర్ అటుగా వచ్చింది. నిద్రిస్తున్న యువకులను గుర్తించని రోలర్ డ్రైవర్ వారిపైకి దూసుకెళ్లాడు. దీంతో, యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకొని ఇద్దరి మృతదేహాలను చూసి గుండెలవిసేలా విలపించారు. కుటుంబాలకు చేదోడువాదోడు నిలిస్తూ అందరితో సఖ్యతగా ఉంటున్న యువకుల మృతితో గ్రామం శోకసంద్రమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.